


తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త





epaper.vaartha.com WWW.VAARTHA.COM

నిజామాబాద్

: fb.com/vaartha Digital

Published from Nizamabad, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

17-2-2026 మంగళవారం సంపుటి: 32 సంచిక: 17 పేజీలు: 10+4 వెల: 6.50







ఉండవల్లిలోని వ్యవసాయక్షేత్రంలో మహిళా రైతులతో మాట్లాడుతున్న బిల్‌గేట్స్. చిత్రంలో ఏపి సిఎం చంద్రబాబు నాయుడు

## ఉండవల్లిలోని వ్యవసాయక్షేత్రాన్ని సందర్శించిన బిల్‌గేట్స్

**విజయవాడ,ఫిబ్రవరి16, ప్రభాతవార్తప్రతినిధి:** ఉండవల్లిలోని వ్యవసాయ క్షేత్రాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబుతో కలిసి గేట్స్ ఫౌండేషన్ చైర్మన్ బిల్‌గేట్స్ సందర్శించారు. అక్కడ ప్రకృతి సాగుఉత్పత్తులను పరిశీలించారు. రాష్ట్ర వ్యవసాయ రంగంలో అవలంభిస్తున్నఏఐ సహా ఇతర సాంకేతిక విధానాల గురించి అధికారులు ఈ సందర్భంగా వివరించారు. డ్రోన్ల సాయంతో పంటల్లో చీడపీడలు నివారిస్తున్న తీరును స్వయంగా పొలంలోకి వెళ్లి గేట్స్ తిలకించారు. అనంతరం అక్కడ రైతులతో బిల్‌గేట్స్ ముఖాముఖిచర్చించారు. వ్యవసాయక్షేత్రానికి చేరుకున్న సిఎంకు, బిల్‌గేట్స్‌కు మహిళా రైతులు స్వాగతం పలికారు. వారు వండి తీసుకుచ్చిన స్థానిక వంటలను బిల్ గేట్స్ రుచి చూశారు.

## ప్రపంచం చూపు భారత్ వైపు

>> చర్చకు ప్రపంచాన్ని ఒకే వేదికపై తీసుకువస్తున్నాం. ఢిల్లీలోని భారత్ మండపంలో జరిగే ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ కోసం ప్రపంచ నలుమూలల వచ్చిన నాయకులు, పారిశ్రామిక వేత్తలు, ఇన్నోవేటర్లు, పాలసీ మేకర్లు, టెక్ నిపుణులను స్వాగతిస్తున్నా. ఇది మా దేశానికి గర్వకారణం. అలాగే భారత యువత సామర్థ్యాన్ని ప్రపంచానికి చూపిస్తోంది. సైన్స్, టెక్నాలజీ రంగాల్లో భారత్ వేగంగా అభివృద్ధి చెందుతోంది. ప్రపంచ అభివృద్ధికి భారత్ సహకారాన్ని అందిస్తోందనడాన్ని ఈ సమ్మిట్ మరింత బలపరుస్తుంది" అని ప్రధాని మోడీ రాసుకొచ్చారు.

## 'చేతి'లోనే 86 పీఠాలు

>> 86 పీఠాలను కాంగ్రెస్ దక్కించుకుని ముందు వరుసలో నిలిచింది. పూర్తి ఆధిక్యం ఉన్న పట్టణాల్లో ఏకపక్షంగా మున్సిపాలిటీలను చేజిక్కించుకోగా బలం లేనిచోట ఎంఐఎం, ఇండిపెండెంట్లు, ఎక్స్ అఫిషియో అస్త్రంతో మున్సిపాలిటీలను తమ ఖాతాలో వేసుకుంది. కాంగ్రెస్ మద్దతుతో 4చోట్ల ఇండిపెండెంట్లు, ఒక చోట ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ మున్సిపాలిటీ చైర్మన్ పదవలును దక్కించుకున్నాయి. బీఆర్ఎస్ 18 మున్సిపాలిటీ చైర్మన్ పదవులను దక్కించుకోగా బీజేపీ నారాయణపేట మున్సిపాలిటీతో సరిపెట్టుకుంది. పార్టీల ఎత్తుకు పైఎత్తులతో అనేక మున్సిపాలిటీల్లో నాటకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి. ఉమ్మడి నల్గొండ జిల్లాలో తిరుమలగిరి మినహా అన్ని మున్సిపల్ పీఠాల్ని కాంగ్రెస్ కైవసం చేసుకుంది. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో 14 మున్సిపాలిటీలను హస్తగతం చేసుకుంది.

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 10 మున్సిపాలిటీల్ని దక్కించుకుంది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 5 మున్సిపాలిటీల్ని చేజిక్కుంది. 2చోట్ల కాంగ్రెస్ కూటమి విజయం సాధించింది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఏడింటికి ఏడు మున్సిపాలిటీల్ని కాంగ్రెస్ కైవసం చేసుకుంది. ఉమ్మడి మెదక్ జిల్లాలో 9 మున్సిపాలిటీలను దక్కించుకుంది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో 9 మున్సిపాలిటీలు దక్కించుకుంది. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో 10 మున్సిపాటీలను చేజిక్కుంచుకుంది. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో ఏడింటికి ఏడు మున్సిపాలిటీలను కైవసం చేసుకుంది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఆరింటిలో పాగా వేసింది.: బీఆర్ఎస్ మొత్తం మున్సిపాలిటీ పీఠాలను దక్కించుకుంది. గడ్డపోతారం, గుమ్మడిదల, ఇస్నాపూర్, జిన్నారం, ఆలంపూర్, అయిజ, మూడు చింతలపల్లి, ఎల్లంపేట, దుబ్బాక, రాయికల్, ఆసిఫాబాద్, తిరుమలగిరి, గజ్వేల్, చేర్యాల, జమ్మికుంట, సిరిసిల్ల, తూఫ్రాన్ పురపాలికల్లో గులాబీ జెండా ఎగురవేసింది. బీజేపీ నారాయణపేట మున్సిపాలిటీని దక్కించుకోగా ఆలిండియా ఫార్వార్డ్ బ్లాక్ వడ్డేపల్లి మున్సిపాలిటీని చేజిక్కుంచుకుంది. పార్టీల మద్దతుతో జమ్మికుంట,మహబూబాబాద్,భైంసా,ఆదిలాబాద్ మున్సిపాలిటీ పీఠాన్ని స్వతంత్రులు కైవసం చేసుకున్నారు. అంతకుముందు పాలకవర్గాలు కొలువుదీరడంతో కౌన్సిలర్లు, ఛైర్‌పర్సన్‌లు ప్రమాణ స్వీకారం చేశారు.

**కాంగ్రెస్ మున్సిపల్ చైర్మన్లు వీరే:** అశ్వరావుపేట– జూపల్లి శశికళ, పర్కాల్–సునిల్ కుమార్, ధరంపురి– వేముల నాగలక్ష్మీ, జగిత్యాల్–సమిండ్ల వాణి, కోరుట్ల–వసంత,మెట్‌పల్లి–మైలారపు లింబాద్రి, స్టేషన్‌ఘన్‌పూర్–వనయ్‌కుమార్, భూపాలపల్లి– కొము రయ్య, గద్వాల్–జయలక్ష్మీ, బాన్సువాడ–విజయ, బిచుకుంద–సీమా శేఖర్, కామారెడ్డి–ఉమారాణి, ఎల్లారెడ్డి–పద్మా శ్రీకాంత్, చొప్పదండి– సరిత, హుజురాబాద్ – సుహాసిని, ఎదులాపురం–అనిత, కల్లూరు–ధరావత్ మోహన్, మధిర–సామినేని సుజాత, సత్తుపల్లి–రహనాబేగం, వైరా–చంద్రకళ, కేసముద్రం–సునీత, మరిపెడ–ప్రగతి, భూత్‌పూర్–బాలకోటి, దేవరకద్ర–దమయంతి. మహబూబ్ నగర్– మమత, బెల్లంపల్లి–స్వాతి, చెన్నూర్–పద్మ, లక్షెట్టిపేట్–అంజలి, మెదక్–రాధిక, నర్సాపూర్–లక్ష్మీ, రామాయంపేట–లావణ్య, అలియాబాద్–శరీష, ములుగు–చంద్రకళ, కల్వకుర్తి–రత్నమాల, కొల్లాపూర్–జ్యోతి, నాగర్‌కర్నూల్–సునేంద్ర కుమార్, చండూర్–శ్రీనివాసులు, చిట్యాల–గీత, దేవరకొండ–శైలజ, హాలియా–చింతల చంద్రారెడ్డి, మిర్యాలగూడ–సుధ, నందికొండ–మానస స్వర్ణ, కోస్గీ–నరేందర్, మద్దూర్–సరస్వతి, మక్తల్–మానస, నిర్మల్–కావ్య, ఆర్మూర్–లహరి, భీంగల్–నాగమణి, బోధన్–పద్మ, మంథని–శ్రీనివాస్–పెద్దపల్లి–మల్లయ్య, వేములవాడ–రాజు, చేవెళ్ల–సమత, మొయినాబాద్–సోనియా, షాద్‌నగర్–బసవేశ్వర్, శంకరపల్లి –ప్రవీణ్‌కుమార్, ఆందోల్–జోగిపేట్–కృష్ణారెడ్డి, కోహీర్–అశోక్, నారాయణఖేడ్–నగేశ్‌కుమార్, సదాశివపేట–అంజమ్మ, సంగారెడ్డి–వనిత, హుస్నాబాద్–లక్ష్మీ, హుజూర్‌నగర్–శ్రీనివాస్, కోదాడ–కుసుమకుమారి, నేరెడుచర్ల–వెంకట్‌రెడ్డి, సూర్యపేట–నివేదిత, కొడంగల్–ప్రశాంత్‌కుమార్, పరిగి–రజిత, తాండూర్–నీరజ, వికారాబాద్–గడ్డం అనన్య, ఆత్మకూర్–నాగమణి, కొత్తకోట–అరుణ, పెబ్బేర్–శ్రీనివాస్, వనపర్తి–మాధవి, నర్సంపేట్–లక్ష్మీ, వర్ధన్నపేట్–సారంగపాణి, ఆలేరు–బాలమణి, భువనగిరి–శ్రీవాణి, చౌటుప్పల్–పావని, మోత్కూర్–స్వప్న, పోచంపల్లి–వెంకటేశ్వర్లు, యాదగిరిగుట్ట–జి.వాణి మున్సిపల్ చైర్మన్లుగా ఎంపికయ్యారు.

**బిఆర్ఎస్ మున్సిపల్ చైర్మన్లు వీరే:** రాయికల్–రవిందర్, ఆలంపూర్–జయరాముడు, ఐజ–సిఎం సురేష్, ఆసిఫాబాద్–అకాశ్, తూఫ్రాన్–రజని, మూడు చింతలపల్లి–రవి, ఎల్లంపేట్–శ్రీదేవి, ఆమంగల్– పత్యానాయక్, సిరిసిల్ల–కళ, గడ్డపోతారం–సుష్మ, గుమ్మడిల–కుమార్‌గౌడ్, హిస్నాపూర్–సుమలత, జన్నారం–జనార్ధన్, చేర్యాల–అరుణ, దుబ్బాక–సంగీత, గజ్వేల్–చందన, తిరుమలగిరి– రఘునంద న్‌రెడ్డి, అమరచింత–సువర్ణ మున్సిపల్ చైర్మన్లుగా ఎంపికయ్యారు.

**ఇండిపెండెంట్ మున్సిపల్ చైర్మన్లు వీరే:** ఆదిలాబాద్–అనూష, జమ్మికుంట–ప్రశాంత్‌కుమార్, మహబూబాబాద్–జ్యోతి, భైంసా–దత్తాత్రి మున్సిపల్ చైర్మన్‌గా ఎంపికయ్యారు.

**బిజెపి మున్సిపల్ చైర్మన్:** నారాయణపేట–స్వేత మున్సిపల్ చైర్‌పర్సన్‌గా ఎంపికయ్యారు. **ఎఐఎఫ్‌బి మున్సిపల్ చైర్మన్:** వడ్డేపల్లి–మంజుల మున్సిపల్ చైర్‌పర్సన్‌గా ఎంపికయ్యారు.

## బోనస్

>> రైతులకు మాత్రమే ఈ పథకం వర్తిస్తుంది. ధాన్యంలో తేమశాతం, గింజ నాణ్యతను బట్టి ఈ బోనస్ ఖరారు చేస్తారు. గత కొంతకాలంగా బోనస్ చెల్లింపుల్లో జాప్యం జరుగుతోందని ఆందోళన వ్యక్తం చేసిన రైతులకు ఈ తాజా నిర్ణయం పెద్ద ఊరటనిచ్చినట్లయింది. పంట పెట్టుబడి పెరిగిపోయి ఇబ్బందులు పడుతున్న రైతులకు ఈ అదనపు రూ.500 తోడుగా నిలవనుంది. వ్యవసాయాన్ని మరింత లాభదాయకంగా మార్చడం, సాగును ప్రోత్సహించడానికి ప్రభుత్వం వరి క్వింటాల్‌పై రూ.500 బోనస్ ఇస్తున్న విషయం తెలిసిందే. ఇచ్చిన మాట ప్రకారం అధికారంలోకి వచ్చిన తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం సన్న రకం వడ్లను పండించే రైతులకు క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇవ్వడాన్ని అమలు చేస్తోంది. ప్రభుత్వం ఇచ్చిన మాటలను నిలబెట్టుకోవడం రైతుల్లో ప్రభుత్వంపై నమ్మకాన్ని మరింతగా పెంచిందని వ్యవసాయ నిపుణులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అయితే తాజాగా బకాయిల చెల్లింపునకు నిర్ణయం తీసుకున్న సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ... రాష్ట్రంలో అన్నదాతలకు అండగా ఉంటూ వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం వరి క్వింటాల్‌పై రూ.500 బోనస్ ఇస్తోందని తెలిపారు. తాజాగా ఈ బకాయిలు చెల్లింపుతో రైతులకు ఆర్థిక ఉపశమనం లభించనుందన్నారు. సన్నాల బోనస్ కింద రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటి వరకు రూ.1939.58 కోట్ల నిధులను విడుదల చేసిందని వివరించారు. సన్న ధాన్యానికి కనీస మద్దతు ధర కంటే రూ.500 బోనస్ అదనమని పేర్కొన్నారు.

## 'ఫ్యూచర్'లో హెల్త్‌సిటీ

>> యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ శాశ్వత క్యాంపస్‌ను లాంఛనంగా ప్రారంభిస్తామన్నారు. హైదరాబాద్‌కు ధీటుగా రాష్ట్రంలోని టైర్ 2, టైర్ 3 నగరాలను కూడా తీర్చి దిద్దాలనే లక్ష్యంతో ముందుకెళ్తున్నామన్నారు. ఈ ప్రాంతాల్లో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావాలని పారిశ్రామికవేత్తలను ఆహ్వానించారు. వరంగల్, ఆదిలాబాద్‌లో కొత్త విమానాశ్రయాల అభివృద్ధికి శ్రీకారం చుట్టామన్నారు. హెల్త్ కేర్ రంగంలో టెక్నాలజీ మిళితం చేసి నూతన ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టే ఆవిష్కర్తలను రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాలుగా ప్రోత్సహిస్తోందని, తమతో కలిసి పని చేసేందుకు ముందుకు రావాలని వారిని ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు సాయి, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

### వారం – వర్జ్యం

17-02-2026, మంగళవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
మాఘమాసం, ఉత్తరాయణం
శిశిర ఋతువు, కృష్ణపక్షం, ధనిష్ఠ కార్తె
అమావాస్య సా.5.27
ధనిష్ఠ రా.9.12
వర్జ్యం : తె.4.24-6.00
దు.ఉ.8.53-9.40, 2) రా.10.50-11.37
రాహుకాలం – మ.3.00-4.30

### వార్తాఫలం

**మేషం:** మీ వ్యక్తిగత విషయములను బయటకు వెల్లడి చేసే వ్యక్తులతో జాగ్రత్తగా ఉండుట మంచిది. విదేశీయాన యత్నాలు ఫలిస్తాయి.

**వృషభం:** ఆలోచనలతో మీ మనస్సును ఆందోళనకు గురి చేయకండి. పొదుపుకు సంబంధించి పురోగతి సాధిస్తారు.

**మిథునం:** పెద్దలతో సంభాషించునప్పుడు, సంయమనమును పాటించండి. కాంట్రాక్టులు దక్కుతాయి.

**కర్కాటకం:** ఆర్థిక సంబంధిత విషయముల మీద మీ దృష్టిని కేంద్రీకరించ వలసి వస్తుంది. ఆభరణాలు కొనుగోలు చేస్తారు.

**సింహం:** మీ కార్యచరణకు సంబంధించిన ప్రణాళికలు వలువరితో ముడిపడి ఉండడం వలన పురోభివృద్ధి ఉండదు.

**కన్య :** మీకు అనుకూలంగా వ్రాయబడిన దస్తావేజులలో ముఖ్యమైన పత్రాలలో కొన్ని లోపాలను గమనిస్తారు.

**తుల :** ఇష్టపడి కొనుగోలుచేసినా వాటిని తిరిగి మార్పుచేయాలని యోచిస్తారు. మిత్రుల సలహాలు, పోరు విసుగు కలిగిస్తాయి

**వృశ్చికం:** ధనమే అన్నిటికి మూలమని రూఢీ చేసుకుంటారు. తప్పనిసరి పరిస్థితులలో అప్పు చేయవలసి రావచ్చు.

**ధనుస్సు:** ఎంత పనిచేసినా సవతిప్రేమ చూపే ఉన్నతాధికారుల వైఖరి కొంత నిరాశకు గురిచేస్తుంది. ప్రయాణాలు.

**మకరం:** మనపని మనం చేసుకుపోతే ఏనాటికి ఫలితాలు అనుకూలంగానే ఉంటాయని భావిస్తారు. ప్రముఖుల కలయిక.

**కుంభం:** వృత్తి, ఉద్యోగములలో మీరు ఆశించిన మార్పులు, బదిలీలు జరుగు తాయి. మానసిక ధైర్యం అన్నిటి కన్నా గొప్పదని గుర్తించండి.

**మీనం:** అనాలోచితంగా మీరు పెట్టిన పెట్టుబడులకు కొద్దిపాటి నష్టము కలుగవచ్చును. క్రమశిక్షణ మరింత మేలు

– శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# ఆ ఐదు ఊళ్లివ్వండి

>> ప్రజలు దాదాపు 8 గంటలు ప్రయాణించాల్సి వస్తోందని పేర్కొన్నారు. అంతర్రాష్ట్ర చెక్‌పోస్టులు, పన్నులు, పరిపాలనా అనుసంధానం లోపం, భద్రతా సమస్యలు తదితర అంశాలు స్థానిక గిరిజన ప్రజల జీవన విధానాన్ని ప్రభావితం చేస్తున్నాయని వివరించారు. ఈ మేరకు అమరావతి వెళ్లిన మంత్రి తుమ్మల సోమవారం అక్కడ ఏపీ సీఎంను కలిశారు. ఖమ్మం జిల్లాలోని పెద్దవాగు సాగునీటి ప్రాజెక్ట్ శాశ్వత మరమ్మత్తులు అత్యవసరంగా చేపట్టాల్సిన అవసరం ఉందని విన్నవించారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా మొత్తం 16,000 ఎకరాలకు సాగునీరు అందుతుండగా, అందులో సుమారు 13,640 ఎకరాలు (85.25శాతం) ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో, 2,360 ఎకరాలు (14.75శాతం ) తెలంగాణ రాష్ట్రంలో ఉన్నాయని తెలిపారు. ఈ ప్రాజెక్టుతో రెండు రాష్ట్రాలకు లబ్ధి చేకూరుతున్న నేపథ్యంలో ఖర్చును 85:15 నిష్పత్తిలో భరించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. రైతుల సాగు, జీవనాధారం ఈ ప్రాజెక్ట్‌పై ఆధారపడి ఉన్నందున తక్షణ ఆర్థిక సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు.


ఇటీవల ఆంధ్రప్రదేశ్ పరిధిలో గోదావరి వరద రక్షణ కరకట్టలోని 3వ స్లూయిస్ వద్ద గోడ దెబ్బతిన్న విషయం కూడా మంత్రి ప్రస్తావించారు. కరకట్టలోని కొంత భాగం విభజన అనంతరం ఆంధ్రప్రదేశ్ పరిధిలోకి వెళ్లడంతో నిర్వహణలో సమస్యలు ఏర్పడ్డాయని తెలిపారు. తక్షణ సాంకేతిక పరిశీలన చేసి తాత్కాలిక రక్షణ చర్యలు చేపట్టడంతోపాటు రెండు రాష్ట్రాల సమన్వయంతో శాశ్వత పునరుద్ధరణ చర్యలు ప్రారంభించాలని ఏపీ సీఎంను కోరారు. ఖమ్మం పట్టణంలో శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయ నిర్మాణానికి అవసరమైన భూమి గుర్తింపు పూర్తైందని, తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో పనులు ప్రారంభించేందుకు అనుమతి ఇవ్వాలని మంత్రి కోరారు. తిరుమలలో తెలంగాణ భక్తుల కోసం ప్రత్యేక యాత్రికుల భవనం నిర్మాణానికి సుమారు 5 ఎకరాల భూమి కేటాయించాలని మంత్రి ప్రతిపాదించారు. సత్తుపల్లి కొవ్వూరు రైల్వే లైన్, పెనుబల్లి అమరావతి రైల్వే లైన్ నిర్మాణానికి సహకరించాలని కోరారు. ఈ ప్రతిపాదనలపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సానుకూలంగా స్పందించి తక్షణ చర్యలు తీసుకుంటుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

## ప్రముఖ ఒడియా గాయని గీతాపట్నాయక్ కన్నుమూత

**కటక్, ఫిబ్రవరి 16:** ప్రముఖ ఒడియా గాయని గీతాపట్నాయక్ ఆసుపత్రిలో చికిత్సపొందుతూ కన్నుమూసారు. 73ఏళ్ల గీతాపట్నాయక్ తొలుత క్యాపిటల్ ఆసుపత్రిలో చేరారు. రెండురోజులముందు ఈక కార్యక్రమంలో పాల్గొన్న గీతా అకస్మాత్తుగా స్పృహతప్పి పడిపోవడంతో ఆమెను హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. వైద్యపరీక్షల్లో ఆమెకు బ్రెయిన్‌స్ట్రోక్ వచ్చిందని వైద్యులు తేల్చారు. దీనితో ఆమెను కటక్‌లోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఆదివారం సాయంత్రం వైద్యులు ఆమె తుదిశ్వాస విడిచినట్లు వైద్యులు ప్రకటించారని ఆమె వదిన ప్రదోష్ పట్నాయక్ తెలిపారు. సోమవారమే ఆమె భౌతికకాయాన్ని నివాసానికి తరలించి వెనువెంటనే అంత్యక్రియలు ముగించారు. కొన్ని దశాబ్దాలపాటు ఆమె ఒడియా గాయనిగా పేరుప్రసిద్ధి పొందారు.

# దాడులు, కిడ్నాప్‌లు.. బలప్రదర్శనలు

>> జనగాంలో చైర్మన్, వైస్ చైర్మన్ల ఎన్నికను అధికారులు వాయిదా వేశారు. మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మున్సిపాలిటీలో చైర్మన్ ఎన్నిక సందర్భంగా తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. తొర్రూరులో 16 వార్డులు ఉండగా బీఆర్ఎస్ 9, కాంగ్రెస్ 7 గెలుచుకున్నాయి. దీంతో ఎక్స్ అఫీషియో ఓట్లు కీలకంగా మారాయి. ఎక్స్ అఫీషియో సభ్యులుగా ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి తమ పేర్లు నమోదు చేసుకున్నారు. ఎక్స్‌అఫీషియో ఓట్లతో బలాబలాలు సమానమయ్యాయి. ఈ నేపథ్యంలో కడియం కావ్య ఓటుపై అభ్యంతరం చేస్తూ బీఆర్ఎస్ నాయకులు ఆందోళనకు దిగారు. వరంగల్‌లో ఎక్స్‌అఫీషియో సభ్యురాలిగా కావ్య పేరు ఉందని ఆరోపిస్తూ మున్సిపల్ కమిషనర్‌కు బీఆర్ఎస్ నాయకులు వినతిపత్రం అందజేశారు. దీంతో కాంగ్రెస్, బీఆర్ఎస్ కార్యకర్తలు ఒకరికొకరు పోటాపోటీగా నినాదాలు చేసుకున్నారు. ఒక దశలో ఇరువర్గాల వాళ్లు దాడి చేసుకునేంత పరిస్థితి వచ్చింది. కాగా, ఇబ్రంహీపట్నం మున్సిపల్ కార్యాలయం వద్ద ఉద్రిక్తత నెలకొంది. మున్సిపల్ ఛైర్మన్, వైస్‌ఛైర్మన్ మంగళవారం నాటికి ఎన్నిక వాయిదా పడటంతో ఆందోళన నెలకొంది. కాంగ్రెస్., బీఆర్ఎస్ శ్రేణులను పోలీసులు అడ్డుకున్నారు. మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మున్సిపల్ ఛైర్మన్, వైస్‌ఛైర్మన్ ఎన్నిక వాయిదా పడింది. కోరం లేకపోవడంతో ఎన్నికను వాయిదా వేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందు మున్సిపల్ పాలకవర్గం ప్రమాణ స్వీకారం మంగళవారంకు వాయిదా పడింది. ప్రమాణస్వీకారానికి 21 మంది సభ్యులు హాజరుకాకపోవడంతో వాయిదా వేశారు.పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మున్సిపల్ ఛైర్మన్ ఎన్నిక మంగళవారం నాటికి వాయిదా పడింది. ఛైర్మన్, వైస్‌ఛైర్మన్ పేర్లను పార్టీలు ఖరారు చేయకపోవడంతో ఎన్నిక వాయిదా వేశారు. సంగారెడ్డి జిల్లా ఇంద్రేశం మున్సిపల్ ఛైర్మన్ ఎన్నిక మంగళవారంనాటికి వాయిదా పడింది. కోరం లేనందున ఎన్నిక వాయిదా వేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మున్సిపాలిటీ కార్యాలయం వద్ద ఉద్రిక్తత నెలకొంది. చౌటుప్పల్ 13వ వార్డు నుంచి కౌన్సిలర్‌గా గెలిచిన బత్తుల వాణి మున్సిపల్ ఛైర్ పర్సన్ ఇస్తారని భావించారు. చివరి క్షణంలో మరొక అభ్యర్థి పావనికి ఛైర్ పర్సన్ ఇస్తున్నారని తెలిసి బత్తుల వాణి మద్దతుదారులు ఆందోళనకు దిగారు. స్థానికేతరులకు ఛైర్‌పర్సన్ పదవీ ఎలా ఇస్తారని ఆందోళన చేపట్టారు. సిరిసిల్ల మున్సిపల్ పాలకవర్గ ప్రమాణ స్వీకారోత్సవంలో రసాభాస నెలకొంది. సిరిసిల్ల వైస్‌ఛైర్మన్‌గా బుర్రా నారాయణ పేరును మాజీ మంత్రి కేటీఆర్ ప్రకటించారు. సీల్డ్ కవర్‌లో బుర్రా నారాయణ పేరు లేకపోవడంతో బీఆర్ఎస్ శ్రేణుల ఆగ్రహానికి గురయ్యారు. సీల్డ్ కవర్‌లో ఛైర్మన్‌గా కళా చక్రపాణి, వైస్‌ఛైర్మన్‌గా సందీప్ పేర్లు ఉన్నట్లు సమాచారం అందడంతో శ్రేణులు ఆందోళనకు దిగాయి. జనగామ మున్సిపాలిటీలో రాజకీయాలు ఉత్కంఠ రేకెత్తిస్తున్నాయి. జనగామలో 30 వార్డులకుగానూ మిత్రమైన పక్షమైన సీపీఎం గెల్చుకున్న ఒకవార్డుతో కలిసి కాంగ్రెస్ కూటమికి 13 వార్డులు దక్కగా విపక్ష బీఆర్ఎస్ కూడా అంతే సమానంగా 13 వార్డులు గెలుచుకుంది. భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, సిట్టింగ్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వరరెడ్డి ఎక్స్ అఫీషియో సభ్యులుగా ఓటు నమోదు చేసుకోవడంతో ఇరుపార్టీలు మళ్లీ చెరో 14 ఓట్లతో సమంగా ఉన్నాయి. దీంతో జనగామ ఛైర్మన్ పీఠం కైవసం చేసుకోవడంలో స్వతంత్రులే కీలకంగా మారారు. ప్రమాణస్వీకారం క్యాంపుల నుంచి జనగామ మున్సిపల్ కేంద్రం వద్దకు చేరుకున్న బీఆర్ఎస్ కౌన్సిలర్ల వాహనాల్ని పోలీసులు అడ్డుకున్నారు. 28వ వార్డు కౌన్సిలర్‌ను కిడ్నాప్ చేశారని ఆమె మరిది కంప్లైంట్ మేరకు ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు చెప్పిన డీసీపీ ఆమెను వదిలి వెళ్లాలని కోరారు. ఈ నేపథ్యంలో డీసీపీకి పలా రాజేశ్వర్‌రెడ్డికి మధ్య వాగ్వాదం జరిగింది. చివరకు అక్కడ ఎన్నికను వాయిదా వేశారు. మంచిర్యాల జిల్లా క్యాతనపల్లి మున్సిపల్ ఆఫీసు వద్ద ఉద్రిక్తత నెలకొంది. అభ్యర్థులతో కలిసి వచ్చిన బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు బాల్క సుమన్‌ను పోలీసులు అడ్డుకోవడంతో వాగ్వాదం జరిగింది. దీంతో అభ్యర్థులతో కలిసి బాల్క సుమన్ రహదారిపై బైఠాయించి నిరసన తెలిపారు. అప్పుడే.. మున్సిపల్ కార్యాలయం వద్దకు చేరుకున్న కాంగ్రెస్ శ్రేణులు సుమన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కోరం లేక ఛైర్మన్, వైస్‌ఛైర్మన్ ఎన్నికను మంగళవారం నాటికి వాయిదా వేసినట్టు అధికారులు వెల్లడించారు. ఇక్కడ ఎక్స్ అఫీషియో ఓట్లు వేసేందుకు మంత్రి వివేక్ వెంకట స్వామి, ఆయన కుమారుడు ఎంపీ గడ్డం వంశీకృష్ణ నమోదు చేసుకున్నారు. ఛైర్మన్ ఎన్నిక వాయిదా పడిన మున్సిపాలి టీలు ఇవే:–ఇల్లందు, సుల్తానాబాద్, ఇబ్రహీంపట్నం,కాగజ్‌నగర్, క్యాతనపల్లి,ఖానాపూర్, జహీరాబాద్, ఇంద్రేశం, డోర్నకల్, జనగాం,తొర్రూర్ మున్సిపాలిటీల్లో వివిధ కారణాల వల్ల ఛైర్మన్, వైస్ ఛైర్మన్ ఎన్నికలు వాయిదా పడ్డాయి.



వికారాబాద్ మునిసిపల్ ఛైర్మన్‌గా ఎన్నికైన అనన్యను అభినందిస్తున్న అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్

# కొలువుదీరిన కొత్త మేయర్లు

>> మమత ఎన్నికయ్యారు. డిప్యూటీ మేయర్ పదవి మారేపల్లి సురేందర్ రెడ్డిని వరించింది.రామగుండం కార్పొరేషన్ మేయర్‌గా కాంగ్రెస్ మద్దతుదారుడు మహంకాళి స్వామి ప్రమాణ స్వీకారం చేశారు. డిప్యూటీ మేయర్‌గా ఎల్లయ్యను ఎన్నుకున్నారు.కరీంనగర్ మేయర్ పీఠంను ఎట్టకేలకు బీజేపీ కైవసం చేసుకుంది. మేయర్‌గా కొలగాని శ్రీనివాస్ ఎన్నికయ్యారు. ఇండిపెండెంట్లతో కలిపి 34 మంది కార్పొరేటర్ల మద్దతుతో మేయర్ పీఠాన్ని ఆ పార్టీ దక్కించుకుంది. డిప్యూటీ మేయర్‌గా చెందిన సునీల్‌రావు నియమితులయ్యారు. కరీంనగర్ మేయర్ పీఠాన్ని దక్కించుకోవడంలో కేంద్రమంత్రి బండి సంజయ్ వ్యూహాత్మకంగా వ్యవహరించారు. మేయర్ పదవికి పోటీ పడ్డ కాంగ్రెస్ అభ్యర్థికి 21 ఓట్లు వచ్చాయి. బీఆర్ఎస్ తటస్థంగా వ్యవహరించింది. మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీ అత్యధిక చోట్ల పాగా వేసే దిశగా వెళ్లింది. రామగుండంలో ఏకపక్ష విజయాన్ని నమోదు చేసింది. మొత్తం 60 డివిజన్లలో కాంగ్రెస్ 38 గెలుపొంది ఆధిక్యత ప్రదర్శించింది. బీఆర్ఎస్ 13 స్థానాలకే పరిమితం అయ్యింది. బీజేపీ ఒకటి, ఇతరులు 8 స్థానాలలో గెలుపొందారు. నల్గొండలో 48 స్థానాలు ఉండగా కాంగ్రెస్ 27 చోట్ల గెలుపొందింది. మేయర్ పీఠాన్ని దక్కించుకుంది. బీఆర్ఎస్ 9, బీజేపీ 4 చోట్ల గెలుపొందారు. ఇతరులు 8 చోట్ల నెగ్గారు. మంచిర్యాలలో కాంగ్రెస్ విజయదుందుభి మోగించింది. మొత్తం 60 డివిజన్లు ఉండగా 44 స్థానాల్లో కాంగ్రెస్ పాగా వేసింది. బీఆర్ఎస్ 8, బీజేపీ 5 చోట్ల గెలుపొందారు. ఇతరులు 3 స్థానాలను కైవసం చేసుకున్నారు.

నిజామాబాద్‌లో మొత్తం 60 స్థానాలలో కాంగ్రెస్ 17, బిఆర్ఎస్ 1, బిజెపి 28 గెలుపొందగా, కాంగ్రెస్ ఎంఐఎం,ఇండిపెండెంట్ల సహకారంతో మేయర్ పీఠాన్ని దక్కించుకుంది. మహబూబ్‌నగర్‌లో మొత్తం 60 స్థానాలలో కాంగ్రెస్ 29,బిఆర్ఎస్ 15,బిజెపి 8 స్థానాలు గెలుచుకోగా, కాంగ్రెస్ ఇండిపెండెంట్,ఎంఐఎం సహకారంతో మేయర్ పీఠాన్ని దక్కించుకుంది.

# వచ్చే అధికారం బిజెపిదే

>> చాలా మున్సిపాలిటీల్లో బిజెపి సింగిల్ లార్జెస్ట్ పార్టీగా ఆధిక్యం చూపించదని, ఛైర్మన్, వైస్‌ఛైర్మన్ ఎన్నికల్లో బిజెపి కీలక పాత్ర పోషించిందన్నారు. గతానికి భిన్నంగా బిజెపికి ఓట్లు, సీట్లు పెరిగాయని, 15పైగా సాధించి మున్సిపాలిటీల్లో సింగిల్ లార్జెస్ట్ పార్టీగా బిజెపి అవతరించిందన్నారు. ఖమ్మం, వరంగల్, కొత్తగూడం, పరకాల లాంటి చోట్ల బిజెపి సత్తా చాటిందన్నారు. చాలా చోట్ల మా ఓటు బేస్ పెరిగిందని, బిఆర్ఎస్ పార్టీకి గతం కంటే 14 శాతం ఓట్లు తగ్గాయి. బిఆర్ఎస్ ఇప్పుడు కేవలం 13 మున్సిపాలిటీలకు పరిమితమైందన్నారు అధికారంలో ఉన్న అధికార పార్టీకి కూడా మెజార్టీ సీట్లు రాలేదన్నారు. చరిత్రలో మొట్టమొదటిసారిగా కరీంనగర్ మేయర్ పీఠాన్ని బిజెపి కైవసం చేసుకుందని,నిజామాబాద్‌లో 28 చోట్ల బిజెపి గెలిచి సింగిల్ లార్జెస్ట్ పార్టీగా బిజెపి అవతరించిందన్నారు. మజ్లిస్ పార్టీ ఓటు పర్సంటేజీ తగ్గినా వారి ప్రభావం రాష్ట్రంలో పెరుగుతున్నదని అన్నారు. నిర్మల్‌లో ఒక వార్డులో ఎప్పుడూ లేనంతగా మైనార్టీ ఓట్లు పెరిగాయన్నారు. దీని మీద మాకు అనుమానం ఉందన్నారు. దీనిపై ఫిర్యాదు చేశాం.20 శాతం నుంచి 57 శాతానికి మైనార్టీ ఓట్లు ఎలా పెరిగాయన్నారు. బిజెపిని అడ్డుకునేందుకు కుట్రలు జరుగుతున్నాయన్నారు. ఎంఐఎం, కాంగ్రెస్, బిఆర్ఎస్, కమ్యూనిస్టులు కలిసి బిజెపికి మేయర్, ఛైర్ పర్సన్ పదవులు రానివ్వకుండా కుట్ర చేశారు.ఈ మూడు పార్టీల మధ్య ఉన్న సంబంధం ఏంటో చెప్పాలి. ఎర్రజెండా ఎక్కడా లేకున్నా తెలంగాణలో కాంగ్రెస్ ఎర్రజెండాకు అధికారం వచ్చేలా చేస్తున్నదని, బిజెపి ఎప్పుడూ అభివృద్ధి కోసమే పనిచేస్తుందన్నారు. ఇప్పుడు బిజెపి పాలిత రాష్ట్రాల్లో ఆ అభివృద్ధి కనిపిస్తుందన్నారు. ఏప్రిల్‌లో ఎస్ఐఆర్ రాబోతున్నదని అన్నారు. హైదరాబాద్‌లో దొంగ ఓట్లు, బయటి ఓట్లు తీసేయబోతున్నామని, బిఎల్ఓలు, ఆఫీసర్లు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలి. ఇంటి ఓనర్లకు తెలియకుండానే ఒక్కో ఇంటిపై 60 ఓట్ల వరకు నమోదు చేస్తున్నారని అన్నారు.

## ప్రపంచవ్యాప్తంగా 'ఎక్స్' సేవలకు షార్ట్‌బ్రేక్!

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 16:** ఎలాన్ మస్క్ నేతృత్వంలోని సోషల్‌మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్' సేవలు సోమవారం సాయంత్రం ప్రపంచవ్యాప్తంగా నిలిచిపోయాయి. భారత్‌తో పాటు అమెరికా, యూకే వంటి అనేక దేశాల్లో యూజర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. తమ అకౌంట్లలోకి లాగిన్ అవ్వలేకపోవడం, కొత్త పోస్టులు లోడ్ కాకపోవడంతో గందరగోళానికి గురయ్యారు. కొద్ది గంటల పాటు కొనసాగిన ఈ అంతరాయంతో ఎక్స్ వేదికపై కార్యకలాపాలు స్తంభించిపోయాయి. టెక్నికల్ సమస్యలను గుర్తించే వెబ్‌సైట్ డౌన్ డిటెక్టర్ ప్రకారం, ఈ అంతరాయంపై ఫిర్యాదుల సంఖ్య అనూహ్యంగా 25,000 దాటింది. వీరిలో 53 శాతం మంది ఎక్స్ యాప్ యూజర్లు లాగిన్ సమస్యలను ఎదుర్కొన్నట్లు నివేదించారు. అదే సమయంలో 16 శాతం మంది వెబ్‌సైట్ యూజర్లు కూడా ఇబ్బందులు పడినట్లు డౌన్ డిటెక్టర్ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ఈ సాంకేతిక సమస్యకు కచ్చితమైన కారణం ఏంటనేది వెంటనే తెలియరాలేదు. దీనిపై వివ ఎక్స్ సేవలు నిలిచిపోవడం ఇదే మొదటిసారి కాదు. గత ఏడాది నవంబర్‌లో కూడా భారత్‌తో సహా ప్రపంచవ్యాప్తంగా వేలాది మంది యూజర్లు ఇలాంటి అంతరాయాన్నే ఎదుర్కొన్నారు. అప్పుడు క్లౌడ్‌ఫ్లేర్ ఇంటర్నెట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌లో తలెత్తిన సమస్య కారణంగా ఎక్స్‌తో పాటు పలు ఇతర వెబ్‌సైట్లు కూడా డౌన్ అయ్యాయి. ఆ సమస్యను తర్వాత క్లౌడ్‌ఫ్లేర్ పరిష్కరించింది. ఆ సమయంలో డౌన్ డిటెక్టర్ వెబ్‌సైట్ కూడా క్లౌడ్‌ఫ్లేర్‌పై ఆధారపడటంతో అది కూడా లోడ్ అవ్వడానికి ఇబ్బంది పడింది. గత ఏడాది మే నెలలో సైతం ఎక్స్ గ్లోబల్‌గా మొరాయించింది. అప్పుడు కూడా యూజర్లు కొత్త పోస్టులు చూడలేక, లాగిన్ అవ్వలేక ఇబ్బంది పడ్డారు. 24 గంటల వ్యవధిలో రెండుసార్లు సేవలు నిలిచిపోయాయి. ఆ సమయంలో ప్రపంచవ్యాప్తంగా 5,000 మందికి పైగా యూజర్లు సమస్యలను ఎదుర్కొన్నట్లు డౌన్ డిటెక్టర్ తెలిపింది. తరచూ ఇలాంటి సాంకేతిక సమస్యలు తలెత్తడం యూజర్లలో ఆందోళన కలిగిస్తోంది.

## డ్రగ్స్ రవాణా అరికట్టేందుకు దేశవ్యాప్త సిసిటివి నెట్‌వర్క్!

### ఢిల్లీపోలీసుల ఆవిర్భావ దినోత్సవాల్లో హోంమంత్రి అమిత్‌షా

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 16:** డ్రగ్స్ రవాణాను అడ్డుకునేందుకు దేశవ్యాప్తంగా సీసీటీవీ కెమెరాల నెట్‌వర్క్ ను ఏర్పాటు చేస్తున్నట్లు కేంద్ర హోంమంత్రి అమిత్ షా వెల్లడించారు. దశాబ్దాలుగా దేశాన్ని భయపెడుతున్న నక్సలిజం సమస్యకు ఈ ఏడాది మార్చి 31 నాటికి శాశ్వతంగా చరమగీతం పాడబోతున్నామని ఆయన అన్నారు. దేశ అంతర్గత భద్రతను మరింత పటిష్ఠం చేసే దిశగా కేంద్ర ప్రభుత్వం అడుగులు వేస్తోందని,యువతను పట్టిపీడిస్తున్న మాదక ద్రవ్యాల మహమ్మారిని సమూలంగా అంతం చేసేందుకు కేంద్ర హోంమంత్రిత్వ శాఖ ఒక భారీ ప్రణాళికను సిద్ధం చేసిందన్నారు. ఢిల్లీ పోలీసుల 79వ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో అమిత్ షా ముఖ్య అతిథిగా పాల్గొ భవిష్యత్ కార్యాచరణను వివరించారు. రాబోయే కొద్ది నెలల్లోనే కొత్త జాతీయ భద్రతా నిర్మాణాన్ని ఏర్పాటు చేస్తాం. దీని ప్రధాన లక్ష్యం మాదక ద్రవ్యాల అక్రమ రవాణాను అడ్డుకోవడమే. ఇందుకోసం దేశంలోని అన్ని రాష్ట్రాలను కలుపుతూ ఒక భారీ సీసీటీవీ నెట్‌వర్క్‌ను సృష్టిస్తాం. వీటిని పర్యవేక్షించడానికి ఇంటిగ్రేటెడ్ కంట్రోల్ రూమ్స్ ఏర్పాటు చేస్తాం. ఈ నిఘా వ్యవస్థకు చట్టపరమైన రక్షణ కూడా కల్పిస్తాం. దీనివల్ల డ్రగ్స్ నేరాలను రియల్ టైమ్‌లో పసిగట్టడం సులభమవుతుందని షా అన్నారు. సరిహద్దుల రక్షణపైనా కేంద్రం ప్రత్యేక దృష్టి సారించిందని షా తెలిపారు. ప్రతి భూ సరిహద్దులో భద్రతా ఏర్పాట్లను ఆధునీకరించి నిఘా వ్యవస్థలను అప్‌గ్రేడ్ చేస్తామన్నారు. కంచె, మౌలిక సదుపాయాలను బలపరుస్తాం. చొరబాట్లను అడ్డుకునేందుకు సరిహద్దు భద్రతా దళాల మధ్య సమన్వయం పెంచుతాం. నక్సలిజం ఒకప్పుడు దేశంలోని 11 రాష్ట్రాలకు విస్తరించి పెద్ద సవాలుగా ఉండేది. కానీ ఇప్పుడు ఆ సమస్య దాదాపుగా కొలిక్కి వచ్చింది. ప్రభావిత ప్రాంతాలను మావోయిస్టుల చెర నుంచి విడిపించడానికి మనం చాలా దగ్గరగా ఉన్నాం. మార్చి 31, 2026 నాటికి దేశం నుంచి మావోయిస్టు హింసను పూర్తిగా తుడిచిపెట్టేస్తాం. ఇది మన భద్రతా దళాలకు దక్కే అతిపెద్ద విజయమని అన్నారు. గత 12 ఏళ్ల కాలాన్ని భారత అంతర్గత భద్రత చరిత్రలో స్వర్ణయుగంఅన్నారు.2014కు ముందు దేశాన్ని కశ్మీర్ సమస్య, ఈశాన్య రాష్ట్రాల్లో అలజడి, మావోయిస్టు హింస అనే మూడు ప్రధాన సమస్యలు వేధించేవి. ఆర్టికల్ 370 రద్దు తర్వాత పరిస్థితులు మారాయని అమిత్‌షా అన్నారు.

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ



తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

హైదరాబాద్ : fb.com/vaartha Digital

Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

17-2-2026 మంగళవారం సంపుటి: 32 సంచిక: 17 పేజీలు: 10+4 వెల: 6.50



రైతుల కోసం మరో యాప్ 6

నేడు భారత్‌కు ఫ్రాన్స్ అధ్యక్షుడు రాక 8


## ఎఐతో విప్లవాత్మక మార్పులు

140 కోట్ల మంది భారతీయుల వల్లే ఎఐలో ముందంజ

ఎఐ ఇంపాక్ట్ సమ్మిట్‌లో ప్రధాని మోడీ

# ప్రపంచం చూపు భారత్ వైపు



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 16:** కృత్రిమ మేధస్సు (ఎఐ) ఇప్పటికే పలు రంగాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకువస్తోందని ప్రధానమంత్రి నరేంద్రమోడీ పేర్కొన్నారు. ఆరోగ్యం, విద్య, వ్యవసాయం, పాలన, పరిశ్రమలు వంటి రంగాల్లో మార్పులు వచ్చాయని వివరించారు. అయితే ఎఐ వినియోగంలో బాధ్యతాయుతంగా ఉండాలని అభిప్రాయ పడ్డారు. సోమవారం సాయంత్రం ఢిల్లీలోని భారత మండపంలో ఐదురోజులపాటు నిర్వహిస్తున్న ఎఐ ఇంపాక్ట్ సమ్మిట్‌ను ప్రధాని మోడీ ప్రారంభించారు. ప్రపంచ స్థాయిలో చర్చలకు ఈ సమ్మిట్ దోహదపడుతుందన్నారు. ఈ సమ్మిట్ ఫలితాలు ప్రగతిశీల, వినూత్నమైన అవకాశాల ఆధారిత భవిష్యత్తును రూపొందించడంలో సహాయపడతాయని పేర్కొన్నారు. 140కోట్ల మంది భారతీయుల వల్లే దేశం ఎఐ మార్పులో ముందంజలో ఉందన్నారు. డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, స్టార్టప్ ఎకోసిస్టమ్, ఆధునిక పరిశోధనలు ఇవన్నీ ఎఐ పట్ల భారత్‌కు ఉన్న ఆశయం, బాధ్యతను ప్రతిబింబిస్తున్నాయని ప్రధాని మోడీ తెలిపారు. సదస్సు ప్రారంభానికి ముందు ప్రధాని మోడీ, వేదిక వద్ద ఉన్న వివిధ స్టాళ్లను సందర్శించి, ఎక్స్‌పోలో పాల్గొన్న కంపెనీలతో పాటు స్టార్టప్‌లతో మాట్లాడారు. ఈ ఎక్స్‌పోలో 600కు పైగా స్టార్టప్‌లు, ఎఐ పర్యావరణ వ్యవస్థలో అంతర్జాతీయ సహకారాన్ని ప్రదర్శించే 13 దేశ పెవిలియన్‌లు ఉన్నాయి. వీటిలో ఆస్ట్రేలియా, జపాన్, రష్యా, యునైటెడ్ కింగ్‌డమ్, ఫ్రాన్స్, జర్మనీ, ఇటలీ, నెదర్లాండ్స్, స్విట్జర్లాండ్, సెర్బియా, ఎస్టోనియా, తజికిస్తాన్, ఆఫ్రికా నుండి పెవిలియన్‌లు ఉన్నాయి. అంతర్జాతీయ ప్రతినిధులతో సహా 2.5 లక్షలకు పైగా సందర్శకులు ఈ శిఖరాగ్ర సమావేశానికి హాజరుకానున్నారు. అంతకుముందు ప్రధానమంత్రి నరేంద్రమోడీ ఎఐ ఇంపాక్ట్ సమ్మిట్‌పై సోషల్ మీడియా 'ఎక్స్'లో ప్రపంచ దేశాలను ఆహ్వానిస్తూ ఎఐ సదస్సు ఉద్దేశాలు, లక్ష్యాలను గురించి రాసుకొచ్చారు. ప్రపంచం ఇప్పుడు ఇండియాకు వస్తోందన్నారు. "ఏఐపై >>2



సోమవారం అమరావతిలో ఏపి సిఎం చంద్రబాబుతో భేటీ అయిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

# ఆ ఐదు ఊళ్లివ్వండి

రాష్ట్ర విభజనలో ఎపికి వెళ్లిన భద్రాద్రి మండలం ఐదుగ్రామాలను తెలంగాణలో విలీనం చేయండి

ఎపి సిఎం చంద్రబాబును కోరిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

తిరుమలలో తెలంగాణకు ఐదెకరాలివ్వండి

పెదవాగు మరమ్మతుకు 85% నిధులు విడుదల చేయండి..

**హైదరాబాద్,ఫిబ్రవరి 16,ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, హ్యాండ్‌లూమ్స్ టెక్స్టైల్స్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుని కలిసి ఖమ్మం జిల్లాకు సంబంధిచిన సాగునీటి వసతులు, భక్తులు, ప్రజల సౌకర్యానికి సంబంధించిన పలు కీలక విజ్ఞప్తులు చేసారు. రాష్ట్ర పునర్విభజనలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని భద్రాచలం మండలానికి ఆనుకుని ఉన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అయిదు గ్రామపంచాయతీలను తిరిగి తెలంగాణలో విలీనం చేయాల్సిన అవసరం ఉందని ఏపీ సీఎం చంద్రబాబునాయుడిని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కోరారు. ఏటపాక, కన్నాయిగూడెం, పిచ్చికలపాడు, పురుషోత్తపట్నం, గుండాల గ్రామపంచాయతీలు భౌగోళికంగా తెలంగాణ ప్రాంతాల మధ్యలో ఉండటం వల్ల ప్రజలు పరిపాలనా పరంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. ఈ గ్రామాలు గోదావరి నది, అటవీ ప్రాంతాల మధ్య ఉండటంతో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఎంక్లేవ్‌లా మారిపోయాయని, జిల్లా కేంద్రాలకు చేరుకోవడానికి >>2

# కొలువుదీరిన కొత్త మేయర్లు

సజావుగా సాగిన మేయర్, డిప్యూటీ మేయర్ల ఎన్నిక



సోమవారం నిజామాబాద్ మేయర్‌గా ఎన్నికైన ఉమారాణిని సన్మానిస్తున్న మంత్రి ఉత్తమ్. చిత్రంలో పిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ తదితరులు

కాంగ్రెస్ -5, సిపిఐ -1, బిజెపి -1

ఒక్క మేయర్‌సీటూ దక్కని బిఆర్‌ఎస్

కొత్తగూడెం కార్పొరేషన్‌లో సిపిఐ, కాంగ్రెస్‌కు చెరిసగం అధికారం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఫిబ్రవరి16:** తెలంగాణలో మున్సిపల్ కార్పొరేషన్లలో సోమవారం మేయర్లు, డిప్యూటీ మేయర్లు ఎన్నికయ్యారు. 7 కార్పొరేషన్లలో అధికార కాంగ్రెస్ 5, బీజేపీ 1, సీపీఐ 1 స్థానాల్లో ఎంపికయ్యారు. ప్రతిపక్ష బీఆర్‌ఎస్ పార్లమెంట్ ఎన్నికల దారిలోనే నడిచింది. ఈ 7 కార్పొరేషన్లలోనూ ఖాతా తెరవలేదు. కాంగ్రెస్ దక్కించుకున్న కార్పొరేషన్లు:- నిజామాబాద్, మంచిర్యాల, మహబూబ్‌నగర్, రామగుండం, నల్లగొండ మేయర్ స్థానాలను కాంగ్రెస్ దక్కించుకుంది. కాగా, మంచిర్యాల, రామగుండం, మహబూబ్‌నగర్, నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్లలో స్పష్టమైన మెజారిటీ ఉండగా ఎంఐఎం మద్దతుతో నిజామాబాద్ పీఠాన్ని దక్కించుకుంది. కాగా, కరీనంగర్ మున్సిపల్ కార్పొరేషన్ పీఠాన్ని బీజేపీ కైవసం చేసుకున్నది. కాంగ్రెస్‌తో సర్దుబాటులో భాగంగా సిపిఐ కొత్తగూడెం మేయర్ పదవిని దక్కించుకున్నది. నిజామాబాద్‌లో ఎంఐఎంతో కలిసి అధికార కాంగ్రెస్ మేయర్ పీఠం కైవసం చేసుకుంది. నిజామాబాద్ మేయర్‌గా ఉమారాణి, డిప్యూటీ మేయర్‌గా సల్మా తహసీన్ ఎంపికయ్యారు. నల్గొండ కార్పొరేషన్ పీఠాన్ని కాంగ్రెస్ దక్కించుకుంది. తొలి మేయర్‌గా బుర్రి చైతన్య రెడ్డి నియమితులయ్యారు. డిప్యూటీ మేయర్ పదవి మహ్మద్ అశ్రఫ్ అలీని వరించింది. మంచిర్యాల కార్పొరేషన్ కాంగ్రెస్ కైవసం అయింది. మేయర్‌గా ధర్ని మధు, డిప్యూటీ మేయర్‌గా రమ్య ఎంపికయ్యారు. కొత్తగూడెం మేయర్ స్థానాన్ని సీపీఐ దక్కించుకుంది. మున్సిపాలిటీ నుంచి కార్పొరేషన్‌గా ఆవిర్భవించిన తర్వాత జరిగిన ఎన్నికల్లో కొత్తగూడెం కార్పొరేషన్‌ను సీపీఐ కైవసం చేసుకోవడం విశేషం. కొత్తగూడెం కార్పొరేషన్‌లో మేయర్ పదవి సీపీఐకి దక్కగా డిప్యూటీ మేయర్ పదవి కాంగ్రెస్ దక్కించుకుంది. ఒప్పందంలో భాగంగా మొదటి రెండున్నర సంవత్సరాలు మేయర్ స్థానంలో సిపిఐ ఉండనుండగా, తర్వాత రెండున్నర సంవత్సరాలు కాంగ్రెస్ మేయర్ స్థానంలో ఉండనుంది. కాగా ఇప్పుడు సిపిఐ తరఫున మేయర్‌గా మూడ్ గణేశ్, కాంగ్రెస్ తరఫున డిప్యూటీ మేయర్‌గా లలితకుమారి ఎన్నికయ్యారు. మహబూబ్‌నగర్ కార్పొరేషన్ మేయ ర్‌గా ముదిరాజ్ సామాజిక వర్గానికి చెందిన గుముల >>2



సోమవారం మధిర మున్సిపాలిటీ కౌన్సిలర్లతో డి.సిఎం భట్టి

## దాడులు, కిడ్నాప్‌లు.. బలప్రదర్శనలు

11 మున్సిపాలిటీల్లో చైర్మన్ ఎన్నిక వాయిదా

హంగ్ ఏర్పడిన మున్సిపాలిటీల వద్ద ఉద్రిక్తత, కౌన్సిలర్లను కిడ్నాప్ చేశారని కేసులు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఫిబ్రవరి16:** తెలంగాణలోని మున్సిపాలిటీల ఛైర్మన్, వైస్ ఛైర్మన్ ఎన్నిక సందర్భంగా సోమవారం పలు చోట్ల తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్నాయి. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ శ్రేణులు మధ్య తోపులాట చోటు చేసుకున్నాయి. మరికొన్నిచోట్ల ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. ఉద్రిక్తతలు, ఇతర కారణాలతో తెలంగాణ వ్యాప్తంగా 11 మున్సిపాలిటీల్లో చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక వాయిదా పడింది. తొర్రూర్, ఇల్లందు, సుల్తానాబాద్, ఇబ్రహీంపట్నం, కాగజ్‌నగర్, క్యాతనపల్లి, ఖానాపూర్, జహీరాబాద్, ఇంద్రేశం, డోర్నకల్, >>2



## సన్నధాన్యానికి బోనస్

రూ.514కోట్లు విడుదల

2.17లక్షల రైతులకు లబ్ధి

**హైదరాబాద్, ఫిబ్రవరి 16, ప్రభాత వార్త:** తెలంగాణ రైతులకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. వరి బోనస్ బకాయిలకు సంబంధించి నిధులను విడుదల చేసింది. సన్న రకం వరి ధాన్యం సాగు చేసిన రైతులకు క్వింటాల్‌కు రూ.500 బోనస్ కోసం రూ.514.36 కోట్లు విడుదల చేస్తున్నట్టు ప్రకటించింది. తెలంగాణలో సన్నవడ్లు పండించే రైతులకు ప్రభుత్వం క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇస్తామని ప్రకటించిన విషయం తెలిసిందే. వానాకాలంలో సన్నవడ్లు అమ్మిన 2.17 లక్షల మంది రైతులకు బోనస్ బకాయిలు విడుదల చేసింది. కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధరకు అదనంగా ఈబోనస్ రైతులకు రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తోంది. ప్రభుత్వం నిర్దేశించిన 33 రకాల సన్నబియ్యం రకాలను పండించిన >>2

జెఇఇ ఫలితాలు

## ముగ్గురు తెలుగు విద్యార్థులకు 100 పర్సంటైల్

తెలంగాణ నుంచి ఒకరు, ఎపి నుంచి ఇద్దరు

దేశవ్యాప్తంగా 12 మందికి 100 పర్సంటైల్

జెఇఇ మెయిన్ 2026 ఫలితాలు విడుదల చేసిన ఎన్‌టిఎ



100 పర్సంటైల్ సాధించిన శరద్, మోహిత్

**హైదరాబాద్, ప్రభాతవార్త, ఫిబ్రవరి 16:** దేశ వ్యాప్తంగా జనవరి 21 నుంచి 28 వరకు నిర్వహించిన జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్(జెఈఈ) మెయిన్-2026 జనవరి ఫలితాల్లో ముగ్గురు తెలుగు విద్యార్థులు 100 పర్సంటైల్ సాధించారు. వారిలో ఒకరు తెలంగాణ విద్యార్థి కాగా.. ఇద్దరు ఆంధ్రప్రదేశ్‌కి చెందిన వారు ఉన్నారు. దేశ వ్యాప్తంగా 12 మంది విద్యార్థులు జెఈఈ మెయిన్ ఫలితాల్లో 100 పర్సంటైల్ సాధించారు. జనవరి 21 నుంచి 28 వరకు నిర్వహించిన జెఈఈ మెయిన్ పేపర్-1 ఫలితాలను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టిఏ) సోమవారం సాయంత్రం ప్రకటించింది. సోమవారం ఉదయం జెఈఈ మెయిన్ మొదటి సెషన్‌కి సంబంధించిన ఫైనల్ కీని విడుదల చేయగా.. సాయంత్రం ఫలితాలను రిలీజ్ చేశారు. అభ్యర్థులు తమ అప్లికేషన్ నంబర్, పాస్‌వర్డ్‌తో పాటు క్యాప్చా కోడ్ ఎంటర్ చేసి స్కోర్ కార్డులను ఎన్‌టిఏ వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. జనవరిలో జరిగిన జెఈఈ మెయిన్ మొదటి సెషన్‌కి 13, 55,293 మంది దరఖాస్తు చేసుకోగా వారిలో 13,04,653 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. పరీక్షకు 4,67,817 మంది బాలికలు, 8,87,476 476 మంది దరఖాస్తు చేసుకున్నారు. తెలంగాణకి చెందిన విద్యార్థి వివన్ శరద్ మహేశ్వరి 100 పర్సెంటైల్‌సాధించగా.. ఏపీకి చెందిన జి.నరేంద్రబాబు, పసల మోహిత్ ఇద్దరు 100 పర్సంటైల్ సాధించారు. ఓబీసీ కేటగిరీలో ఏపీ విద్యార్థి జి నరేంద్ర బాబు ఆలిండియా మొదటి ర్యాంక్ సాధించాడు. ఎస్సీ కేటగిరీలో ఏపీ విద్యార్థి దేవ శ్రీవేద్ 99.9992271 పర్సంటైల్‌తో ఆలిండియా మొదటి ర్యాంకు సాధించాడు. 100 పర్సంటైల్ సాధించిన 12 మంది విద్యార్థుల వివరాలు శ్రీయాస్ మిశ్రా(ఢిల్లీ), జి నరేంద్ర బాబు(ఏపి), శుభమ్ కుమార్(బీహార్), కబీర్ చిల్లార్(రాజస్థాన్), చిరంజిబ్ కర్(రాజస్థాన్), భవేష్ పాత్ర(ఒడిషా), అనయ్ జైన్(హర్యానా), అర్నవ్ గౌతమ్(రాజస్థాన్), పసల మోహిత్(ఏపి), మాధవ్ విరాదియా(మహారాష్ట్ర), పురోహిత్ నిమయ్(గుజరాత్), వివాన్ శరద్ మహేశ్వరీ(తెలంగాణ) ఉన్నారు.



## 'ఫ్యూచర్'లో హెల్త్‌సిటీ

అంతర్జాతీయ ప్రమాణాలతో రోల్ మోడల్‌గా అభివృద్ధి

పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు

**హైదరాబాద్, ఫిబ్రవరి 16 ప్రభాతవార్త:** అంతర్జాతీయ ప్రమాణాలతో ఇతర రాష్ట్రాలకు రోల్ మోడల్‌గా నిలిచేలా భారత్ ఫ్యూచర్‌లో సిటీలో ప్రత్యేకంగా హెల్త్ సిటిని అభివృద్ధి చేస్తామని రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. ఏఐ, క్వాంటం కంప్యూటింగ్, బ్లాక్ చెయిన్ లాంటి కటింగ్ ఎడ్జ్ టెక్నాలజీస్ సాయంతో మారుమూల ప్రాంతాలకూ వైద్య సౌకర్యాలను చేర్చాలన్నదే తమ ప్రభుత్వ సంకల్పమని వివరించారు. ఆ దిశగా రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను సోమవారం టీ హబ్‌లో టచ్ ఏ లైఫ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన టిఏఎల్ హాస్పిటల్స్ హెల్త్ ఫెస్ట్-2026 ఫైర్ సైడ్ చాట్‌లో మంత్రి శ్రీధర్ బాబు వివరించారు. రాష్ట్రంలో ప్రతి పౌరుడికి హెల్త్ ప్రొఫైలింగ్‌ను అందుబాటులోకి తీసుకొస్తున్నామన్నారు. మహిళలందరికీ ముందస్తు క్యాన్సర్ నిర్ధారిత పరీక్షలను నిర్వహిస్తున్నామన్నారు. రాష్ట్రంలోని ప్రభుత్వాసుపత్రుల రూపురేఖలను మార్చేందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తున్నారని తెలిపారు. అక్కడికొచ్చే రోగులకు మరింత నాణ్యమైన వైద్య సేవలు అందేలా టెక్నాలజీ వినియోగానికి పెద్దపీట వేస్తున్నామన్నారు. గ్లోబల్ మెడికల్ టూరిజం హబ్‌గా తెలంగాణను మార్చాలనే సంకల్పంతో ప్రత్యేక పాలసీని తీసుకొచ్చామన్నారు. హెల్త్ కేర్ రంగంతో పాటు ఇతర రంగాల్లోనూ ఆర్‌అండ్‌డికి పెద్దపీట వేసేందుకు దేశంలోనే తొలిసారిగా ఏఐ ఆధారిత తెలంగాణ డిజిటల్ ఎక్జేంట్‌ను ప్రారంభించామన్నారు. నేటి మార్కెట్ అవసరాలకు అనుగుణంగా పరిశ్రమలకు అవసరమైన రెడీ టూ వర్క్ ఫోర్స్‌ను తయారు చేసే బృహత్తర బాధ్యతను తమ ప్రభుత్వం తీసుకుందన్నారు. మరో మూడు నుంచి నాలుగు నెలల్లో >>2



## వచ్చే అధికారం బిజెపిదే

భైంసాలో ఆగడాలకు పాల్పడిన ఎంఐఎం


బిజెపి రాష్ట్ర చీఫ్ రాంచందర్‌రావు

**హైదరాబాద్, ఫిబ్రవరి 16 ప్రభాతవార్త:** రాష్ట్రంలో వచ్చే ఎన్నికల్లో బిజెపి తప్పకుండా అధికారంలోకి వస్తుందని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్.రాంచందర్‌రావు అన్నారు. సోమవారం బిజెపి రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడారు. మున్సిపల్ ఎన్నికల్లో బిజెపికి ఓటు వేసిన అందరికీ ధన్యవాదాలని, కరీంనగర్ కార్పొరేషన్, నారాయణపేట, భైంసా మున్సిపాలిటీల్లో బిజెపి చైర్‌పర్సన్ పీఠం పదవి దక్కించుకుందన్నారు. భైంసాలో గత కాంగ్రెస్ హయాం నుంచే బిజెపి కార్యకర్తలు, హిందూ ధార్మిక సంస్థల సభ్యులపై ఎన్నో కేసులు పెట్టారని, అడ్వకేట్‌గా తాను ఎంతో మంది బెయిల్ ఇప్పించినట్లు తెలిపారు. ఇంతకాలం మజ్లిస్, కాంగ్రెస్‌లు భైంసాలో బిజెపిని రానివ్వలేదన్నారు. భైంసాలో ఎంఐఎం పార్టీ ఎన్నో ఆగడాలకు పాల్పడిందని, మాకు మున్సిపాలిటీలు తక్కువగా వచ్చినప్పటికీ ఓట్ల శాతం పెరిగిందన్నారు. >>2

18 మునిసిపల్ చైర్మన్లు బిఆర్‌ఎస్ కైవసం

చైర్మన్లుగా ఎఐఎఫ్‌బి, నలుగురు ఇండిపెండెంట్లు

ఒక్క కార్పొరేషన్, ఒక మున్సిపాలిటీతో సర్దుకున్న బిజెపి




# 'చేతి'లోనే 86 పీఠాలు

మేయర్, చైర్మన్ ఎన్నికల్లో రెపరెపలాడిన కాంగ్రెస్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఫిబ్రవరి16:** తెలంగాణ రాష్ట్రంలో మున్సిపాలిటీ చైర్మన్, వైస్ చైర్మన్, మున్సిపల్ కార్పొరేషన్ మేయర్, డిప్యూటీ మేయర్ ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా రెపరెపలాడింది. 116 మున్సిపాలిటీల్లో ఉద్రిక్తలు, కార్యకర్తల ఆందోళనలు కారణంగా 11చోట్ల ఛైర్మన్, డిప్యూటీ ఛైర్మన్ ఎన్నికలు వాయిదా పడ్డాయి. 7 మున్సిపల్ కార్పొరేషన్ మేయర్, డిప్యూటీ మేయర్ ఎన్నికలు ఎలాంటి గొడవలు లేకుండా ప్రశాంతంగా ముగిశాయి. మున్సిపల్ కార్పోరేషన్ మేయర్ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్‌కు 5 మేయర్లు(మహబూబ్‌నగర్-మమత, మంచిర్యాల-ధర్ణి మధుకర్, నిజామాబాద్-కూరగాయల ఉమారాణి, రామగుండం-మహంకాలి స్వామి) సిపిఐకి ఒక మేయర్(కొత్తగూడెం-మూడ్ గణేష్), బిజెపి ఒక మేయర్(కరీంనగర్-కొలగాని శ్రీనివాస్) దక్కించుకోనున్నాయి. సోమవారం జరిగిన 105 మున్సిపాలిటీ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికల్లో 81 చోట్ల పీఠాల్ని కాంగ్రెస్ కైవసం చేసుకుంది. మొత్తంగా 112 మున్సిపాలిటీ చైర్మన్లు, మున్సిపల్ మేయర్లలో >>2

వార్త

కొత్తభాషను ఎవరో ఎక్కడో చోట సృష్టిస్తారనుకుంటాం! ఎవ్వరూ అలా చేయలేరు. కొన్ని తరాలు తమ జీవిత క్రమంలో భాషల్ని సృష్టిస్తారు.

-రాహుల్ సాంకృత్యాయన్

# ఉచిత మీమాంస తగునా!

ఏదో 'ఉచితానుచితాలు' మరచి అనుకుంటాం కానీ ఏది ఉచితం, ఏది అనుచితం అని చెప్పగలిగే వాళ్లెవరైనా ఉన్నారా అని పరకాయించి చూస్తే అన్నీ సందేహాలమయమే. రాజకీయాల్లో ఉచితాలనండి, ప్రజాకర్షక పథకాలనండి ఏవైనా వాటి లబ్ధిదారులను సోమరిపోతుల్లా పెంచి పోషించడమేనని పెద్దలు పదేపదే పలు సందర్భాల్లో హితవు చెబుతూనే ఉన్నారు. ప్రధానంగా పూర్వ రిజర్వుబ్యాంకు గవర్నర్‌లు దువ్వూరి సుబ్బారావు, రఘురామరాజన్‌లో నిర్ద్వందంగానే చెప్పజూసారు. వాళ్లకు దొరికిన వేదికమీదల్లా దేశాభివృద్ధిలో ఉచితాలనబడేవి తిరోగమనానికి సాక్షీభూతాలుగా అభివర్ణించారు. కానీ ఎందుకో రాజకీయ నేతల చెవికెక్కడం లేదు. ఎంత నిజాయితీగా ఉన్నా తాయిలాలు లేకపోతే ఓటర్లు తమను పట్టించుకోరనే ఆందోళనతో అలా చేసి ఉండవచ్చు. ఇలా ఓటర్లను ఆకర్షించే పథకాలు ఎన్నాళ్లు అనే సంశయం ఉండనే ఉంది. ఇలాంటి వాటితోనే జాతి జనుల సామర్థ్యాలు నిర్వీర్యమైపోతాయనే అంచనాలు కూడా ఉన్నాయి. దేశవ్యాప్తంగా ఆయా సమస్యలు మళ్లీ మళ్లీ అధికారంలోకి తామే రావాలనే ఆకాంక్షలతో ఉచితాలు గుప్పిస్తున్నారు. తాజాగా మన ప్రధాని నరేంద్ర మోడీ కూడా దేశ ఆదాయ వ్యయాల పట్టికలో ఉత్పాదకతను పెంచేలా ఖర్చులు ఉండాలన్న అభిమతంతో కేంద్ర సర్కారు బడ్జెట్‌లో ప్రజాకర్షక పథకాల జోలికి పోలేదని వివరించారు. ఈ యేడాది బడ్జెట్ అందుకు లోబడే ఏర్చికూర్చినందుకు ఆనందపడాల్సిందే. కానీ త్వరలో ఎన్నికలు జరుగనున్న రాష్ట్రాలలో ఏయే పార్టీ ఎలాంటి ఉచిత వ్యూహాలు పన్నుతుందో ఇప్పుడిప్పుడే చెప్పలేం. స్వల్పకాలిక ప్రజాకర్షక పథకాలను తాము ఉద్దేశపూర్వకంగానే పక్కన పెట్టామని ప్రధాని స్పష్టం చేశారు. తాత్కాలిక ప్రజాకర్షక పథకాల కన్నా ప్రజల జీవన ప్రమాణాలను పెంచామనే సంకల్పంతో ముందడుగు వేస్తున్నట్లుగా చెప్పారు. బీహార్ ఎన్నికల సమయంలో ఆ రాష్ట్రంలో అధికారంలో ఉన్న ఎన్‌డిఏ ప్రభుత్వం ప్రకటించి అమలు చేసిన మహిళా అనుకూల పథకాలే ఎన్‌డిఏకు పట్టం కట్టాయాన్న విషయం జగద్విదితమే. అంతలోనే ఇంత మార్పా అని మనం నోరెళ్లబెట్టినా వచ్చే తమిళనాడు, కేరళ రాష్ట్రాల ఎన్నికల నాటికి వ్యూహాలు ఎలా ఉంటాయో అప్పుడే చెప్పలేం. ఇప్పటికే తమిళనాడులో అధికార పార్టీ డిఎంకె మహిళలను ఆకట్టుకునే పనిలో పడింది. బీహార్‌లో గత అధికార పార్టీ అమలు చేసినట్లే ఒక పథకానికి అంకురార్పణ చేసింది. కాగా తమిళనాడులోని దాదాపు 1.3 కోట్ల మంది మహిళా లబ్దిదారులకు ఖాతాల్లో 'మగలిక ఉరిమై తిట్టమ్ ప్లస్' పథకం కింద ఐదువేల రూపాయల నగదు జమ చేయుటకు ఉద్దేశించబడింది. తమ పార్టీ మళ్లీ అధికారంలోకి వచ్చాక నెలవారీ సహాయం రెండువేల కన్నా రెట్టింపుగా ఉంటుందని ఎంకె అధినేత, తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె స్టాలిన్ ప్రకటించారు. ఈ బాపతు నగదు బదలీని ఏమనుకోవాలి. బీహార్‌లో స్త్రీ శక్తిని ఆకట్టుకుని నితీష్ కుమార్ గెలిచినట్లే తానూ గెలవాలని స్టాలిన్ సంకల్పం కావచ్చు. తమిళ మహిళల సంక్షేమం గురించి ఆలోచించడానికి ఎన్నికల ముందువరకుఎందుకు వేచి ఉన్నారని విపక్షాలు నిలదీసాయి. దేశవ్యాప్తంగా ఆయా రాష్ట్రాలు విచ్చలవిడిగా ప్రకటిస్తున్న ఉచిత పథకాలు దేశ ఆర్థిక వ్యవస్థను అప్పుల ఊబిలోకి నెడుతున్నాయని 2025-26 ఆర్థిక సర్వే హెచ్చరిస్తోంది. ఇటీవల కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలాసీతారామన్ పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన నివేదికలోని అంశాలు గమనిస్తే నిబంధనలు లేని నగదు బదలీ పథకాల కోసం రాష్ట్రాలు చేస్తున్న ఖర్చు గత మూడేళ్లలో ఐదు రెట్లు పెరిగి, ఈ యేడాది 1.7లక్షల కోట్లకు చేరుకుంది. జీతాలు, పెన్షన్‌లు, వడ్డీలు, ఉచిత పథకాలకు వెచ్చించే సొమ్ము ఆయా రాష్ట్రాల ఆదాయంలో దాదాపు 62శాతం అని తేలింది. పర్యవసానంగా రోడ్లు, రైల్వేలు, ఆసుపత్రులు విద్యావైద్య సౌకర్యానికి అవసరమైన మూలధనవ్యయం దారుణంగా తగ్గిపోతుందని సర్వే వివరించింది. అప్పులు చేసి మరీ ప్రజల చేతిలో ఉచితంగా నగదు అందించడం వలన పేదరికం మాత్రం ఇసుమంతైనా తగ్గలేదని ఆనివేదికలో పేర్కొంది. ఇలాంటి అప్పులు, వినియోగాల ఖర్చుల వలన రాష్ట్రాలు దివాలా తీసినా అనుమానించక్కర్లేదని సర్వే నివేదిక సారాంశం. మళ్లీ ఆర్థిక సంక్షోభాల నుంచి గట్టెక్కేందుకు బ్రెజిల్‌లో విజయవంతమైన 'బోల్సా ఫ్యామిలియా' తరహా విధానాన్ని అనుసరించాలని ఆ ఆర్థిక సర్వే సూచించింది. ఉచితంగా నగదు బదలీ చేయడంకన్నా కొన్ని నిబంధనలు కూడా ఈ పథకానికి జోడించడం తప్పనిసరియని నివేదిక పేర్కొంది. ప్రభుత్వంనుంచి ప్రయోజనాలు పొందే కుటుంబంలోని పిల్లలు ఖచ్చితంగా పాఠశాలలకు వెళ్లాలి. చదువు మీద శ్రద్ధ చూపించాలి. సకాలంలో వైద్యం, టీకాలు వేయించాల్సిన అవశ్యకత ఉందని నివేదికలు తేల్చిచెప్పిన విషయాలు. ఇదే అతిపెద్ద సామాజిక బాధ్యత అవుతుంది. ప్రతి పథకానికి ఒక ముగింపు గడువు ఉండాలి. లేకుంటే ప్రజల స్వయం ఉపాధి గురించి ఆలోచించక ప్రభుత్వ సహాయం కోసం ఎదురు చూస్తుంటారని, తామేమిటో తమ బ్రతుకు తెరువు ఎలాగోనని ఆలోచించుకోగలిగే శక్తి కోల్పోతారని సూచిస్తోంది. స్వయం సమృద్ధి సాధించే విధంగా పథకాల రూపకల్పన అవసరం. నగదు బదలీ అనగానే మరో ఉపాధి రంగంలోకి వెళ్లకుండా కళ్లెం వేస్తున్నట్లేనని కూడా అంచనాలున్నాయి. దేశ ఉత్పాదకతపై ప్రభావం చూపే ఇలాంటి ఆలోచనలకు స్వస్తి చెప్పడం మంచిది.

ఖచ్చితమైన బ్రహ్మచర్యం పాటించడమొక్కటే జీవితంలో అన్ని రకాల విజయాలలోనూ గల రహస్యం.



వివేకానందుడు

ఎవరైనా మనకిచ్చేది తాత్కాలికమైనది. కృషితో మనం సాధించుకునేది శాశ్వతమైనది.



మహాత్మా గాంధీ

# ప్రమాద బాధితులను 'రాహ్‌వీర్' కాపాడేనా?

**రాష్ట్రంలో ప్రజల ఆరోగ్య పరిరక్షణలో నిండా మునిగి వుండే వైద్య ఆరోగ్యశాఖ సైతం రాహ్‌వీర్‌ల గుర్తింపు కోసం ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాల్సిందే. ఇకపోతే రాష్ట్రానికి అధిక మొత్తంలో రాబడి వనరుల ను సంపాదించి పెడుతున్నప్పటికీ సిబ్బంది కొరతతో విశాలమైన తమ పరిధిలో అవిశ్రాంతంగా శ్రమిస్తున్న రవాణాశాఖ కూడా ఇదేదో అదనపు బాధ్యతగా, బరువుగా భావించకుండా రాహ్‌వీర్ పథకం కన్వీనర్‌గా తన బాధ్యతను గుర్తెరిగి ఈ కార్యక్రమం అమలు కోసం చిత్తశుద్ధితో పనిచేయాలి. ఆస్పత్రులలో చేరిన అర్హులైన ప్రమాద బాధితులకు ఆర్థిక భారం పడకుండా ఒక లక్షా ఏభైవేల రూపాయల నగదు రహిత ఉచిత వైద్య సహాయాన్ని అందించడానికి గతేడాది కాలం నుండి అందుబాటులో వున్న క్యాష్‌లెస్ ట్రీట్‌మెంట్ పథకం తన పేరు మార్చుకుని పి.యమ్. రాహత్ పేరుతో మరో వినూత్న పథకంగా నిన్నటికి నిన్న దేశ ప్రధాని చేతుల్లో పురుడు పోసుకోవడం కొసమెరుపు.**



డాక్టర్ నీలం సంపత్

నేటి యాంత్రిక యుగంలో ప్రపంచంలోనే అత్యధిక రోడ్డు ప్రమాదాలకు నెలవుగా కొనసాగుతున్న మన దేశంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సుప్రీం కోర్ట్ ఆదేశాలకు అనుగుణంగా, మోర్త్ మార్గదర్శకాల తోడ్పాటుతో, ప్రపంచ బ్యాంక్ ప్రాయోజిత పథకాల తోడ్పాటుతో రోడ్డు ప్రమాదాల నివారణకై కృషి చేస్తూనే వున్నాయి. ఓ వైపు ఘోర రోడ్డు ప్రమాదాలను అరికట్టడానికి అవసరమైన ప్రణాళికల తో ముందుకు సాగుతూనే మరో వైపు ఘోర రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నప్పుడు గోల్డెన్ అవర్‌లో తీవ్రంగా గాయపడిన బాధితులను సమీప క్రిటికల్ కేర్ హాస్పిటల్‌లో చేర్పించి వారి ప్రాణాలను కాపాడడానికి అవసరమైన చర్యలను తీసుకుంటున్న వైనం అభినందనీయమే. సదరు ప్రభుత్వ చర్యలలో భాగంగా 2021లో పురుడు పోసుకున్న గుడ్ సమరిటన్ పథకం 31.3.2026 వరకే అమలులో ఉండేలా మార్గదర్శకాలను రూపొందించి దేశంలో వివిధ రాష్ట్రాలలో కేంద్ర పాలిత ప్రాంతాలలో అమలు చేయడం కోసం ఆయా ప్రభుత్వాలకు ఆదేశాలు జారీ చేసినప్పటికీ తెలంగాణ రాష్ట్రంతో సహా అనేక రాష్ట్రాలలో వాటి అమలు అంతంత మాత్రమే జరిగిందనేది నిర్వివాదాంశమే. ఫలితంగా ఘోర రోడ్డు ప్రమాదాల బాధితులకు స్వాంతన చేకూర్చే విధంగా ఆయా ప్రాంతాల్లో ఉండే బై స్టాండర్లకు గుడ్ సమరిటన్ లా పై అవగాహన కలగని కారణంగా మెడికో లీగల్ కేసుల నెపంతో పోలీసు శాఖ ఇబ్బందుల పాలు చేస్తారనే భయం నేటికీ వారిని వెంటాడుతోంది. ఫలితంగా గత ఐదేళ్ల కాలంలో ఘోర రోడ్డు ప్రమాదాలలో గాయపడిన బాధితుల పాలిట జీవన రక్షకులుగా బై స్టాండర్‌లు పని చేయలేకపోయారు. గతేడాది 36వ జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలు 2025లో అప్పటికే నాలుగేళ్ల నుండి అమలులోవున్న ఈ పథకం పై విస్తృత ప్రచారం జరగలేదు. ఐతే నెలరోజుల ఆకార్యక్రమంలో చివరి దశలో ఘోర రోడ్డు ప్రమాదాలలో గాయపడిన బాధితులను 'గోల్డెన్ అవర్'లో సమీప క్రిటికల్ కేర్ ఆస్పత్రులలో చేర్పించే బాధ్యతను చేపట్టే గుడ్ సమారిటన్‌లకు ఇచ్చే బహుమతి మొత్తాన్ని ఐదువేల రూపాయల నుండి ఇరవై ఐదు వేలరూపాయలకు పెంచాలని ప్రధాన మంత్రి నిర్ణయం తీసుకున్నారని కేంద్ర ఉపరితల రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ పత్రికాభిముఖంగా ప్రకటన చేయడం జరిగింది. సదరు ప్రకటనకు కొనసాగింపుగా నేమో అన్నట్లు ఈ సంవత్సరం మార్చి 31తో ముగిసిపోయే ఆ గుడ్ సమారిటన్ మార్గదర్శకాలను సవరిస్తూ గతేడాది ఏప్రిల్ మాసంలో ఈ పథకాన్ని రాహ్ వీర్‌గా మారుస్తూ గతంలో ఓ నిర్దిష్ట కాల పరిమితికి మాత్రమే అమలులో వున్న ఈ పథకాన్ని నిరంతరం కొనసాగే పథకంగా మారుస్తూ కేంద్ర ఉపరితల రవాణాశాఖ నిర్ణయం తీసుకోవడం గమనార్హం. దేశంలోని అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలలో ఈ పథకం అమలు కాబోతుంది. ఈ నేపథ్యంలో తెలంగాణ రాష్ట్ర రోడ్లుభవనాల శాఖ రాహ్‌వీర్ పథకాన్ని త్రికరణ శుద్ధిగా తెలంగాణ రాష్ట్రంలో అమలు పరచాలనే నిర్ణయం తీసుకోవడం జరిగింది. పేరు మార్చుకున్న ఈ పథకం ప్రకారం రాహ్‌వీర్‌లుగా వ్యవహరించబోయే వ్యక్తులకు గతంలో ఉన్నరివార్డ్ 5000 రూపాయల మొత్తాన్ని 25000ల రూపాయలకు పెంచడంతో పాటు ప్రశంసా పత్రాన్ని ఇవ్వాలనుకోవడం బై స్టాండర్లకు ఖచ్చితంగా ప్రోత్సాహకంగా మారుతుందని చెప్పక తప్పదు. మార్గదర్శకాల ప్రకారం ఒక సంవత్సర కాలంలో ఏ వ్యక్తియైనా గరిష్టంగా ఐదుసార్లు ఈ ప్రోత్సాహక బహుమతిని



అందుకోవచ్చు. ఇటీవలే ముగిసిన 37వ జాతీయరోడ్డు భద్రత మాసోత్సవాలు 2026లో రాహ్‌వీర్ పథకం పై విస్తృత ప్రచారం జరిగిన నేపథ్యంలో మోర్త్ మార్గదర్శకాలకు అనుగుణంగా తెలంగాణ రాష్ట్ర రవాణాశాఖ కమిషనర్ కార్యాలయం రాహ్‌వీర్ విధి విధానాలను రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లకు పంపిస్తూ పెరుగుతున్న రోడ్డు ప్రమాదాల తీవ్రత దృష్ట్యా అధిక సంఖ్యలో ప్రాణనష్టం, ఆస్తుల విధ్వంసం, రాష్ట్రస్థూల జాతీయ ఉత్పత్తిపై వాటి ప్రభావంనేపథ్యంలో వాటిని అమలు పరచాల్సిన బాధ్యతను వ్యక్తిగతం చేస్తూ త్రికరణ శుద్ధిగా నిర్వర్తించాలని కలెక్టర్‌లకు ఆదేశాలను జారీచేసింది. రాష్ట్రంలోని రహదారులపై ఘోర రోడ్డు ప్రమాదాలు జరిగి సదరు ప్రమాదాలలో తీవ్రంగా గాయపడిన వారిని ఒక గంటలోపు సమీప క్రిటికల్ కేర్ ఆస్పత్రులలో చేర్పించిన వారి వివరాలను రాష్ట్ర రవాణాశాఖ కమిషనర్‌కు చేరవేయడానికి జిల్లాల స్థాయిలో జిల్లాల కలెక్టర్ల చైర్మన్ షిప్‌లో ఓ అప్రైజల్ కమిటీ పనిచేస్తుంది. అందులో జిల్లా యస్.పి/ సి.పి ఆఫ్ పోలీస్ సభ్యులుగా, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి మరోసభ్యుడిగా, జిల్లా రవాణాశాఖ అధికారి కన్వీనర్‌గా కొనసాగుతారు. గుడ్ సమారిటన్‌ల వివరాలను (ఆధార్ కార్డ్, బ్యాంకు ఖాతాల వివరాలతో పాటు) పోలీసుశాఖ అధికారులు జాతీయ స్థాయిలో నిర్ధారించబడిన స్టాండర్డ్ అనెగ్జ్యూర్‌లో పొందుపరిచి వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో సమన్వయంతో జిల్లా కలెక్టర్ జిల్లా మెజిస్ట్రేట్‌కి పరిశీలన తగుచర్యల కోసం పంపించడంతో పాటు సదరు వివరాలను ఇడర్ పోర్టల్‌కు అప్‌లోడ్ చేయాల్సివుంటుంది. అదే విధంగా సదరు వివరాల ప్రతి నకలును అకనాలెడ్జ్‌మెంట్ రూపంలో ప్రతిపాదిత గుడ్ సమారిటన్‌కు అందించాలి. జిల్లా కలెక్టర్ తమ పరిశీలనానంతరం ప్రతి నెల అర్హులైన గుడ్ సమారిటన్‌ల వివరాలను కమిటీ కన్వీనర్‌గా కొనసాగుతున్న జిల్లా రవాణాశాఖ అధికారికి పంపడం జరుగుతుంది. తదనంతరం డి.టి.ఓ ఆ దరఖాస్తును రాష్ట్ర రవాణాశాఖ కమిషనర్‌కు పంపాల్సి ఉంటుంది. రాష్ట్ర స్థాయిలో పరిశీలన అనంతరం అర్హులైన రాహ్‌వీర్‌లకు ఇరవై ఐదువేల రూపాయలను పి.యఫ్.యమ్.యస్ అకౌంట్ ద్వారా గుడ్ సమారిటన్‌ల బ్యాంకు ఖాతాలోకి నేరుగా జమచేయబడుతుంది. అట్టి మొత్తం జాతీయ రోడ్ భద్రత నిధినుండి రాష్ట్ర రవాణాశాఖ కమిషనర్‌కు రియంబర్స్‌మెంట్ రూపంలో తిరిగి చెల్లించబడుతుంది. ఈ నెల మూడవ తేదీన రాష్ట్ర రవాణాశాఖ కమిషనర్ కలెక్టర్లకు జారీచేసిన ఉత్తర్వులలో ప్రతి నెలా జిల్లాల స్థాయిలో జరిగే జిల్లా రహదారి భద్రత సమావేశాలలో ప్రింట్, ఎలక్ట్రానిక్, సోషల్ మీడియా వేదికల ద్వారా, పోలీసుశాఖ, రవాణాశాఖ, వైద్య ఆరోగ్యశాఖల ప్రత్యేక చొరవతో రాహ్‌వీర్ పథకానికి సంబంధించి విస్తృతంగా ప్రచారాన్ని చేపట్టడం ద్వారా ఘోర రోడ్డు ప్రమాదాలలో తీవ్రంగా గాయపడిన బాధితుల ప్రాణాలను కాపాడడానికి ఓ అద్భుతమైన లైఫ్‌లైన్‌గా ఉపయోగపడే ఈ పథకాన్ని బలోపేతం చేయాలని ఆదేశించారు. ఐతే ప్రభుత్వ ప్రజాసంక్షేమ అభివృద్ధి పథకాలను రాష్ట్ర ప్రజల్లోకి తీసుకెళ్లే బాధ్యతను మోస్తున్న పబ్లిక్ రిలేషన్స్‌శాఖ ఈ పథకం విధివిధానాలను, ప్రయోజనాలను ప్రజల్లోకి తీసుకెళ్లగలిగితే ఆశించిన ఫలితాలు లభించవచ్చని పాలనా నిపుణులు అనుకుంటున్నారు. మరోవైపు అత్యంత ఘోర ప్రమాదాలలో తీవ్రంగా గాయపడి ప్రమాద స్థలాల్లో మృత్యువుతో పోరాడుతున్న ప్రమాద బాధితుల పట్ల బై స్టాండర్లు ప్రాణదాతలుగా మారాలంటే రోడ్ సేఫ్టీ స్టేక్ హోల్డర్లయిన పోలీసుశాఖ పౌరుల అంతర్గత భద్రత కార్యక్రమాలలో తల మునకలుగా ఉన్నప్పటికీ, ఆ ఒత్తిళ్లను దాటి రహదారి ప్రమాదాల తీవ్రతను గుర్తిస్తూ రాహ్‌వీర్ పథకం అమలు కోసం చిత్తశుద్ధితో కృషి చేయాలి. అదే విధంగా అనునిత్యం రాష్ట్రంలో ప్రజల ఆరోగ్య పరిరక్షణలో నిండా మునిగి వుండే వైద్య ఆరోగ్యశాఖ సైతం రాహ్‌వీర్‌ల గుర్తింపు కోసం ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాల్సిందే. ఇకపోతే రాష్ట్రానికి అధిక మొత్తంలో రాబడి వనరుల ను సంపాదించి పెడుతున్నప్పటికీ సిబ్బంది కొరతతో విశాలమైన తమ పరిధిలో అవిశ్రాంతంగా శ్రమిస్తున్న రవాణాశాఖ కూడా ఇదేదో అదనపు బాధ్యతగా, బరువుగా భావించకుండా రాహ్‌వీర్ పథకం కన్వీనర్‌గా తన బాధ్యతను గుర్తెరిగి ఈ కార్యక్రమం అమలు కోసం చిత్తశుద్ధితో పనిచేయాలి. ఆస్పత్రులలో చేరిన అర్హులైన ప్రమాద బాధితులకు ఆర్థిక భారం పడకుండా ఒక లక్షా ఏభై వేల రూపాయల నగదు రహిత ఉచిత వైద్య సహాయాన్ని అందించడానికి గతేడాది కాలం నుండి అందుబాటులో వున్న క్యాష్ లెస్ ట్రీట్‌మెంట్ పథకం తన పేరు మార్చుకుని పి.యమ్.రాహత్ పేరుతో మరో వినూత్న పథకంగా నిన్నటికి నిన్న దేశ ప్రధాని చేతుల్లో పురుడు పోసుకోవడం కొసమెరుపు. ●

# టీచర్లకు ఎఐ ప్రత్యామ్నాయంగా మారుతుందా?

జి.సత్యనారాయణరాజు

ఎఐ అనేది ఉపాధ్యాయులకు ప్రత్యామ్నాయం అవుతుందా అనే చర్చ జరుగుతోంది. అది ఒక సహాయక సాధనం మాత్రమే. తరగతి గదిలో మానవ స్పర్శ, సానుభూతి స్ఫూర్తిని ఎఐ భర్తీచేయలేదని విద్యారంగ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఎఐ అనేది ఉపాధ్యాయుల పాత్రను మెరుగుపరచడానికి ఉద్దేశించింది. అయితే వారిని భర్తీ చేయడానికి కాదంటున్నారు. మానవ సంబంధాలను నిర్మించడానికి, మానసిక మద్దతును అందించడానికి, అర్థవంతమైన అభ్యాస అనుభవాలను సులభతరం చేయడానికి మానవులైన ఉపాధ్యాయులు ఇప్పటికీ చాలాఅవసరం. వారినేపథ్యం లేదా సామర్థ్యాలతో సంబంధం లేకుండా విద్యార్థులందరికీ ఎఐ సాధనాలు అందుబాటులో ఉంటాయి. ఇది విద్యార్థుల ప్రత్యేక అవసరాలు అభ్యాస శైలులకు అనుగుణంగా అభ్యాస సామగ్రిని మార్చగలదు. అంతేకాకుండా అభ్యా సకుల గోప్యత, డేటా భద్రత కలిగిఉంటాయి. విద్యార్థుల వ్యక్తిగత అవసరాలను తీర్చడానికి అభ్యాస సామగ్రిని, జోక్యాలను సర్దుబాటు చేయడంలో ఎఐ వ్యవస్థలు మరింత అధునాతనంగా మారతాయి. ఈ వ్యక్తిగతీక రించిన విధానం అభ్యాస ఫలితాలను మరింత మెరుగుపరు స్తుంది. ఎఐ ఆధారిత చాట్‌బాట్‌లు, వర్చువల్ అసిస్టెంట్‌లు సహజ భాషను అర్థం చేసుకోవడంలో, ప్రతిస్పందించడంలో మరింత అభివృద్ధి చెందుతాయి. విద్యార్థులకు తక్షణ మద్దతు మార్గదర్శకత్వాన్ని అందిస్తాయి. విద్యా డేటాను విశ్లేషించడంలో విద్యావేత్తల కోసం కార్యాచరణ విధానాలను రూపొందించడంలో ఎఐ అల్గారిథమ్‌లు మెరుగుపడుతూనే ఉంటాయి. ఇది డేటా ఆధారిత నిర్ణయాధికారం, వ్యక్తిగతీకరించిన బోధనను సాధ్యం చేస్తుంది. విద్యలో ఎఐని అమలు చేయడం అనేది నమ్మదగిన డేటా లభ్యత ప్రత్యేక సాంకేతిక నైపుణ్యంవంటి సవాళ్లతో కూడి ఉంటుంది. ఉత్తమ పద్ధతులను అనుసరించడం ద్వారా, విద్యావేత్తలు తరగతిగదిలో ఎఐని విజయవంతంగా అనుసరించి ఫలితాలు సాధించవచ్చు. విద్యారంగంలో ఆన్‌లైన్ కోర్సుల రూపకల్పన, నిర్వహణలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఎన్నోఅవకాశాలను కలిగిస్తోంది. విద్యావేత్తలను శ్రమతో కూడిన పనులనుండి విముక్తి చేస్తుంది. ఇది సమయాన్ని ఆదా చేయడమే కాకుండా, కంటెంట్ ఎల్లప్పుడూ ప్రస్తుత పరిస్థితులకు తగినట్లుగా ఉండేలా చూస్తుంది. పరిపాలనా పనులను ఇప్పుడు ఎఐ ఉపయోగించి ఆటోమేట్ చేయవచ్చు. దీనివల్ల అధ్యాపకులు తమ దృష్టిని పూర్తిగా విద్యార్థులపై కేంద్రీకరించడానికి అవకాశం ఉంటుంది. దీంతో ఏ విద్యార్థి వెనుకబడిపోకుండా చూసుకోవచ్చు. ప్రతివిద్యార్థి గ్రహణ శక్తి ఒకేలా ఉండదు. ఎఐ దీనిని గుర్తించి పాఠం వినడంలో ఇబ్బంది పడుతుంటే, మరిన్ని ఉదాహరణలతో సులభంగా వివరిస్తుంది. పరీక్షా పత్రాల మూల్యాంకనం, హాజరు వంటి పరిపాలనా పనులను ఎఐ చూసుకుంటుంది. దీనివల్ల ఉపాధ్యాయులు విద్యార్థులకు నైతికవిలువలు సృజనాత్మకతను నేర్పడంపై ఎక్కువసమయం కేటాయించగలరు. ఏ విద్యార్థి పరీక్షల్లో వెనుకబడే అవకాశం ఉందో ఎఐ డేటా ద్వారా ముందే గుర్తించి ఉపాధ్యాయులను హెచ్చరిస్తుంది. ఏఐ ఉపాధ్యాయులకు ప్రత్యామ్నాయం కాదు. ●

# ప్రజావాక్కు



### కాలం ఎప్పుడూ ఒకేలా ఉండదు

**తెలంగాణా** రాష్ట్రముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపాలన అటు పంచాయితి ఇటు మునిసిపల్ ఎన్నికల ఘన విజయంతో మరింత బలోపేతమైంది. బలమైన ప్రత్యర్థి బిఆర్ఎస్. తప్పని సరై రెండవ స్థానంలో నిలిచింది. ఎందుకంటే బిజెపి అతి తక్కువ వార్డులు గెలుచుకోవడమే. అడపాదడపా కొన్నిఎమ్.పి. మరికొన్ని అసెంబ్లీ సీట్లు గెలిచినంత మాత్రాన కాంగ్రెసుకు గాని, బిఆర్ఎస్‌కు గానీ గట్టి ప్రత్యామ్నయం కాబోదు. ఇదే పరిస్థితి ఆంధ్రలో కూడా ఉన్నది. తెలంగాణ కాంగ్రెసులో బయటపడని ఎన్ని లుకలుకలు ఉన్నా 2029 వరకు రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి ఎదురు లేదు. ఆతరువాత రాజెవరో మంత్రివరో ప్రజలు నిర్ణయిస్తారు. బిఆర్ఎస్ 2024లో ఓడిపోతుందని, కాంగ్రెస్ పదవిలోకి వస్తుందని ఎవరైనా అనుకున్నారా? కాలం ఎల్లప్పుడు ఒకేలా ఉండదు.

- ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

### టారిఫ్ లాభదాయకమా?

**ప్రభుత్వాలు** క్రెడిట్ దక్కించుకోవడానికే ఆరాటపడుతున్నాయాని అనుమానం రాకమానదు. ఎందుకని భారత్‌కు ఎగుమతిచేసే వస్తువులపైన 0శాతము పన్ను విధించగా అమెరికాకు ఎగుమతి చేసే వస్తువులపైనా టారీఫ్ 25 శాతం నుండి 18కి తగ్గించారు. ఇక్కడే ఆ ఒప్పందం లాభదయాకమా లేదా నష్టాదయాకమా అని ఆలోచించవలసి ఉంది. దానిని భారత్ ఎందుకువ్యతిరేకించడం లేదు అనేది ఒక ప్రశ్న. ఎగుమతి అనంతరం చేయవలసినా పనులు అన్ని అమెరికా చేయదు కానీ భారత్ మాత్రం అమెరికాకు ఎగుమతి చేయాలి.

-భారత అవినాష్, జనగామ

### హెల్మెట్ తప్పనిసరి

**ఇటీవల** సంభవిస్తున్న రోడ్ ప్రమాదాల్లో హెచ్చు శాతం మోటార్ వాహన చోదకులు సరైన హెల్మెట్ ధరించక, లేకఉన్నప్పటికీ ఎదుటివాహనాన్ని ఢీకొట్టడంవల్ల తల భాగం మరణానికి కారణమవుతుంది. ఇది ఒక రక్షణకు ముఖ్య వస్తువు. దాన్ని ధరించడం తప్పనిసరి చేయాలి. అందరూ విధిగా చేస్తే ట్రాఫిక్ పోలీసులు లేని వారికి తనిఖీ అవసరమే లేదు. తిరుపతిలో దీన్ని ప్రత్యేకంగా ప్రచార భాగంలో ప్రత్యేకంగా తయారుచేసిన హెల్మెట్ను బంక్ ద్వారా అమ్మకం చేశారు.

- బొల్లోజు మేఘనాథం, విశాఖపట్నం

### జూదగాళ్లుగా మారుతున్న యువత

**భారతదేశ** ఆర్థిక ముఖచిత్రం గత కొన్ని ఏళ్ళలో గణనీయమైన మార్పులకు లోనైంది. గతంలో వాటా మార్కెట్ పరిమిత వర్గాలకే సాధ్యమనే భావన ఉండేది. నేడు సాంకేతిక విప్లవం వల్ల స్మార్ట్‌ఫోన్‌ఉన్న ప్రతిఒక్కరూ పెట్టుబడిదారులుగా మారుతున్నారు. ముఖ్యంగా యువత రికార్డు స్థాయిలో మార్కెట్లోకి ప్రవేశిస్తున్నారు. సాంకేతికత అందుబాటులోకి రావడం సానుకూల అంశమే అయినప్పటికీ, వాటావ్యాపారం గంభీరమైన పెట్టుబడి ప్రక్రియ నుండి ఒక సరదా ఆటలా రూపాంతరం చెందడం ఆందోళన కలిగిస్తోంది. ఈధోరణివల్ల యువతలో విశ్లేషణాత్మక ఆలోచన తగ్గి, తక్షణలాభాల పట్ల వ్యామోహం పెరుగుతోంది. ఆధునిక డిజిటల్ వేదికలు పెట్టుబడి ప్రక్రియను ఒక వీడియో క్రీడఆడినంతసులభంగా మార్చేశాయి. యువత దీర్ఘకాలిక పెట్టుబడిదారుల నుండి స్వల్పకాలిక జూదగాళ్లుగా మారుతున్నారు.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### ఓటర్ రైట్స్ యాక్ట్ తీసుకురావాలి

**వినియోగదారుల** హక్కులు వాలేనే 100 రూపాయలు చెల్లిస్తే డబ్బుకు రషీదు ఇవ్వాలి. నాణ్యత లేకుంటే వారంటీకింద రిపేరీ, గ్యారెంటీ కింద రీప్లేస్మెంట్ ఇవ్వాల్సిందే కానీ ఇప్పుడుమేమడు గుతున్నది ఓటర్ హక్కుల గురించి ఓటుకు రసీదు కావాలి. హామీల అమలుకు గ్యారెంటీ కావాలి. గెలిచిన అభ్యర్థి ప్రజలకు సేవ చెయ్యనిచో వారిని రీప్లేస్మెంట్ వారంటీ ఇవ్వాలి. ఇప్పుడు మనం మాట్లాడుకోవాల్సింది కన్స్యూమర్ రైట్స్ యాక్ట్ గురించి మాత్రమేకాదు ఓటర్‌రైట్స్ యాక్ట్ గురించికూడా. ప్రజాస్వామ్యంలో ప్రజలకు సేవ చేయాలి లేనిచో రికల్ చెయ్యాలి.

- సింగు లక్ష్మీనారాయణ, కరీంనగర్

### అట్టడుగు వర్గాలపై కన్ను

**బ్రిటిష్ వాళ్లు** మన దేశాన్ని రెండు శతాబ్దాలు పాలించారు, కానీ బ్రతక నేర్చిన భారతీయులే వేల ఏళ్ళుగా మన మనసులను పాలిస్తున్నారు. బ్రిటిష్ వాళ్లు మన భూమి దోచుకున్నారు, బ్రతక నేర్చిన వీళ్లు మన బుద్ధి దోచుకున్నారు. ఒక రాయిని గుడిలో దేవుడని పెట్టించారు, ఇంకో రాయిని సాకిరేవులో పెట్టించి వాళ్ళ బట్టలు ఉతికించుకున్నారు. భయం భక్తీ పేరుతో భావ దాస్యం చేయించుకుంటున్నారు. దాన్నే మతం, దాన్నే సంస్కృతి అని నమ్మిస్తూఉన్నారు. ఇదిమతం కాదు, మానసిక దోపిడీ. భారతదేశంబ్రిటిష్ పాలననుండి బయట పెట్టగలిగారు.

- వీరగంట భాస్కర్ రావు, బొబ్బిలి

మనవి ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# వ్యవసాయాన్ని నిర్వీర్యం చేస్తున్న కేటాయింపులు

బొల్లిముంతసాంబశివరావు

ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించిన 2026-27ఆర్థిక బడ్జెట్‌ను ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవులు 14.2.26న శాసనసభలోప్రవేశపెట్టారు. మొత్తం బడ్జెట్ 3,32,205 కోట్ల రూపాయలు. ఇది గతబడ్జెట్ కన్నా 9,856 కోట్లు ఎక్కువ. రెవిన్యూ వ్యయం 2,56,143కోట్లు. మూలధనం 53,915కోట్లు. రెవిన్యూలోటు 22,002 కోట్లు కాగా ద్రవ్యలోటు75,868కోట్లు. బడ్జెట్ లెక్కలు గమనిస్తే వివిధ రంగాలకు కేటాయించిన దానికోసం పెద్దమొత్తంలో అప్పులు చేయాలి. ఇప్పటికే అప్పుల్లో ఉన్న రాష్ట్రం మరింత అప్పుల ఊబిలో కూరుకుపోతుంది. గతబడ్జెట్లో అప్పులకు వడ్డీల కింద 24,430 కోట్లు కూటమి ప్రభుత్వం చెల్లించింది. ప్రభుత్వ ఖర్చులలో 18 శాతం వరకు వడ్డీలు, అసలు చెల్లింపులకే సరిపోతుందని ది హిందు తెలిపింది. ఈ లెక్కన అప్పులకు వడ్డీలచెల్లింపులు ఈ ఆర్థికసంవత్సరంలో మరింత పెరుగుతాయి. నూతన ఆర్థిక సంవత్సరంలో ప్రవేశపెట్టే బడ్జెట్లో, గత బడ్జెట్ వివిధ రంగాలకు కేటాయించిన మొత్తంలో ఎంత ఖర్చుపెట్టారు, ఎంతవరకు పని జరిగింది? ఇంకా ఎంతపని మిగిలి ఉంది? పూర్తిగా పని జరగకపోవటానికి కారణాలు వివరించి అందుకు నూతన బడ్జెట్లో నిధులు కేటాయించి ఎప్పటికి పూర్తి అవుతుందో తెలియచేయాలి. కాని 2026-27 బడ్జెట్లో అలాంటి ప్రస్తావనే లేదు. బడ్జెట్ మొత్తం అంకెల గారడీగా ఉంది. బడ్జెట్లో వివిధ రంగాలకు కేటాయింపులు గమనిస్తే వ్యవసాయరంగానికి రైతులకు ఇచ్చే రాయితీలను గణనీయంగా తగ్గాయి. 2025-26 ఆర్థిక సంవత్సరంలో వ్యవసాయ రంగానికి రూ.48,341.14 కోట్లు కేటాయించగా, ఈ ఆర్థిక సంవత్సర బడ్జెట్లో రూ.11,745.21 కోట్లు మాత్రమే కేటాయింపు జరిగింది. అంటే వ్యవసాయరంగానికి గణనీయంగా కేటాయింపులు తగ్గాయి. గతబడ్జెట్లో సాగునీటి ప్రాజెక్టులకు రూ.12,903 కోట్లు కేటాయించగా, ఈఆర్థిక బడ్జెట్లో రూ.9,906 కోట్లు కేటాయించారు. ఒకవైపున మూడు వేలకోట్ల దాకా కేటాయింపులు తగ్గించగా, బడ్జెట్ ప్రసంగాల్లో మాత్రం ఆర్థికమంత్రి, వ్యవసాయ మంత్రిమాత్రం సాగునీటి ప్రాజెక్టులు పూర్తిచేసి ప్రతి ఎకరాకు సాగునీరు అందిస్తామని చెప్పడం హాస్యాస్పదంగా ఉంది. రైతాంగ సేద్యం తీవ్రసంక్షోభాన్ని ఎదుర్కొంటున్నది. ప్రతిసంవత్సరం సేద్యపు ఖర్చులు పెరగటం, అందుకు అనుగుణంగా పంటలకు మద్దతు ధరలు లేకపోవడం, ప్రైవేట్ వ్యాపారుల దోపిడీ, ప్రభుత్వమే న్యాయమైన ధరకు పంటలు కొనుగోళ్లు చేయకపోవడం వల్ల రైతాంగం తీవ్రంగానష్టపోయి అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. అలాంటి పరిస్థితుల్లో ఉన్న రైతులు పంటలకు సరైన ధర కల్పించాలని డిమాండ్ చేశారు. రైతుల డిమాండ్ నేపథ్యంలో ఆనాటి వైసీపీప్రభుత్వ ముందస్తు పంటపెట్టుబడిని మూడు ధపాలుగా 13,500 రూపాయలు ప్రకటించింది. ఇందులో కేంద్రప్రభుత్వం ఇచ్చే ఆరువేల రూపాయలు కలిసిఉన్నాయి. చంద్రబాబు నాయకత్వాన ఉన్నకూటమి ప్రభుత్వం ముందస్తు పెట్టుబడి రూ.



20వేలుగా ప్రకటించింది. అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక సంవత్సరం పెట్టుబడి సహాయం ఇవ్వలేదు. ఆ తర్వాత సంవత్సరంలో కూడా ఇప్పటికి రెండుసార్లు మాత్రమే ఇచ్చింది. చాలామంది రైతులు పథకానికి దూరమయ్యారు. ఈ పథకం ఖర్చు తగ్గించుకోవడానికి అర్హతపేరుతో కొందరి రైతులను పథకం నుంచి తప్పించడానికి చంద్రబాబు ప్రభుత్వం పూనుకుంది. గతబడ్జెట్లో ముందస్తు పెట్టుబడి కోసం అన్నదాత సుఖీభవ పథకానికి రూ.9,400 కోట్లుకేటాయించిన ప్రభుత్వం, ఈ ఆర్థికసంవత్సరం బడ్జెట్లో రూ.6,600 కోట్లు మాత్రమే కేటాయించింది. ఫలితంగా చాలామంది రైతులు పథకానికి దూరముఅవుతారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతూ ఉన్నారు. అలాంటి పరిస్థితుల్లో పంటలు కొనుగోళ్లు చేసి తమను ఆదుకోవాలని రైతులు ఆందోళన చేసిన ఫలితంగా పంటల బీమా పథకం ప్రవేశపెట్టి రైతులకు పరిహారం అందిస్తామని పాలకులు చెప్పారు. ప్రస్తుతం పంటల బీమా ప్రీమియం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెల్లించాల్సి ఉండగా, గతసంవత్సరం చంద్రబాబు ప్రభుత్వ బడ్జెట్లో మాత్రం 1,023 కోట్లు కేటాయించినా ప్రీమియం చెల్లింపులు మాత్రంచేయలేదు. ఫలితంగా తుఫాన్ వల్ల నష్టపోయిన రైతులు బీమా పరిహారానికి దూరమయ్యారు. ఈ సంవత్సరంబడ్జెట్లో 250 కోట్లు మాత్రమే కేటాయించింది. ఈకేటాయింపులు గమనిస్తే, రాష్ట్రంలో పంటల బీమా పథకాన్ని కూటమి ప్రభుత్వం నిర్వీర్యం చేయ చూస్తుంది అనేఅభిప్రాయం ఏర్పడుతున్నది. సేద్యపు ఖర్చులు పెరగడం, పంటలకు న్యాయమైన ధరలు లభించక పోవడం, పంటలు అమ్ముడుకాని పరిస్థితుల వల్ల రైతాంగం నష్టపోయి అప్పుల ఊబిలో కూరుకుపోయారు. అనేకమంది రైతులు బలవన్మరణాల పాలయ్యారు. అలాంటి పరిస్థితుల్లో ఉన్న రైతాంగం బహిరంగ మార్కెట్లో పంటల ధరలు పడిపోయినప్పుడు న్యాయమైన గిట్టుబాటు ధర ఇచ్చి ప్రభుత్వమే పంటలు కొనుగోళ్లు చేయాలని ఆందోళన చేసిన ఫలితంగా అందుకోసం ధరలస్థిరీకరణ నిధిని ఆనాటి రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఆ తర్వాత జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ధరల స్థిరీకరణ నిధికి మూడు వేలకోట్లు కేటాయించింది. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత గత బడ్జెట్లో 300 కోట్లు మాత్రమే కేటాయించడంపై తీవ్ర విమర్శల నేపథ్యంలో ఈ ఆర్థికసంవత్సరం బడ్జెట్లో 500 కోట్లు కేటాయించి, కేటాయింపులు పెంచినట్లు చెప్పింది. ఈ నామమాత్రపు కేటాయింపు పెంపువల్ల రైతులకు ప్రయోజనం లేదు. ధరల స్థిరీకరణనిధి ద్వారా కూటమి ప్రభుత్వం పంటల కొనుగోళ్లు చేయలేదు. పంటలకు న్యాయబద్ధమైన మద్దతు ధరగ్యారంటీ ఇవ్వడంలేదు. రైతాంగానికి సున్నా వడ్డీకే పంట రుణాలు అందిస్తామని, కౌలు రైతులకు కూడా దాన్ని వర్తింప చేస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం ఆచరణలో విఫలమైంది. ఈబడ్జెట్లో సున్నా వడ్డీ రుణాల ప్రస్తావనగాని, కౌలురైతుల ప్రస్తావన ఎక్కడాకన్పించదు. రైతాంగాన్ని ఆదుకునే విధంగా బడ్జెట్ కేటాయింపులు చేయని కూటమిప్రభుత్వం, అవసరానికి మించిన వ్యవసాయయాంత్రీకరణ, లాభసాటి పంటల సాగు గురించి గొప్పలు చెప్పింది. ప్రకృతి వ్యవసాయమే రైతుల సమస్యలకు పరిష్కారంఅన్న విధంగా బడ్జెట్ ప్రసంగంలో మంత్రిమాటలు ఉన్నాయి. వ్యవసాయాన్ని నిర్వీర్యం చేసే వ్యవసాయ బడ్జెట్ ప్రతిపాదనలను వ్యతిరేకిస్తూ, స్వామినాథన్ సిఫార్సులకు అనుగుణంగా పంటలకు మద్దతుధరలు ప్రకటించి వాటికి చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేస్తూ ఉద్యమించడమే రాష్ట్ర రైతాంగం తక్షణ కర్తవ్యం. ●

# రైతులకు మరింత ద్రవ్యపరపతి

## కిసాన్ క్రెడిట్‌కార్డు సులభతరం

## రిజర్వ్ బ్యాంక్ కీలక మార్పులు

## త్వరలో మార్గదర్శకాలు విడుదల

**హైదరాబాద్, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త:** మరింత ఎక్కువ మంది రైతులకు ద్రవ్యపరపతిని అందుబాటులోకి తీసుకొచ్చేందుకు రిజర్వ్ బ్యాంక్ చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా కిసాన్ క్రెడిట్ కార్డ్ పథకంలో పెద్ద మార్పు లు చేయాలని కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు దీనికి సంబంధించి ద్రవ్య పరపతి విధాన కమిటీ, ఎంపీసీ, సమావేశం తర్వాత అభివృద్ధి సంబంధిత నియంత్రణ విధానాల్లో భాగంగా రిజర్వ్ బ్యాంక్ సోమవారం ఈ విషయాన్ని వెల్లడించింది. ఈ మార్పుల ఉద్దేశ్యం ఎక్కువ మంది రైతులకు ఈ పథకం చేరేలా చేయడం, ప్రక్రియలను సులభం చేయడమని తెలిపింది. వ్యవసాయ రంగం అవసరాలు కాలానుగుణంగా మారుతు న్నాయి కాబట్టి వాటికి సరిపడేలా రుణ వ్యవస్థను మార్చడం ప్రధానమని పేర్కొంది. ఇదే సమయంలో కిసాన్ క్రెడిట్ కార్డ్ పథకంపై పూర్తిస్థాయి సమీక్ష పూర్తయిందని తెలిపింది.

ఈ సమీక్షలో కవరేజ్ పెంపు, పని విధానాలు సరళీకరణ, వ్యవసాయ రంగం అలాగే అనుబంధ రంగాల్లో వస్తున్న కొత్త అవసరాలపై దృష్టి పెట్టింది. వ్యవసాయ రంగం అలాగే అనుబంధ కార్యకలాపాలకు సంబంధించిన కిసాన్ క్రెడిట్ కార్డ్ మార్గదర్శకాలు ఇప్పటివరకు వేర్వేరుగా ఉన్నాయి. ఇవన్నీ కలిపి ఒకే కొత్త ఫ్రేమ్‌వర్క్‌గా రూపొందించి బ్యాంకులకు సవరించిన ఆదేశాలు జారీ చేయాలని కేంద్ర బ్యాంక్ భావిస్తోంది. ఈ ప్రతిపాదిత మార్గదర్శకాలలో పంట కాలం ఒకే విధంగా నిర్ణయించే విధానం ఉంది. అన్ని ప్రాంతాల్లో ఒకే రీతిలో పంట కాలాన్ని నిర్వచించడం వల్ల రుణ అవసరాల అంచనా సులభం అవుతుంది, తిరిగి చెల్లింపు కాలపరిమితుల్లో స్పష్టత వస్తుంది.

కిసాన్ క్రెడిట్ కార్డ్ గడువును ఆరు సంవత్సరాలకు పెంచాలని కూడా ఆర్‌బీఐ సూచించింది. దీని వల్ల రైతులకు బ్యాంకులతో దీర్ఘకాలం స్థిరమైన రుణ సంబంధం ఏర్పడుతుంది. ప్రతి పంట కాలానికి ఉన్న స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ఆధారంగా డ్రాయింగ్ లిమిట్ నిర్ణయించే విధానాన్ని తీసుకు రానున్నారు. ఇలా చేయడం వల్ల సాగు ఖర్చులకు దగ్గరగా రుణ పరిమితి లభిస్తుంది.

ఆధునిక పరికరాలు, ప్రిసిషన్ ఫార్మింగ్ సాధనాలు, ఇతర అగ్రి టెక్ పరిష్కారాలపై అయ్యే ఖర్చులు కూడా కిసాన్ క్రెడిట్ కార్డ్ కింద అర్హమైన వినియోగంగా చేర్చనున్నారు. ఈ మార్పులన్నీ కలిగిన ముసాయిదా మార్గదర్శకాలు త్వరలో విడుదల చేస్తామని ఆర్‌బీఐ తెలిపింది.

# అదనంగా 18 లక్షల టన్నుల వరి తీసుకోండి

## రూ.1,460 కోట్ల బకాయిల విడుదల చేయాలి

## కేంద్రాన్ని కోరిన రాష్ట్ర సర్కార్

**హైదరాబాద్, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త:** రాష్ట్రంలో వరి సాగు విస్తీర్ణం పెరిగిన దృష్ట్యా అందుకు తగినట్లుగా ఉత్పత్తి అయిందని ఈ మేరకు అదనంగా ధాన్యాన్ని సేకరించాలని కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం విజ్ఞప్తి చేసింది. రాష్ట్రం నుండి 53.73 లక్షల టన్నుల సేకరణకు ఆమోదం లభించగా, ఉత్పత్తి ఊహించిన దానికంటే ఎక్కువగా ఉండటం వల్ల అదనంగా మరో 18 లక్షల టన్నులకు అనుమతించాలని కోరింది. ఈ మేరకు ఒక లేఖను సమర్పించింది. వరి సేకరణ మరియు పెండింగ్ బకాయిలకు సంబంధించి 2025-26 వానాకాలం సీజన్‌లో రాష్ట్రం సేకరించిన అదనంగా 18 లక్షల టన్నుల వరి ధాన్యాన్ని సేకరించేలా భారత ఆహార సంస్థ (ఎఫ్‌సిఐ)ని ఆదేశించాల్సి ఉంది. 10 శాతం బ్రోకెన్ రైస్ టాలరెన్స్‌తో ఈ అదనపు పరిమాణాన్ని ఎఫ్‌సిఐ సేకరించాలని రాష్ట్రం అభ్యర్థించింది. 2024-25 యాసంగి సీజన్ కోసం, 5 శాతం బ్రోకెన్ రైస్ అలవెన్స్‌తో అదనంగా 10 లక్షల టన్నుల బాయిల్డ్ రైస్‌ను మిల్లింగ్ చేయడానికి అనుమతి కోరింది. ఇదే సమయంలో గత ఖరీఫ్ సీజన్‌కు సంబంధించిన కస్టమ్ మిల్డ్ రైస్ సమర్పణకు ఈ నెల 28 తర్వాత రెండు నెలల పొడిగింపును కూడా ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం పేర్కొంది. 2014-15 ఖరీఫ్ సీజన్‌లో ఎఫ్‌సిఐకి సరఫరా చేసిన బియ్యం కోసం తెలంగాణకు చెల్లించాల్సిన రూ.1,468.94 కోట్ల బకాయిలను వెంటనే విడుదల చేయాలని ఆ సమయంలో రుణాలు తీసుకోవడం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం అదనపు లెవీ సేకరణ భారాన్ని భరించిందని, ఇప్పుడు వాటిపై వచ్చిన వడ్డీ రూ. 2,000 కోట్లకు మించిందని తెలిపింది. అదనంగా, ప్రధాన మంత్రి గరీబ్ కళ్యాణ్ యోజన కింద మే 2021 నుండి మార్చి 2022 వరకు సరఫరా చేయబడిన బియ్యం మరియు ఏప్రిల్ 2022లో చేసిన సరఫరాలకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న రూ.343.27 కోట్లను విడుదల చేయాలని ఆ లేఖలో విజ్ఞప్తి చేసింది.

# బూటులో దాచి.. 10 బంగారు బిస్కెట్లు చోరీ

## జోయలుక్కాస్‌లో సేల్స్‌మన్ నిర్వాకం

## వీటి విలువ రూ. 1.65 కోట్లు.. స్వాధీనం

## 24 గంటల్లో ఛేదించిన పంజాగుట్ట పోలీసులు

**హైదరాబాద్ (జూబ్లీహిల్స్), ఫిబ్రవరి 16, ప్రభాతవార్త:** జల్సాలకు అలవాటు పడ్డాడు.. ఖరీదైన వాహనా ల్లో చక్కర్లు కొట్టాలనుకున్నాడు.. పనిచేసే షాపు లో మొదట ఒక బంగారు బిస్కెట్‌ను తన కాలి బూటులో దాచాడు. ఎవరు గుర్తించకపోవడంతో అప్పుడప్పుడు అనుమానం రాకుండా దాదాపు పది బంగారు బిస్కెట్లను బూటులో పెట్టి చోరీకి పాల్ప డ్డాడు.. ఈ వ్యవ హారమంతా అక్కడే ఉన్న సీసీ టీవీ కెమెరాలో నమోదైంది.. దుకాణ నిర్వాహకుల ఫిర్యాదుతో రంగంలోకి దిగిన పంజాగుట్ట పోలీ సులు 24 గంటలు తిరక్కుండానే నిందితుడిని అరెస్ట్ చేశారు. అతని వద్ద నుంచి కిలో బంగారు బిస్కెట్లను స్వాధీనం చేసుకు న్నారు. ఖైరతాబాద్ జోన్ డీసీపీ శిల్పవల్లి కథనం ప్రకారం.. పంజా గుట్టలోని జోయలుక్కాస్ జ్యుయె లరీ షోరూంలో దాదాపు ఒకొక్కటి వంద గ్రాము లతో కూడిన పది బంగారు బిస్కెట్లు మాయ మైనట్లు ఈ నెల 14న దుకాణ ప్రతినిధులు గుర్తిం చారు. దాదాపు రూ. 1.62 కోట్ల విలువైన కిలో బంగారం కనిపించక పోవ డంతో వెంటనే సీసీటీవీ ఫుటేజీలను పరిశీలిం చారు. అందులో భాగంగా కారంపూడి గోపాలకృష్ణ అనే సేల్స్‌మెన్ కాలిబూట్లలో బం గారు బిస్కెట్లు పెట్టుకొని అక్కడి నుంచి జారు కున్నట్లు గుర్తించారు. దీంతో స్టోర్ మేనేజర్ జిన్స్ సెబాస్టియన్ పంజాగుట్ట పోలీ సులకు ఫిర్యాదు చేశారు.

పంజాగుట్ట ఎసిపి మురళీకృష్ణ ఆధ్వ ర్యంలో ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ, డిఐ నాగరాజు, డిఎస్సై సురేష్ బృందం నిందితుడిని సీసీ కెమెరాల ద్వారా గుర్తించి అరెస్ట్ చేశారు. గుంటూరు జిల్లా తాడేపల్లిలోని మహానాడు ప్రాంతానికి చెందిన కారంపూడి గోపాల కృష్ణ(25)గా నిందితుడిని గుర్తించి అతని వద్ద నుంచి ఒక కిలో బంగారు బిస్కెట్లు స్వాధీనం చేసుకున్నారు. వాటితోపాటు ఒక సెల్‌ఫోన్, బైక్‌ను స్వాధీనం చేసు కున్నారు. నిందితుడిని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. జల్సాల కోసం ఈ చోరీకి పాల్పడినట్లు పోలీ సుల దర్యాప్తులో భాగం గా నిందితుడు ప్రాథమి కంగా అంగీకరిం చాడు. కాగా నగల దుకాణ యజ మానులు తమ స్టోర్ లోపల, బయట, అను బంధ రహదారులు, సెల్లా ర్లు, పార్కింగ్ ప్రాం తాల్లో సీసీటీవీ కెమె రాలను మరింత ఎక్కు వగా, నాణ్యమైన వాటిని ఏర్పాటు చేసుకోవాలని డీసీపీ సూచించారు. ఉద్యోగుల రాకపోకలపై దృషి ్టపెట్టాలని, భద్రతా చర్యల విషయంలో రాజీ లేకుండా వ్యవహరిం చాలని సూచించారు. నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు వివరించారు.



అరెస్ట్ అయిన నిందితుడు గోపాలకృష్ణ, చిత్రంలో స్వాధీనం చేసుకున్న బంగారు బిస్కెట్లు, సెల్‌ఫోన్, బైక్ కీ.

# నగరంలో 'డెడ్‌డ్రాప్' డ్రగ్స్ సరఫరా బట్టబయలు

## కొండాపూర్‌లో అంతర్రాష్ట్ర డ్రగ్స్ ముఠా అరెస్టు

## 32 గ్రాముల కొకైన్ స్వాధీనం

**హైదరాబాద్ (గచ్చిబౌలి), ఫిబ్రవరి 16, ప్రభాతవార్త:** నగరంలో డ్రగ్స్ భూతం రోజురోజుకు జడలు విప్పుతుంది. ఓ వైపు ఈగల్ టీం, పోలీసులు పటిష్ట నిఘాతో కట్టడి చేస్తుండగా, మరోవైపు డ్రగ్స్ సరఫరాదారులు కొత్త దారులను వెదుకుతున్నారు. తాజాగా నగరంలో డెడ్‌డ్రాప్ డ్రగ్స్ సరఫరా బయటపడడం సంచలనం గా మారింది. కొండాపూర్‌లో ఓ అంతర్రాష్ట్ర డ్రగ్స్ ముఠాను ఈగల్ టీం, గచ్చిబౌలి పోలీసులు దాడులు చేసి పట్టు కోగా, ఈ ముఠా డెడ్‌డ్రాప్ తరహాలో డ్రగ్స్ సరఫరా చేస్తున్నట్లు గుర్తించారు. ముగ్గురు సభ్యుల ఈ ముఠాను అదుపులోకి తీసుకున్న పో లీసులు వీరి వద్ద నుంచి 32 గ్రాము ల కొకైన్ స్వాధీనం చేసుకున్నారు. గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్న ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. ఎపిలోని పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన మురళీ కృష్ణంరాజు(24) ఇంజినీరింగ్ మధ్యలోనే వదిలేసి కొన్నా ళ్లు ప్రైవేటు ఉద్యోగాలు చేశాడు. వాటిలో ఎక్కువ డబ్బు దొరక్క పోవడం, జల్సాలు, డ్రగ్స్ సేవించడం అలవాటు కావడంతో ఖర్చులు పెరిగాయి. దీంతో తానే డ్రగ్స్ సరఫరా చేయడం ప్రారంభించాడు. మొదట మణికొండలో ఉండే ఓ వ్యక్తి నుంచి గ్రాము కొకైన్ 10వేలకు కొనుగోలుచేసి 11వేలకు తెలిసిన వారికి విక్రయించేవాడు. కాగా మణికొండ వ్యక్తి పోలీసులకు పట్టుబడడంతో బెంగళూరుకు చెందిన నైజీరియన్ వద్ద నుంచి డ్రగ్స్ కొనుగోలు చేసి నగరానికి తీసుకు వస్తున్నాడు. గోవాలో ఉండే మరో వ్యక్తి వద్ద సైతం గ్రాము 7వేల రూపాయలకు కొని, నగరానికి తీసుకువచ్చి 12 వేలకు విక్రయిస్తున్నాడు. ఆంధ్రప్రదేశ్ నుంచి వచ్చి కెపిహెచ్‌బిలో నివాసం ఉంటున్న స్నేహితుడు భూపతి రాజు చిరంజీవివర్మ(28)ను సైతం ఇందులో భాగంచేసి వినియోగ దారులకు డ్రగ్స్‌ను సర ఫరా చేయించ సాగాడు. మరో నిందితుడు, కృష్ణం రాజుకు వరుసకు సోదరుడు హేమంత్‌రాజు(37) డ్రగ్స్‌కు బానిసగా మారగా, ఇతన్ని సైతం సరఫరాలో భాగం చేసి దందా చేస్తున్నాడు. కొండాపూర్‌లోని వెంకటేశ్వర రెసిడెన్సీలో వీరు డ్రగ్స్‌తో ఉనా ్నరని సమాచారం అందుకున ్న ఈగల్ టీం, గచ్చిబౌలి పోలీసులు సంయు క్తంగా దాడులుచేసి ముగ్గురు నిందితులను అరెస్టు చేశారు. వీరి వద్ద డ్రగ్స్ కొనుగోలు చేస్తున్న 15మంది వినియోగదారుల వివరాలను సేకరించి, వారికి నోటీసులు జారీ చేశారు.

**డెడ్‌డ్రాప్ సరఫరా..**

ఈ ముఠా డ్రగ్స్ సరఫరా కోసం డెడ్‌డ్రాప్ విధానాన్ని ఎంచుకొని తమ వివరాలు బయటపడకుండా జాగ్రత్తలు తీసుకున్నారని పోలీసులు తెలి పారు. వైఫైతో పనిచేసే వాట్సాప్ ద్వారా డ్రగ్స్ ఆర్డర్ తీసుకొని, బెంగ ళూరులోని తన స్నేహితుల అకౌంట్‌లకు పేమెంట్‌ను కృష్ణంరాజు చేయిం చుకుంటాడు. అనంతరం వారు కృష్ణంరాజుకు ట్రాన్స్‌ఫర్ చేస్తుంటారు. డబ్బు చెల్లించిన వారికి డెడ్‌డ్రాప్ విధానంలో సరఫరా చేస్తుంటారు. నిర్మానుష్య ప్రదేశంలో డ్రగ్స్‌ను పెట్టి, సదరు ప్రదేశం లోకేషన్, ఆన వాళ్లను వినియోగదారులకు చేరవేస్తారు. వారిని అక్కడికి వెళ్లి డ్రగ్స్ తీసు కోమని సూచిస్తారు. కాగా వీరి డెడ్‌డ్రాప్ విధానాన్ని ఉపయోగించే పోలీసులు వీరిని పట్టుకున్నారు.

# సిరిసిల్ల మున్సిపల్ చైర్‌పర్సన్‌గా జిందం కళా చక్రపాణి

**సిరిసిల్ల బ్యూరో, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త:** సిరిసిల్ల మున్సిపల్ చైర్‌పర్సన్‌గా జిందం కళా చక్రపాణి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బిఆర్ఎస్ పార్టీకి చెందిన జిందం కళా చక్రపాణి గత ఐదు సంవత్సరాల పాటు మున్సిపల్ చైర్‌పర్సన్‌గా పని చేశారు. ప్రస్తుతం కాంగ్రెస్ అధికారంలో ఉండడంతో ఎలాంటి సమస్యలైన ఎదుర్కొనేందుకు ధీటైన వ్యక్తిని ఎంపిక చేయాలనే ఉద్దేశ్యంతో చైర్‌పర్సన్‌గా జిందం కళా చక్రపాణిని కెటిఆర్ నిర్ణయించినట్లు తెలిసింది. ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో గెలుపొందిన అభ్యర్థులు సోమవారం సిరిసిల్ల మున్సిపల్ కార్యాలయం సమావేశ మందిరంలో ప్రమాణ స్వీకారం చేశారు. ఆర్‌డిఓ వెంకటేశ్వర్లు గెలుపొందిన బిఆర్ఎస్, కాంగ్రెస్, బిజెపి, స్వతంత్ర అభ్యర్థులతో ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం మున్సిపల్ ప్రత్యేక సమావేశంలో బిఆర్ఎస్ చైర్‌పర్సన్ అభ్యర్థి జిందం కళాను కౌన్సిలర్ రాంబాబు ప్రతిపాదించగా మరో కౌన్సిలర్ దొంతినేని కళ్యాణి అశోక్‌రావు బలపర్చారు. జిందం కళా చక్రపాణికి బిఆర్ఎస్‌కు చెందిన 27 మంది కౌన్సిలర్లు, ఒక స్వతంత్ర అభ్యర్థి బొలగం వైష్ణవి నాగరాజులు మద్దతు తెలిపారు. దీంతో జిందం కళా చైర్‌పర్సన్‌గా ఎన్నికైనట్లు ఆర్‌డిఓ వెంకటేశ్వర్లు ప్రకటించారు. అనంతరం చైర్‌పర్సన్ కళాతో ప్రమాణ స్వీకారం చేయించి దృవీకరణ పత్రాన్ని అందజేశారు. అనంతరం బిఆర్ఎస్ పార్టీకి చెందిన దార్ల సందీప్‌ను వైస్ చైర్మన్‌గా ఎన్నుకున్నారు. బిఆర్ఎస్ తరపున సందీప్ పేరు ఒక్కటే రావడంతో వైస్ చైర్మన్‌గా సందీప్ ఎన్నికైనట్లు తెలిపారు. కాగా సీనియర్ కౌన్సిలర్ బుర్ర నారాయణ గౌడ్ వైస్ చైర్మన్‌గా బిఆర్ఎస్ చెప్పినప్పటికి సమావేశానికి ముందే దార్ల సందీప్ పేరు తెరపైకి రావడంతో బుర్ర నారా యణగౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. చైర్‌పర్సన్, వైస్ చైర్మన్ ఎన్నిక కాగానే గెలుపొందిన కౌన్సిలర్లు, చైర్‌పర్సన్‌లు ర్యాలీలు నిర్వహించారు. ఈ కార్యక్ర మంలో మున్సిపల్ కమిషనర్ ఖదీర్ పాషా మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు. ఎలాంటి గొడవలు జరుగకుండ పో లీసులు బందోబస్తును ఏర్పాటు చేశారు.


ధ్రువీకరణ పత్రాన్ని అందుకుంటున్న చైర్‌పర్సన్ జిందం కళా

# నేటి నుంచి సిబిఎస్ఇ టెన్త్, ఇంటర్ బోర్డు ఎగ్జామ్స్

## మార్చి 11 వరకు టెన్త్ పరీక్షలు.. 27 వరకు ఇంటర్ ఎగ్జామ్స్

**హైదరాబాద్, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త:** దేశవ్యాప్తంగా నేటి(మంగళవారం) నుంచి సెంట్రల్ బోర్డు ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్(సీబీఎస్ఈ) టెన్త్, ఇంటర్ బోర్డు పరీక్షలు ప్రారంభం కానున్నాయి. పరీక్షలను ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు నిర్వహించనున్నారు. టెన్త్ పరీక్షలు నేటి నుంచి మార్చి 11 వరకు కొనసాగనుండగా.. ఇంటర్ పరీక్షలు నేటి నుంచి మార్చి 27 వరకు కొనసాగనున్నాయి. సవరించిన షెడ్యూల్ ప్రకారం.. సీబీఎస్ఈ క్లాస్ 10 బోర్డు పరీక్షలు ఈ నెల 17 నుండి మార్చి 11 వరకు జరగనున్నాయి. ఫిబ్రవరి 17న గణితం, ఫిబ్రవరి 21న ఇంగ్లీష్, ఫిబ్రవరి 25న సైన్స్, మార్చి 2న హిందీ, మార్చి 7న సోషల్ సైన్స్ పరీక్షలు జరుగుతాయి. ఇంటర్ పరీక్షలు నేటి నుంచి మార్చి 27 వరకు కొనసాగనున్నాయి. తెలంగాణ నుంచి టెన్త్ పరీక్షలకు 60వేల మంది హాజరయ్యే అవకాశం ఉందని, అలాగే ఇంటర్ పరీక్షలకు సుమారు 30వేల మంది హాజరయ్యే అవకాశం ఉంటుందని తెలుస్తోంది. రాష్ట్రంలో ఉన్న సీబీఎస్ఈ స్కూల్స్‌లో పరీక్షలను నిర్వహించనున్నారు.

# నేటి నుంచి టెన్త్ ప్రిఫైనల్ పరీక్షలు

## 24 వరకు కొనసాగింపు

**హైదరాబాద్, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని 10వ తరగతి విద్యార్థులకు నేటి(మంగళవారం) నుంచి ప్రీ ఫైనల్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. పరీక్షలు ఈ నెల 24 వరకు కొనసాగనున్నాయి. మార్చి 14 నుంచి 10వ తరగతి వార్షిక పరీక్షలు ప్రారంభం కానున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో నేటి నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ఎస్ఎస్‌సి విద్యార్థులకు ప్రీ ఫైనల్ పరీక్షలను నిర్వహించనున్నారు. పరీక్షలను ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు కొనసాగించనున్నారు. అయితే ఫిజిక్స్, బయలాజీ పరీక్షలను మాత్రం ఉదయం 9.30 గంటల నుంచి 11 గంటల వరకు నిర్వహించనున్నారు. ఈ నెల 17న ఫస్ట్ లాంగ్వేజ్, 18న సెకండ్ లాంగ్వేజ్, 19న థర్డ్ లాంగ్వేజ్, 20న గణితం పరీక్షలను నిర్వహించనున్నారు. ఈ నెల 21న ఫిజికల్ సైన్స్ పరీక్షను ఉదయం 9.30 గంటల నుంచి 11 గంటల వరకు, ఈ నెల 23న బయాలాజికల్ సైన్స్ పరీక్షను ఉదయం 9.30 గంటల నుంచి 11 గంటల వరకు నిర్వహిస్తారు. ఈ నెల 24న సోషల్ స్టడీస్ పరీక్షను ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు నిర్వహిస్తారు. మార్చి 14 నుంచి ప్రారంభం కానున్న ఎస్ఎస్‌సి వార్షిక పరీక్షలకు 5.06 లక్షల మంది విద్యార్థులు ఫీజును చెల్లించినట్టు అధికారులు తెలిపారు.

# హైదరాబాద్‌లో 63 మంది ఇన్‌స్పెక్టర్ల బదలీ

**హైదరాబాద్, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త:** నగర పోలీసు విభాగంలో మరోసారి భారీగా ఇన్‌స్పెక్టర్ల బదిలీలు జరిగాయి. 63 మంది ఇన్‌స్పెక్టర్లను బ దిలీ చేస్తూ పోలీసు కమిషనర్ సజ్జన్నార్ ఆదివారం రాత్రి ఆదేశాలు జారీ చేశారు. సజ్జన్నార్ పోలీసు కమిషనర్‌గా బాధ్యతలు చేబట్టిన తరువాత ఇన్ స్పెక్టర్ల బదిలీలు వరుసగా జరిగాయి. ఇదే సమయంలో పలువురు ఇన్‌స్పెక్టర్లు, ఇంకొందరు ఎస్‌ఐలపై వేటు పడింది. తాజా బవలీలలో అన్ని విభాగాల అధికారులకు స్థాన చలనం కలిగింది. అవినీతి ఆరోపణలు వున్న వారిని లూప్‌లైన్లకు పరిమితం చేయగా విధి నిర్వహణలో నికచ్చిగా ఉండేవారిని కీలక స్థానాల్లో నియమించారు. ముఖ్యమైన కేసుల విషయంలో సరిగ్గా దర్యాప్తు చేయని అధికారులపై తాజా బదలీలలో వేటు పడింది. కొందరు అధికారులను మల్టీ జోన్‌లకు పంపారు.

# కోఠిలో కాల్పుల కేసు: నిందితుడి అరెస్టు

**హైదరాబాద్, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త:** కోఠి వెళ్లే మార్గంలో గల బ్యాంక్ స్ట్రీట్ వద్ద గల ఎస్‌బిఐ ఎటిఎంలో నగదు డిపాజిట్ చేసే వ్యక్తిపై కాల్పు లు జరిపి ఆరు లక్షల రూపాయలు దోచు కున్న కేసులో ఒక నిందితుడు హరియాణలో పట్టుబడ్డాడు. గత నెల 31వ తేదీన ఉదయం ఏడు గంట ల సమయంలో ఇద్దరు దుండగులు పక్కాగా వచ్చి నగదు వుంచేందుకు వచ్చిన వ్యక్తిపై కాల్పులు జరపడం నగరంలో తీవ్ర సంచలనం రేపడం తెలి సిందే. ఈ కేసులో బాధితుడు కేరళకు చెందిన వ్యాపారి కాగా దుండగుల కాల్పుల్లో తొడకు గాయం అవడంతో అతన్ని వెంటనే ఉస్మా నియా ఆస్పత్రికి తరలించారు.

అతని ఆరోగ్యం నిలకడగానే వుంది. కాగా దోపిడి తరువాత బాధితుడి ద్విచక్ర వాహనంపై కాచిగూడ రైల్వే స్టేషన్ వరకు వెళ్లి ఆ వాహనాన్ని అక్కడ వదిలేసిన దొంగలు అనంతరం అక్కడి నుంచి సికింద్రాబాద్‌కు ఆటోలో, అనంతరం బస్సులో మరోచోటుకు పారిపోయారు. ఈ కేసులో ప్రత్యక్ష సాక్షుల వాంగ్మూలం మేరకు నింది తుల సమాచారం సేకరించి ఇందులో ఒకడిని హరియాణాలో సోమవారం నాడు పట్టుకున్నారు. ఇతని వద్ద కాల్పులు జరిపిన రివాల్వర్ పట్టు బడిందని తెలిసింది. ఇతని అనుచరుడి కోసం యుపి హరియాణాలలో గాలిస్తున్నారు.

# నేర పరిశోధనలో పోలీసు జాగిలాల సేవలు అమోఘం

## నేడు మొయినాబాద్‌లో 25వ బ్యాచ్ జాగిలాల దీక్షాంత్ పెరేడ్

**హైదరాబాద్, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త:** నగర శివార్లలోని మొయినాబాద్‌లో గల పోలీసు జాగిలాల శిక్షణా సంస్థలో 25వ బ్యాచ్ జాగిలాల దీక్షాం త్ పరేడ్ మంగళవారం జరగనుంది. ఒకప్పటితో పోలిస్తే ప్రస్తుతం దేశ వ్యాప్తంగా అన్ని పోలీసు విభాగాలు ఆఖరుకు పారా మిలటరీ, త్రివిధ దళాలు జాగిలాల సేవలను ఉపయోగించు కుంటున్నాయి. ఒక్కమాటలో చెప్పాలంటే రక్షణ, హోం శాఖల పరిధిలో గల అన్ని విభాగాల్లో నేడు జాగిలాల పాత్ర కీలకంగా వుంది. ఈ నేపథ్యంలోనే తెలంగాణ పోలీసు శాఖ జాగిలాల కోసం ప్రత్యేక శిక్షణా కేంద్రాన్ని నిర్వహిస్తోంది. ఉమ్మడి ఎపి హయా ంలోనే మొయినాబాద్‌లో గ్రే హౌండ్స్ విభాగంలో 2004లో దీనిని నెలకొల్పారు. ఇప్పటి వరకు సుమారు 900 వరకు జాగిలాలకు 1200 పైగా హ్యాండ్లర్లు (జాగిలాల పర్యవేక్షకులు) ఇక్కడ శిక్షణ పొంది అన్ని రాష్ట్రాలు, పారా మిలటరీ బలగాలలో సేవలందిస్తున్నారు. పోలీసులకు వుండే విధం గానే జాగిలాలకు ప్రత్యేకంగా శిక్షణ వుంటుంది. శారీరక శ్రమతో కూడిన శిక్షణతో పాటు పేలుడు పదార్థాలు, మాదకద్ర వ్యాలను గుర్తించడంలో వీటి కి ప్రత్యేకంగా శిక్షణ ఇస్తారు. నెలల వయస్సు కలిగిన మేలు రకం జాగిలాలను ఇక్కడకు తీసుకువచ్చి దాదాపు ఏడాది పాటు శిక్షణ ఇస్తారు. ఈ శి క్షణలో జాగిలాలు రాటుదేలి పోలీసులకు వెన్నుదన్నుగా వుంటాయి. కొన్నిసార్లు ఉగ్రవాదులపై ఎదురుదాడి కూడా చేస్తాయి. కాశ్మీర్ లోయలో ఎన్ కౌంటర్ సమయంలో ఓ ఉగ్రవాదిపై దూకి అతన్ని మట్టుపెట్టడంతో భద్రతా బల గాలకు ఓ జాగిలం తనవంతు సహాయం చేసి ప్రాణాలను విడిచిం ది. ఈ జాగిలానికి రాష్ట్రపతి సేవ పతకం లభించింది. ఇటువంటి ఉదంతాలు అ నేకం వున్నాయి. విమానాశ్రయాలు, ఓడ రేవుల్లో మాదకద్రవ్యాల ను గుర్తించడంలో జాగిలాలదే కీలక పాత్ర. తెలంగాణ పోలీసు విభాగంలో వందకు పైగా జాగిలాలు సేవలందిస్తున్నాయి. జాగిలాల వెంట హ్యాండ్ల ర్లు వుంటారు. మంగళవారం నాటి జాగిలాల దీక్షాంత్ పరేడ్‌కు డిజిపి శివధర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. నిఘా విభాగం అదనపు డి జి విజయ్ కుమార్ సహా ఇతర అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొననున్నారు.


శిక్షణ పొందిన పోలీసు జాగిలాలు

# మూసీ ప్రజల హక్కుల రక్షణకే ఉద్యమం

## టిడిఆర్‌లను అంగీకరించేదిలేదు

## మూసీ జన్ ఆందోళన్

**హైదరాబాద్, ఫిబ్రవరి 16,ప్రభాత వార్త:** మూసీ, నది ఒడ్డున నివసించే ప్రజా సమూహాల హక్కులను పరిరక్షించడానికి స్వతంత్ర ప్రజా ఉద్యమం మూసీ జన్ ఆందోళన్ కృషి చేస్తోందని పలువురు పౌర, ప్రజా, పర్యావరణ సంఘాల నేతలు వెల్లడించారు. తెలంగాణ ప్రభుత్వం మూసి నదీ తీర అభివృద్ధి ప్రాజెక్టు పేరుతో వ్యవహరిస్తున్న ఏకపక్ష, నిరక్ష్య విధానాన్ని వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. సోమవారం సోమాజి గూడ హైదరాబాద్ ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన మీడియా సమావేశం లో పౌర సమాజ కార్యకర్తలు, పర్యావరణవేత్తలు, మానవ హక్కుల సంఘాలు, మూసీ ఒడ్డున నివసించే మంచిరేవుల, గంధం గూడ, హైదర్‌గుడ, బండ్లగూడ గ్రామాల నివాసితులు మాట్లాడారు. వారు మాట్లాడుతూ నది సరి హద్దు, బఫర్ జోన్లకు సంబంధిచిన మ్యాప్లకు సంబంధించి ప్రభుత్వం పూర్తి గోప్యతను పాటిస్తోందని తెలిపారు. భూసేకరణకు సంబంధించి ప్రకటి స్తున్న టీడీఆర్‌లను నిర్ద్వందంగా వ్యతిరేకిస్తున్నామని ప్రకటించారు. మూసీ జన్ ఆందోళన్ నేత సజయ, మానవ హక్కుల వేదిక నాయ కులు సయ్యద్ బిలాల్, క్లైమేట్ ఫ్రంట్ తెలంగాణ నాయకులు రుచిత్ ఆశా కమల్, దళిత్ బహు జన్ ఫ్రంట్ నేత జాన్ మైఖేల్, విశాలి (కార్సి ర్డ్), మూసీ నదీప్రాంత బాధిత కుటుంబాలు పాల్గొన్నాయి.

**NOTTCE AS PER THE ORDERS OF THE HON'BLE RECOVERY OFFICER — 2 DEBTS RECOVERY TRIBUNAL-I, HYDERABAD.**

**M.P.NO.208/2025 In RP NO. 77/2022 IN O.A.No.385/2020**
**Filed by M/S.Omkara Assets Reconstruction Private Ltd. vs M/s.Spisys Ltd (formerly Novo Agritech Ltd), AND OTHERS**

1. **R2 M/s.Spisys Ltd (formerly Novo Agritech Ltd)** Regd Office:12-1-18, Ramcor Agro Building, Waltair Main Road, Visakhapatnam — 530 001 Rep by its Managing Director
2. **Mr.J.Raghunath Rao S/o.J.V.Naid**, age 79 years, R/o.8-1-65, Pedda Waltair, Visakhapatnam— 530 017
3. **Mr.J.Sobhanadri S/o.J.R.Rao**, age 56 years, R/o.402, Road No.81, Phase-III, Jubilee Hills, Hyderabad-500 034
4. **Mr.S.Suresh Babu**, S/o.S.Sri Rama Murthy, age 61 years, R/o.4-63/1, HUDA Colony, Chandanagar, Hyderabad — 500 050

**...Respondents No.1 to 4 / Defendants No.1 to 4**

Please take Notice that India M/S.Omkara Assets Reconstruction Private Ltd. has filed MP No.208/2025 in RP No.77/2022 in OA NO.385/2020 before the Hon'ble Recovery Officer -2 Debts Recovery Tribunal -1 Hyderabad , Triveni Complex, Abids Hyderabad to subtitute itself in the place of IDBI Bank Ltd. & Stressed Assets Stabilisation Fund the Original Certificate Holders / Applicants.
Please take Notice that the above case is posted to 06/03/2026 for aappearance / counter and hearing.

**Sd/- Srinivas Chitturu** Advocate
Counsel for Petitioner / Proposed Certificate Holder

hmda **హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ**
4వ అంతస్తు, స్వర్ణ జయంతి కమర్షియల్ కాంప్లెక్స్, అమీర్‌పేట, హైదరాబాద్

**HMDA చట్టం 2008 యొక్క 15(3) సెక్షన్ క్రింద బహిరంగ ప్రకటన**
**(Lr. No. MED0200008I427I9/CLU/Plg/TS-iPASS/HMDA/2025, తేది: 29.01.2026)**

G.O.Ms.No.33, MA & UD, తేది 24.01.2013 ప్రకారం, ప్రభుత్వంచే అనుమతింపబడి, హైదరాబాద్ మెట్రోపాలిటన్ రీజియన్ (HMR) కొరకు ప్రకటింపబడిన మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ ప్లాన్ (MDP)-2031లోని దానిలో సూచింపబడిన భూమి వినియోగానికి ఈ క్రింది మార్పులు చేయటానికి HMDA చట్టం 2008 యొక్క సెక్షన్ 15 యొక్క సబ్-సెక్షన్ (3)చే సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ ప్రతిపాదించబడినది.
మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా, మేడ్చల్ (మం), నూతన్‌కల్ (గ్రా) యొక్క సర్వే నం.లు 833, 837/P, 838/P, 850/P లోని 17331.46 చ.మీ. స్థలం G.O.Ms.No.33 MA & UD, తేది: 24.01.2013 ప్రకారం ప్రకటింపబడి మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ ప్లాన్ MDP-2031లో కన్సర్వేషన్ వినియోగ జోన్ కొరకు ప్రస్తుతం ఏదైతే నిర్దేశించబడిందో అది ఇప్పుడు 'గ్రీన్' కేటగిరీ క్రింద కోల్డ్ స్టోరేజ్ కొరకు యూనిట్ నెలకొల్పటానికి ఉత్పత్తి వినియోగజోన్‌గా అధికారయుతంగా నిర్దేశించబడటానికి ప్రతిపాదించబడింది.
పై సంబంధిత వివరాలు వెబ్‌సైట్స్ http://gazette.telangana.gov.in// మరియు http://hmda.gov.in// లో అందుబాటులో ఉన్నాయి.
సదరు ప్రతిపాదనలకు ఏ వ్యక్తి లేదా సంస్థ నుండైనా అభ్యంతరాలు/సూచనలు పరిగణింపబడతాయి. వారు అభ్యంతరాలు/సూచనలను లిఖితపూర్వకంగా ఈ ప్రకటన ప్రచురింపబడిన తేదీ నుండి (7) ఏడు రోజులలోపుగా HMDA, MCకు గానీ లేదా ప్రిన్సిపల్ సెక్రటరీ, MA & UD విభాగం, తెలంగాణ సెక్రటేరియట్, హైదరాబాద్ వారికి గానీ దాఖలు చేయవలెను.

సం/- చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్, (PR), HMDA
DIPR.No.15373-PP/CL/Advt/1/2025-26, తేది: 16.02.2026

**తెలంగాణ ప్రభుత్వం**
**రెవెన్యూ (LA) శాఖ**

**ఫారం VII**
(చట్టం-30/2013 యొక్క సెక్షన్-19(1) మరియు నిబంధన-25 యొక్క ఉప-నిబంధన (1) చూడండి)
స్పెషల్ కలెక్టర్ (LA) & కమిషనర్, GHMC, హైదరాబాద్
రూఢీ ప్రకటన

గెజిట్ నం. GHMC-13 తేది: 27.01.2025
నం. AA/782/2007 తేది: 27.01.2025

ఇది ఇలా ఉండగా తెలంగాణ ప్రభుత్వం/ స్పెషల్ కలెక్టర్ (LA) & GHMC కమిషనర్, ప్రజా ప్రయోజనం నిమిత్తం GHMC చే ప్రైవేట్ భూమి వినియోగంలో హుస్సేన్ సాగర్ సర్‌ప్లస్ నాలాలో RCC రిటైనింగ్ గోడ విషయంలో పునాది రాయి వేయడం మరియు బోర్ బావి త్రవ్వకం హైదరాబాద్ జిల్లా హిమాయత్‌నగర్ మండలం & లింగంపల్లి గ్రామంలో 323.29 చ.మీ. లేదా 386.65 చ.గ. యొక్క భూమి మొత్తం అవసరమై ఉన్నదని భావించారు.

అందువలన 323.29 చ.మీ. లేదా 386.65 చ.గ. కొలత యొక్క ప్రామాణిక కొలత ఎక్కువ లేదా తక్కువ భూమికి ప్రకటన చేయబడింది. దాని సవివర వివరణ ఈ క్రింది విధంగా ఉంది.

| ప్రాంగణం నం. | టైటిల్ రకం | భూమి రకం | చ.గ.లలో విస్తీర్ణం | ఆసక్తిగల వ్యక్తి పేరు | సరిహద్దులు | | | | చెట్లు | | నిర్మాణాలు | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| | | | | | ఉత్తరం | దక్షిణం | తూర్పు | పడమర | రకం | సం. | రకం | ప్లింత్ ఏరియా చ.గ.లలో |
| 2 | 3 | 4 | 5 | 6 | 7 | 8 | 9 | 10 | 11 | 12 | 13 | 14 |
| ఇ.నం. 3-4-897 /2 ఎదుట | పట్టా | బహిరంగ భూమి | 323.29 | 1. M. కల్యాన్ సింగ్ 2. M. దల్బీర్ సింగ్ 3. M. అజయ్ సింగ్ | నాలా | పెట్రోల్ పంప్ | రోడ్ | నాలా | - | - | - | - |
| | | మొత్తం | 323.29 | | | | | | | | | |

2013 యొక్క చట్టం నం. 30 యొక్క 15 సెక్షన్ క్రింద ఏర్పాటైన విచారణ మరియు ఆసక్తిగల వ్యక్తుల అభ్యంతరాలు విన్న తర్వాత ఈ రూఢీ ప్రకటన చేయబడింది. భూసేకరణ కారణంగా పునరావాసం కల్పించబడిన కుటుంబాల సంఖ్య నిల్.

భూసేకరణకు తలపెట్టిన సదరు భూగర్భంలో బొగ్గు యొక్క గనులు, ఇనుపరాయి, పలక మరియు ఇతర ఖనిజాలు ఇట్టి భూములలో లేదా కొంత భాగంలో లభ్యమైనచో ఆ ఖనిజాలు ప్రాజెక్ట్ నిర్మాణానికి ఉపయోగం ఉన్న పక్షంలో వాటిని స్వీకరించబడును. లేనిచో స్వీకరించబడవు.

భూమి యొక్క ప్లాన్‌ను స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, LA, GHMC, 6వ అంతస్తు, ట్యాంక్‌బండ్ రోడ్, హైదరాబాద్ వారి కార్యాలయం ఏ పని రోజునైనా, పని వేళలలో పరిశీలన చేసుకొనటానికి వీలుగా అందుబాటులో ఉంటుంది.

సం/- స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (LA), GHMC, హైదరాబాద్

సం/- స్పెషల్ కలెక్టర్ (LA) & కమిషనర్, GHMC, హైదరాబాద్

DIPR.RO.NO: 1182/LA/PP/Advt/Pub/2025-26

# నిధుల మంజూరుకు కేంద్ర ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్

## త్వరలో కేంద్రం నుంచి రూ. 564 కోట్లు

**హైదరాబాద్, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త:** ప్రభుత్వం పంపిణీ చేసే ఇళ్ల కోసం ఎదురుచూస్తున్న వారికి శుభవార్త. త్వరలో రాష్ట్రంలో ఇళ్ల నిర్మాణం మళ్లీ మొదలుకానుంది. రాష్ట్రంలోని ఇళ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో తెలంగాణలో నిలిచిపోయిన ఇళ్ల నిర్మాణం మళ్లీ మొదలుకానుంది. ఈ క్రమంలో ఇళ్ల నిర్మాణం త్వరగా పూర్తి చేసి లబ్దిదారులకు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్ర నిధులు ఉపయోగపడనున్నాయి. తెలంగాణలో పూర్తైన డబుల్ బెడ్ రూం ఇళ్లకు కేంద్రం పీఎం ఆవాస్ యోజన పథకం ద్వారా తన వాటాను రిలీజ్ చేసేందుకు సిద్ధమైంది. ఈ నిధులను అసంపూర్తిగా మధ్యలో ఆగిపోయిన డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణాలకు రాష్ట్ర ప్రభుత్వం ఉపయోగించుకుని త్వరగా పూర్తి చేయనుంది. వీటిని కొత్త లబ్దిదారులకు అందించేందుకు మార్గం సుగమమైంది.


త్వరలో కేంద్రం నుంచి రూ.564 కోట్లు

డబుల్ బెడ్ రూం ఇళ్ల బకాయిలు త్వరలో కేంద్ర ప్రభుత్వం నుంచి రాష్ట్రానికి అందనున్నాయి. రూ.564 కోట్లు విడుదల చేసేందుకు కేంద్రం ఓకే చెప్పింది. ఇటీవల ఢిల్లీ వెళ్లిన రాష్ట్ర అధికారులు కేంద్ర అర్బన్ హౌసింగ్ అధికారులను కలిసి బకాయిలు విడుదల చేయలని కోరారు. దీంతో కేంద్రం త్వరలోనే విడుదల చేసేందుకు హామీ ఇచ్చింది. తెలంగాణలో 1.45 లక్షల డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల నిర్మాణం ప్రారంభం కాగా వీటిల్లో ఇప్పటివరకు 60వేల ఇళ్లు లబ్దిదారులకు పంపిణీ చేశారు. ఇక మరో 30వేలు పంపిణీకి సిద్ధంగా ఉండగా మిగతా ఇళ్లు నిర్మాణంలోనే ఉన్నాయి. నిధుల కొరత వల్ల ఇళ్ల నిర్మాణం ఆగిపోయింది. ఇప్పుడు కేంద్రం నుంచి వచ్చే నిధులతో ఆ ఇళ్లను పూర్తి చేసి లబ్దిదారులను అందించనున్నారు. సొంత జాగా, సొంత ఇళ్లు లేనివారికి ఈ ఇళ్లను అందించనున్నారు. పీఎం ఆవాస్ యోజన పథకం ద్వారా నిధులు రావాలంటే లబ్దిదారుల పేర్లు, ఇతర వివరాలన్నీ కేంద్ర ప్రభుత్వ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. మరోవైపు ఇందిరమ్మ ఇళ్ల పథకానికి కూడా కేంద్రం ప్రభుత్వం తన వాటాగా లబ్దిదారులకు అందిస్తోంది. దీని వల్ల తెలంగాణలో ఇళ్ల నిర్మాణం వేగవంతమయ్యే అవకాశముంది.

# 19, 20 తేదీల్లో ఒయులో వైస్‌ఛాన్సలర్ల సదస్సు

## హాజరుకానున్న గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ

**హైదరాబాద్ (తార్నాక), ఫిబ్రవరి 16, ప్రభాతవార్త :** ప్రతిష్టాత్మక ఉస్మానియా యూనివర్సిటీ వేదికగా ఈ నెల 19, 20 తేదీల్లో ఉన్నత విద్యపై ప్రతిష్టాత్మక సెంట్రల్ జోన్ వైస్ ఛాన్సలర్ల సదస్సు నిర్వహిస్తున్నట్లు ఒ.యూ వైస్ చాన్సలర్ ప్రొ. కుమార్ మొలగరం పేర్కొన్నారు. ఈ సదస్సుకు సంభందించి రూపొందించిన బ్రోచర్‌ను సోమవారం ఒయూలో విసి ఆవిష్కరించారు. అసోసియేషన్ ఆఫ్ ఇండియా యూని వర్సిటీస్ (ఏఐయూ), ఒ.యూ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించే ఈ సమావేశానికి తెలంగాణ, ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాల నుంచి సుమారు 120 మంది ఉపకులపతులు, ఉన్నత విద్యావేత్తలు, విద్యా నిర్వాహకులు హాజరుకానున్నారు. క్రియేటింగ్ ఏఐ క్వాంటమ్ టెక్నాలజీతో ఉన్నత విద్యాసంస్థల రూపకల్పన ప్రధాన అంశంగా రెండు రోజులపాటు మేధోమధనం జరగనుంది. సదస్సును రాష్ట్ర గవర్నర్ ప్రారంభించనున్నారు. నైతిక పాలన, ఏఐ బాధ్యతాయుత వినియోగం, విద్యా సంస్కరణలు, విశ్వవిద్యాలయాల మధ్య సహకారం వంటి అంశాలపై ప్రత్యేక సాంకేతిక సెషన్లు నిర్వహించనున్నారు. చర్చల సారాంశాన్ని జాతీయ స్థాయి విధాన రూపకల్పన కోసం ఏఐయూకు సిఫార్సు చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.



సదస్సుకు సంబంధించి బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న వి.సి ప్రొ.కుమార్ మొలగరం, రిజిస్టార్ తదితరులు

# రైతుల కోసం మరో యాప్

## త్వరలో అందుబాటులోకి రానున్న ఆర్గానిక్ ఫార్మర్స్ యాప్

**హైదరాబాద్, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త:** తెలంగాణ రైతులకు మరో వినూత్న యాప్ అందుబాటులోకి రానుంది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. ఇప్పటికే పత్తి రైతుల కోసం కేంద్ర ప్రభుత్వం కిసాన్ కపాస్ యాప్‌ను తీసుకురాగా... యూరియా కోసం రైతులు బారులు తీరాల్సిన పనిలేకుండా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా యూరియా యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చిన విషయం విదితమే. తాజాగా రాష్ట్రంలో ఆర్గానిక్ వ్యవసాయాన్ని ప్రోత్స హించేందుకు త్వరలో కొత్త యాప్‌ను తెలంగాణ ప్రభుత్వం అందుబాటులోకి తీసుకురానుంది. త్వరలోనే వ్యవసాయశాఖ యాప్‌ను అధికారికంగా ప్రారంభించనుంది. ఈ యాప్ ద్వారా ఆర్గానిక్ ఫార్మింగ్ చేసే రైతులకు రాయితీలు కల్పించడంతోపాటు వారి ఉత్పత్తులకు ఆదాయం పెరిగేలా చేయనున్నారు. ఆర్గానిక్ ఉత్పత్తులను మార్కెటింగ్ చేయడం గురించి మెళకువలను తెలియజేస్తారు. అలాగే ఆర్గానిక్ వ్యవసాయానికి సంబంధించి రైతుల వివరాలన్నీ యాప్‌లో అందుబాటులో ఉండనున్నాయి. ఏ రైతు ఎంత పంట పడిస్తున్నాడు, ఏ పంట పండిస్తున్నాడు, ఎక్కడ సాగు చేస్తున్నాడు, ఉత్పత్తులు ఎప్పటిలోగా అందుబాటులోకి వస్తాయి తదితర వివరాలు కొత్తగా అందుబాటులోకి రానున్న ఆర్గానిక్ ఫామింగ్ యాప్‌లో ఉండనున్నాయి. రైతుల అడ్రస్, మొబైల్ నెంబర్లు, ఫొటోలు, వీడియోలు కూడా యాప్‌లో అందుబాటులో ఉంటాయి. దీంతో యాప్ సహాయంతో ఆర్గానిక్ ఉత్పత్తులను కొనుగోలు చేయాలనుకునే వినియోగదారులు నేరుగా రైతులను సంప్రదించవచ్చు. రాష్ట్రంలో ఉత్పత్తి అయ్యే ఆర్గానిక్ ఉత్పత్తులకు సంబంధించిన వివరాలన్నీ యాప్‌లో ప్రజలకు అందుబాటులో ఉంటాయి. అదే సమయంలో నకిలీ ఉత్పత్తులను అడ్డుకోవడానికి ఆర్గానిక్ ప్రొడక్ట్స్‌కు లేబులింగ్ సిస్టమ్‌ను ప్రభుత్వం ప్రవేశపెట్టనుంది. ఈ లేబుల్ విధానం ద్వారా ఖచ్చితమైన ఆర్గానిక్ ఉత్పత్తులను ప్రజలు కొనుగోలు చేయవచ్చు. ఇక ఆర్గానిక్ ఉత్పత్తుల లేబుల్ కోసం రైతులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. తెలంగాణ రాష్ట్ర విత్తన, సేంద్రియ ధ్రువీకరణ ప్రాధికార సంస్థ దగ్గర దరఖాస్తు చేసుకోవాలి.

# కొత్తగూడెం కార్పొరేషన్ మేయర్ ఎన్నికకు సహకరించిన కాంగ్రెస్‌కు ధన్యవాదాలు

## సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకటరెడ్డి

**హైదరాబాద్, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త:** ఈ నెల 11న జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో కొత్తగూడెం కార్పొరేషన్ ఎన్నికల్లో ఎక్కువ కార్పొరేటర్ స్థానాలను భారత కమ్యూనిస్టు పార్టీ(సీపీఐ) గెలుచుకున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో కార్పొరేషన్ మేయర్ ఎన్నికకు సహకరించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి. కాంగ్రెస్ రాష్ట్ర ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, పిసిసి అధ్యక్షులు మహేశ్ కుమార్ గౌడ్, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదులు తెలియజేస్తున్నట్లు సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకటరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలి పారు. కొత్తగూడెం నియోజకవర్గం శాసనసభ్యులుగా ఉన్న పార్టీ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు కృషి మూలంగా కొత్తగూడెం కార్పొరేషన్‌లో అత్యధిక కార్పోరేటర్స్ గెలిపించుకొని, మేయర్ స్థానాన్ని సాధించామన్నారు. ఈ గెలుపుకు సహకరించిన ప్రతిఒక్కరికి వెంకట్‌రెడ్డి ధన్యవాదులు తెలియజేశారు. రాష్ట్ర వ్యాపితంగా సిపిఐ నుండి గెలుపొందిన మున్సిపల్ వార్డ్ మెంబర్స్‌కు, కార్పొరేటర్స్‌కు ప్రత్యేకించి కొత్తగూడెం కార్పోరేషన్‌లో గెలిచిన కార్పోరేటర్లకు అభినందనలు తెలిపారు. 2023లో జరిగిన ఎమ్మెల్యే ఎన్నికల నుంచి మిత్ర పక్షంగా కొనసాగుతున్నా కాంగ్రెస్ కొత్తగూడెంలో విడివిడిగా పోటీ చేసినా మిత్రధర్మంతో మేయర్ ఎన్నికకు కాంగ్రెస్ నాయకత్వం తోడ్పాటును అందించారని అందుకు ధన్యావాదాలు తెలుపుతున్నట్లు పల్లా వెంకట్‌రెడ్డి ప్రకటనలో తెలిపారు.

# నిషేధిత హెచ్‌టీ కాటన్, గ్లైఫోసేట్‌లను వాడొద్దు

## అన్నదాతలకు రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి వినతి

**హైరాబాద్, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త:** దేశంలో నిషేదిత బీగి కాటన్ విత్తనం, గ్లై ఫోసేట్ రసాయనాలు ఎట్లా మార్కెట్లోకి వస్తున్నాయని రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. అమాయక రైతులను మోసం చేసి విత్తన కంపెనీలు, డీలర్లు అమ్ముతున్న విషయం కమిషన్ దృష్టికి వచ్చినట్లు వ్యవసాయ అధికారులకు తెలిపారు. ఈ విషయమై బీఆర్‌కే భవన్‌లోని రైతు కమిషన్ కార్యాలయంలో వ్యవసాయ అధికారులతో కమిషన్ సోమవారం ప్రత్యేక సమీక్షా సమావేశాన్ని నిర్వహించింది. ఈ సమావేశంలో కమిషన్ సభ్యులు గోపాల్‌రెడ్డి, కెవిఎన్‌రెడ్డి, భవానీరెడ్డి, భూమి సునీల్, కమిషన్ మెంబర్ సెక్రెటరీ గోపాల్, వ్యవసాయ అధికారులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కోదండరెడ్డి మాట్లాడుతూ... గ్లైఫోసేట్ గడ్డి మందు చల్లడం వల్ల పంట పొలాలు దెబ్బతింటాయని, లేని పోనీ రోగాలు వస్తాయన్నారు. కుటుంబ కలహాలతో కొందరు రైతులు ఆవేశంలో గ్లైఫోసేట్ గడ్డిమందు తాగి చనిపోయిన సందర్భాలు కూడా ఉన్నాయని గుర్తు చేశారు. దేశంలో వీటిపై నిషేధం విధించినా ఏవిధంగా మార్కెట్లోకి వస్తున్నాయని అధికారులను ప్రశ్నించారు. అయితే హెచ్‌టీ కాటన్, గ్లైఫోసేట్ పురుగు మందు మహారాష్ట్ర నుండి తెలంగాణకు వస్తున్నట్లు అధికారులు కమిషన్ దృష్టికి తెచ్చారు. నారాయణపేట జిల్లాలో అక్రమంగా తరలిస్తున్న హెచ్‌టీ కాటన్ విత్తనాలు 96 క్వింటాళ్లు ఈమధ్య తనిఖీల్లో దొరికిన విషయాన్ని కూడా వివరించారు. కేసులు పెట్టిన కూడా మార్పు రావడం లేదని చెప్పడంతో కమిషన్ ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకుంది. నిషేదిత హెచ్‌టీ కాటన్, గ్లైఫోసేట్ వల్ల పర్యావరణం కూడా దెబ్బతింటుందని, పర్యావరణ పరిరక్షణ చట్టాలను కూడా వినియోగించాలని సూచించింది. సీజన్‌కు ముందు రైతులకు సమావేశాలు నిర్వహించి అవగాహన కల్పించాలని అధికారులకు కమిషన్ స్పష్టం చేసింది.

# దేవాదాయ భూముల్లో పర్యాటకులకు వసతులు!

## టూరిజం శాఖ సరికొత్త ప్రతిపాదన

## త్వరలో పర్యాటక, దేవాదాయ శాఖ మధ్య కుదరనున్న ఒప్పందం

**హైదరాబాద్, ఫిబ్రవరి 13, ప్రభాతవార్త:** తెలంగాణలో పర్యాటకరంగ అభివృద్ధిపై టూరిజంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించింది. పర్యాటకులకు అనువైన ప్రదేశాలను అభివృద్ధి చేసేందుకు ముమ్మర కసరత్తు చేస్తోంది. అందులో భాగంగా రహదారులకు, ముఖ్య పట్టణాల్లో, ఆలయాలకు సమీపంలో ఉన్న దేవాదాయ శాఖ భూములను పర్యాటకులకు అనువైనవిధంగా అభివృద్ధి చేస్తే ఆదాయం వస్తుందని ప్రభుత్వం భావిస్తోంది. ఆలయ భూములు ఇస్తే కాటేజీలు, రిసార్ట్ ల నిర్మాణం చేపడతామని దేవాదాయశాఖకు టూరిజంశాఖ ప్రతిపాదిస్తోంది. దేవాదాయశాఖ సైతం తన పరిధిలోని భూములను అభివద్ధి చేసేందుకు పర్యాటకశాఖకు ఇచ్చేందుకు సుముఖంగా ఉన్నట్టు సమాచారం. ఈ నేపథ్యంలోనే త్వరలోనే ఈ రెండు శాఖల మధ్య ఎంఒయూ జరగనున్నట్లు తెలిసింది. తెలంగాణలో అలయాలకు 87235.39 ఎకరాలను కేటాయించినట్లు అధికారిక లెక్కలు ఉన్నాయి. అధికారుల పర్యవేక్షణ భూములపై కొరవడటంతో ఆ భూములు ఆక్రమణకు గురవుతున్నాయి. ఇప్పటికే వేలాది ఎకరాల భూములు క్రమణకు గురయ్యాయి. లిటిగేషన్‌లో మరో 5569 35 ఎకరాలు కబ్జాకు గురైనట్లు అధికారులు పేర్కొంటున్నారు. అయితే ఆ భూముల సంరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. మరోపక్క కబ్జాకు గురైన భూములను తిరిగి స్వాధీనం చేసుకోవడంపైనా దృష్టి సారించింది. కొన్ని ఆలయాలకు చెందిన భూములను లీజులకు ఇవ్వగా కొన్ని భూములు నిరూపయోగంగా ఉన్నట్లు సమాచారం ఆ భూములను పర్యాటక కేంద్రాలు తీర్చిదిద్దేందుకు టూరిజం శాఖ ముందుకు వచ్చింది. ఈ భూములను తమకు అప్పగిస్తే అక్కడ అత్యాధునిక సౌకర్యాలతో కూడిన పర్యాటక కేంద్రాలను అభివృద్ధి చేస్తామంటూ టూరిజంశాఖ ప్రతిపాదన చేసింది.

యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహస్వామి అలయానికి నిత్యం వేలాది మంది భక్తులు వస్తున్నారు. భక్తులకు సరిపడా వసతి సౌకర్యాలు లేకపోవడంతో కొంత ఇబ్బందులకు గురవుతున్న సందర్భాలు అనేకం చోటుచేసు కుంటున్నాయి. వాటిని దృష్టిలో ఉంచుకొని టూరిజం శాఖ గుట్టను పైలట్ ప్రాజెక్టుగా ఎంచుకుంది. కొండకింద ఆలయ భూములు ఉండటంతో ఆ భూములు లీజుకు ఇస్తే కాటేజీలు, వెల్నెస్ సెంటర్లు, బడ్జెట్ హోటళ్లు నిర్మించేలా ప్లాన్ రూపొందించింది. ఆధ్యాత్మిక పర్యాటకంతో పాటు వీకెండ్ స్పాట్గా దీన్ని తీర్చిదిద్దాలని భావిస్తున్నది. ఇది విజయవంతం అయితే రాష్ట్రంలోని ప్రముఖ ఆలయాలు అయిన వేములవాడ, భద్రాచలం, బాసర, ఇతర ప్రముఖ ఆలయాల భూముల్లోనూ ఇదే తరహా అభివృద్ధిని చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు.

# ప్రకృతి వ్యవసాయానికి ప్రత్యేక అధికారులు

**హైరాబాద్, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త:** రాష్ట్రంలో అమలవుతోన్న జాతీయ ప్రకృతి వ్యవసాయ పథకానికి ప్రత్యేక అధికారులు రాబోతున్నారు. కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వ భాగస్వామ్యంతో అమలవుతున్న ఈ జాతీయ ప్రకృతి వ్యవసాయ పథకాన్ని తెలంగాణలో పకడ్బందీగా అమలు చేసేందుకు ప్రత్యేక అధికారులను నియమించాలని వ్యవసాయ శాఖ నిర్ణయించింది. ఈ మేరకు దీనికి సంబంధించి సోమవారం వ్యవసాయ శాఖ డైరెక్టర్ డాక్టర్ గోపి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రాజెక్టు ఆఫీసర్, అసిస్టెంట్ ప్రాజెక్టు ఆఫీసర్లు పదవులను ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో నియమించనున్నట్లు పేర్కొన్నారు. అర్హత గల అభ్యర్థులు ఔట్ సోర్సింగ్ ఏజెన్సీల ద్వారా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. దీనికి సంబంధించిన అర్హతలు, జీతభత్యాలు, ఇతర నియమ, నిబంధనల వివరాల కోసం వ్యవసాయ శాఖ డైరెక్టర్ కార్యాలయంలో సంప్రదించాలని తెలిపారు.

# ఎస్సీ గురుకులాల్లో కేర్‌టేకర్స్

## సాంఘిక సంక్షేమంలో కమాండ్ కంట్రోల్ సెంటర్

**హైదరాబాద్, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త:** సాంఘిక సంక్షేమ గురుకులాల్లో చదువు తున్న విద్యార్థులపై గురుకుల విద్యాలయాల సంస్థ దృష్టి సారించింది. ఇందులో భాగంగా హైదరాబాద్‌లోని సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ప్రధాన కార్యాలయంలో హెల్త్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను ఉన్నతాధికారులు ఏర్పాటు చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎస్సీ గురుకుల సొసైటీ పరిధిలో మొత్తం 264 స్కూళ్లు, ఇంటర్, డిగ్రీ కాలేజీలు ఉన్నాయి. ఇందులో సుమారు లక్షన్నర మంది విద్యార్థులు చదువుతున్నారు. ఈ సంక్షేమ గురు కులాల్లో ఫుడ్ పాయి జన్, పాము, తేలుకాటు తదితర సంఘటనలు నిత్యం జరుగుతున్నాయి. ఇలాంటి ప్రమాదాలను తగ్గించాలని ప్రభుత్వం ఆదేశించడంతో సొసైటీ పరిధిలో హెల్త్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు.

ఈ కమాండ్ కంట్రోల్ జాయింట్ సెక్రటరీ ఆధ్వర్యంలో నిర్వహణ జరుగుతుం డగా, ఇందు లో అడిషనల్ సెక్రటరీ, ఇద్దరు డాక్టర్లు, ఇద్దరు హెల్త్ సూపర్ వైజర్లు, ఇద్దరు జూనియర్ అసిస్టెంట్లు పనిచేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని గురుకుల స్కూళ్లు, ఇంటర్, డిగ్రీ కాలేజీల్లో చదువుతున్న స్టూడెంట్స్‌లో ఎవరు సిక్ అయ్యారన్న వివరాలను అక్కడ పనిచేస్తున్న హెల్త్ సూపర్ వైజర్ నుంచి తీసుకొని రోజూ ఉదయం 6 గంటల వరకు పోర్టల్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. పోర్టల్ లో స్కూల్ నేమ్ క్లిక్ చేయగానే స్టూడెంట్ వివరాలు, రోగం, ట్రీట్ మెంట్ వివరాలు అప్ డేట్ చేస్తున్నారు. పోర్టల్ లో జిల్లా, స్కూల్ లేదా కాలేజ్ పేరు, కోడ్, ఏ స్టూడెంట్ సిక్ అయ్యారు, కారణం ఏంటి, ఏ మం దులు ఇచ్చారు, ప్రస్తుత పరిస్థితి ఏమిటి, సీరియస్‌గా ఉంటే జిల్లా లేదా హైదరాబాద్ కు తరలించడం వంటి సలహాలను ఉన్నతాధికారుల సలహాలతో కమాండ్ కంట్రోల్ సెంటర్ నిర్వాహకులు స్కూల్ హెల్త్ సూపర్ వైజర్లకు తెలపుతున్నారు. పాము, తేలుకాటుకు స్టూడెంట్ గురైతే వెంటనే యాంటీవీనమ్ వ్యాక్సిన్‌ను హెల్త్ సూపర్‌వైజర్లు అందించి పీహెచ్ సీ లేదా జిల్లా హాస్పిటల్ కు రిఫర్ చేస్తున్నారు. వీటితో పాటు జ్వరం, వీక్‌నెస్, సీజనల్ వ్యాధులు, అంటువ్యాధులు రాకుండా ఎప్పటికపుడు గురుకులాల సూపర్ వైజర్లకు పలు సలహాలు సూచనలు ఇస్తున్నారు.

# రెవెన్యూ శాఖలో కంప్యూటర్ ఆపరేటర్ల సేవలు కీలకం

## మంత్రి పొంగులేటికి ట్రెసా వినతి

**హైదరాబాద్, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త:** రెవెన్యూశాఖలో పనిచేస్తున్న టైపిస్ట్-కంప్యూటర్ ఆపరేటర్ల సేవలను నిలిపివేయాలన్న ప్రభుత్వ ఆదేశాలతో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 632 మంది టైపిస్ట్ కమ్ కంప్యూటర్ ఆపరేటర్లు, వారి కుటుంబాలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నాయని రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయీస్ సర్వీసెస్ అసోసియేషన్ (ట్రెసా) అధ్యక్షుడు వంగ రవీందర్‌రెడ్డి విన్నవించారు.

ప్రస్తుతం రెవెన్యూ శాఖలో 473 జూనియర్ అసిస్టెంట్ పోస్టులు, 4,000 వరకు జీపీవో పోస్టులు ఖాళీగా ఉన్న నేపథ్యంలో ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలు, భూ పరిపాలన కార్యక్రమాల అమలులో కంప్యూటర్ ఆపరేటర్ల సేవలు ఎంతో అవసరమని వివరించారు. టైపిస్టుల సేవలు నిలిపివేయాలని గత వారం సీసీఎల్ఏ కార్యాలయం నుంచి మెమో జారీ అయిందన్నారు. ఈ మేరకు సోమవారం మంత్రి పొంగులేటిని సచివాలయంలో ట్రెసా ప్రతినిధులు కలిశారు. కంప్యూటర్ ఆపరేటర్ల పనితీరుపై వచ్చిన విమర్శలు పూర్తిగా నిరాధారమైనవని, ఆపరేటర్లకు వివాదాలకు ఏ మాత్రం సంబంధం లేదని మంత్రి దృష్టికి తెచ్చారు. ఐకేపీ, పంచాయతీరాజ్‌శాఖల్లో వేలాది మంది కాంట్రాక్ట్ సిబ్బందిని రెగ్యులరైజ్ చేశారని, అదేవిధంగా రెవెన్యూశాఖలోని కంప్యూటర్ ఆపరేటర్లకు కూడా తగిన న్యాయం చేయాలని కోరారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. టైపిస్ట్ కమ్ కంప్యూటర్ ఆపరేటర్లు ఎంతో కాలంగా రెవెన్యూ శాఖలో నిరంతరాయంగా సేవలు అందిస్తూ పరిపాలనలో కీలక పాత్ర పోషిస్తున్నారని మంత్రికి విన్నవించామన్నారు.

# విద్యుత్ బకాయి రూ.15 కోట్లు డిపాజిట్ చేయాలి

## గీతం వర్సిటీకి సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు

**హైదరాబాద్, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త:** విద్యుత్ బాకాయిల నిమిత్తం రూ.15 కోట్లు డిపాజిట్ చేయాలని గీతం యూనివర్సిటీకి సుప్రీం కోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు దీనికి సంబంధించి సోమవారం ఈ ఆదేశాలు ఇచ్చింది. నాలుగు వారల్లో ఈ మొత్తాన్ని డిపాజిట్ చేయాలని స్పష్టం చేసింది. విద్యుత్ బకాయిల కేసుకు సంబంధించి తెలంగాణ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులపై సుప్రీం ధర్మాసనం స్పందించింది. బకాయిలపై హైకోర్టు డివిజన్ బెంచ్ ఇచ్చిన ఆదేశాలపై గీతం యూనివర్సిటీ సుప్రీం కోర్టులో సవాల్ చేసింది. వీబీసీ, గీతం యూనివర్సిటీ ఒక్కటేనని దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ ధర్మాసనం ముందు వాదనలు వినిపించింది. వీబీసీ ఫెర్రో అలాయస్ కంపెనీ విద్యుత్ బకాయిలకు తమకు సంబంధం లేదని గీతం యూనివర్సిటీ వాదించింది. అయితే వీబీసీ సంస్థకు, గీతంకు ఉన్న సంబంధాన్ని హైకోర్టు సింగిల్ బెంచ్ నిర్ణయించాలని సుప్రీం ధర్మాసనం ఆదేశించింది. ఇరు పక్షల వాదనలు విన్ని సుప్రీంకోర్టు ఈ మేరకు రూ.15 కోట్లను డిపాజిట్ చేయాలని తేల్చిచెప్పింది. కాగా వీబీసీ సంస్థ నుండి భూములను కొనుగోలు చేసిన గీతం యూనివర్సిటీ రూ.118 కోట్లు బకాయిలు చెల్లించాలని లేని పక్షంలో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామని దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ నోటీసులు జారీ చేసింది. ఈ నోటీసులను గీతం యూనివర్సిటీ హైకోర్టులో సవాల్ చేసింది. దీనిపై విచారించిన హైకోర్టు డివిజన్ బెంచ్ రూ.54 కోట్లు చెల్లించాలని గీతం యూనివర్సిటీని ఆదేశించింది. దీనిపై సుప్రీంకోర్టును గీతం యూనివర్సిటీ ఆశ్రయించింది.

# సమస్యలను పరిష్కరించాలని గురుకుల పాఠశాల విద్యార్థినుల నిరసన

## కుమురంభీం చౌరస్తాలో ధర్నా

**తిర్యాని, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త:** కుమురంభీం జిల్లాలోని తిర్యాని మండలంలోని చింతపల్లి గురుకుల పాఠశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలంటూ సోమవారం గురుకుల పాఠశాల లోని విద్యార్థులు మండల కేంద్రంలోని స్థానిక కొమరం భీం చౌరస్తాలో నిరసన చేపట్టారు. పాఠశాలలో నెలకొన్న ప్రధాన సమస్య అయిన నీటి సమస్యతో పాటు పలు సమస్యలను పరిష్కరించాలని విద్యార్థినీలు పాఠశాల నుండి ఖాళీ బాకెట్లతో ర్యాలీగా బయలుదేరి కొముర౦ భీం చౌరస్తాలో ధర్నా నిర్వహించి నిరసన తెలియ జేశారు. కాగా వీరికి గిరిజన సంఘాల నాయకులు గుణవంత్, భగవంతురావు, మాజీ జెడ్పిటిసిలు మాత్రం చంద్రశేఖర్, కమల, మాజీ పిఎసిఎస్ చైర్మన్ చుంచు శ్రీనివాస్ గిరిజన నాయకులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు విద్యార్థుల ధర్నాకు మద్దతు ప్రకటించారు. సుమారు నాలుగు గంటల పాటు ఎండలో కూర్చొని నినాదాలు ధర్నా నిర్వహించారు. దీంతో ఎండ వేడిమికి తట్టుకోలేక ముగ్గురు విద్యార్థులు స్పృహ తప్పిపోవడంతో 108 వాహనంలో తిర్యాని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వెంటనే స్పందించిన ఆర్‌సిఓ సమస్యను పరిష్కరించాలని ఆసిఫాబాద్ డిసిఓ రమ్యకృష్ణ విద్యార్థుల దగ్గరికి పంపించారు. తాహశీల్దార్ ఆర్ శ్రీనివాస్, ఎంపీడీవో మల్లేష్‌లతో కలిసి డిసిఓ రమ్యకృష్ణ విద్యార్థులతో, గిరిజన సంఘాల నాయకులతో మాట్లాడిన ఆమే ,ఆర్‌సిఓ వస్తున్నారని సమస్యల పరిష్కారం చేసేంతవరకు ఇక్కడనే ఉంటారని హామీ ఇవ్వడంతో విద్యార్థులు ఆందోళన విరమింపజేసి పాఠశాలకు వెళ్లారు. పాఠశాలకు విచ్చేసి విద్యార్థులతో మాట్లాడారు నీటి సమస్యతోపాటు పాఠశాలలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో విద్యార్థులు ఆందోళన విరమింప చేశారు. త్వరితగతిన సమస్యలు పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్‌బి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు కృష్ణ, నరేష్, గిరిజన సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.


కుమురం భీం చౌరస్తాలో ధర్నా చేస్తున్న విద్యార్థినులు

# అమెరికాతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం దేశానికి ప్రమాదకరం

## చమురు కొనుగోళ్లను ట్రంప్ నిర్ణయిస్తే ప్రధాని ఎందుకు?

## మోడీ నిరంకుశ విధానాలకు నిరసనగా మార్చి 24న ఢిల్లీలో ధర్నా

## సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి ఎంఎ బేబీ

## ప్రజలకిచ్చిన హామీలను నెరవేర్చాలి: రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

**హైదరాబాద్, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త:** అమెరికాతో ప్రధాని నరేంద్ర మోడీ సర్కా రు చేసుకున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం దేశ సమగ్రతకే ప్రమాదమని భారత కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్టు(సిపిఐఎం) జాతీయ ప్రధాన కార్యదర్శి ఎంఏ బేబీ హెచ్చరించారు. దాని ప్రభావం కేవలం వ్యవసాయ రంగానికే పరిమితం కాకుం డా అన్ని రంగాలపైనా, జీడీపీపైనా పడే ప్రమాద ముందన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తీసుకొస్తున్న ప్రజా, కార్మిక, రైతు వ్యతిరేక చట్టాలను నిరసిస్తూ ఢిల్లీలోని రాంలీలా మైదాన్‌లో మార్చి 24న ధర్నా చేయనున్నట్టు తెలిపారు. సోమవారం హైదరాబాద్‌లోని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యాలయంలో ఆ పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు బీవీ.రాఘవులు, తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. ఇండియా ఏ దేశం నుంచి చమురును దిగుమతి చేసుకోవాలనే విషయాన్ని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ నిర్ణయించడమేంటని? అలాగైతే ప్రధాని మోడీ, చమురు శాఖ మంత్రి ఎందుకని ప్రశ్నించారు. నరేగా పేరును వీబీజీఆర్ ఏ ఎమ్‌జీగా మార్చడం, వంద రోజుల పనిని 125 రోజులకు పెంచుతామని మోడీ సర్కారు ప్రచారం చేయడం పెద్ద చీటింగ్ అన్నారు. అన్ని పనిదినాలు కల్పించాలంటే మూడు లక్షల కోట్ల రూపాయలకుపైగా అవసరం అవుతాయని, కానీ బడ్జెట్‌లో అంతంత మాత్రమే నిధులు కేటాయించడం దారుణమన్నారు. ఆ చట్టానికి అవసరమయ్యే నిధుల్లో 40 శాతం రాష్ట్రాలే భరించాలని చెప్పడం దారుణమన్నారు. విద్యుత్ సవరణ చట్టంతో వ్యవసాయ రంగానికి, పేద వినియోగదారులకు, ఆస్పత్రులకు, విద్యాలయాలకు సబ్సిడీ విద్యుత్ సౌకర్యం పోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. యూనివర్సిటీల బిల్లు సైతం ప్రమాదకరమన్నారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలకు, లేబర్ కోడ్‌లను వ్యతిరేకిస్తూ ఈ నెల 12న జరిగిన దేశవ్యాప్త సమ్మెలో 25 కోట్ల నుంచి 30 కోట్ల మంది పాల్గొన్నారని బేబీ గుర్తుచేశారు. లేబర్ కోడ్‌లను అమలు చేయబోమని కేరళలోని పినరయ్ విజయన్ నేతృత్వంలోని వామపక్ష ప్రభుత్వం ప్రకటించిందన్నారు. ఓవైపు బీజేపీ ప్రభుత్వ విధానాలపై పోరాటం చేస్తున్నామని చెబుతూనే కర్నాటకలోని కాంగ్రెస్ సర్కారు లేబర్ కోడ్ ల అమలు దిశగా చర్యలు మొదలుపెట్టిందనీ, తెలంగాణలోని కాంగ్రెస్ సర్కారు కూడా లేబర్ కోడ్‌ల నోటిఫికేషన్లు జారీ చేసిందని విమర్శించారు. ఈ రెండు రాష్ట్ర ప్రభుత్వాలు తమ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని ఎంఏ బేబీ డిమాండ్ చేశారు. సర్ పేరుతో ఈసీ బెంగాల్‌లో పెద్ద ఎత్తున ఓట్లను తొలగించడాన్ని బేబీ తప్పుబట్టారు. బీజేపీకి సీఈసీ జ్ఞానేశ్‌కుమార్ కొమ్ము కాస్తున్నారని విమర్శించారు. కేరళ స్థానిక ఎన్నికల్లో లెఫ్ట్ ఫ్రంట్‌కు సీట్లు తగ్గినప్పటికీ.. ఓటింగ్ శాతం పెరిగిందన్నారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో దీనికి భిన్నమైన పరిస్థితి ఉంటుందనీ, మళ్లీ లెఫ్ట్ ఫ్రంట్ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ నేత మణిశంకర్ అయ్యర్ ఓ సదస్సులో కేరళ కమ్యూనిస్టుల పాలనను కొనియాడారని గుర్తుచేశారు. పినరయి విజయన్ ప్రభుత్వంలో మత విద్వేషాలకు అవకాశం లేని శాంతియుత వాతావరణంలో కేరళ ప్రజలు నివసిస్తున్నారని ఒక ఇంట ర్నేషనల్ సెమినార్‌లో అమర్త్యసేన్ చెప్పిన విషయాన్ని ప్రస్తావించారు. పశ్చిమబెంగాల్ సీపీఐ(ఎం) వైపు యువత పెద్ద ఎత్తున వస్తున్నారనీ, అక్కడ తమ పార్టీ బలపడుతున్నదని తెలిపారు. రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ మాట్లాడుతూ... ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నెర వేర్చాలని డిమాండ్ చేశారు. బీసీలకు 42 శాతం రిజర్వే షన్లను అడ్డకుంటున్నదే బీజేపీ అని విమర్శించారు. తెలంగాణ ఇవ్వాల్సిన కేంద్ర నిధుల విషయంలోనూ వివక్ష చూపుతుందన్నారు. బీజేపీకి రాష్ట్రంలో 8 మంది ఎంపీలు, 8 మంది ఎమ్మెల్యేలు, ఇద్దరు కేంద్ర మంత్రు లు ఉన్నప్పటికీ మొన్న జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో ఆశించిన ఫలితాలు రాలేదన్నారు. రాష్ట్రంలో కమ్యూ నిస్టులు ఎక్కడ అని కిషన్‌రెడ్డి వ్యాఖ్యానించడాన్ని తప్ప బట్టారు. ఈ నెల 11న జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో తాము పోటీ చేసిన 13 చోట్ల గెలిచామనీ, భవిష్యత్తులో తమ పార్టీ బలపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.




## బెంగాల్‌లో ఏడుగురు ఎన్నికల అధికారులపై ఇసి వేటు!

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 16:** కేంద్ర ఎన్నికల సంఘం పశ్చిమబెంగాల్‌లోజరిగిన ఓటర్ల ప్రత్యేక రివిజన్‌కు సంబంధించి ఏడుగురు అధికారులను సస్పెండ్‌చేసింది. విధినిర్వహణలో అలసత్వం, నైతిక నిబంధనవాళి పాటించకపోవడం, అధికారాలను దుర్వినియోగంచేయడం వంటి వాటిపై వారిని సస్పెండ్‌చేసినట్లుప్రకటించింది. అసిస్టెంట్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులుగా వీరంతా ఎన్నికల సంఘానికి పనిచేస్తారు. వారంతా రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు. వారిని రాష్ట్ర ఎన్నికల సంఘం ఎన్నికల విధులకు డిప్యుటేషన్‌పై వేసే సర్ విధుల్లో వీరంతా పాల్గొనాలని ఆదేశించింది. ఈ అధికారులను సంషేర్‌గంజ్, ఫరక్కా, మైనాగురి, సూటి, పుర్బా, దేబ్రా అసెంబ్లీ నియోజకవర్గాల్లోపనిచేస్తారు. రాష్ట్రప్రధాన కార్యదర్శి నందిని చక్రవర్తి వెంటనే క్రమశిక్షణ చర్యలు చేపట్టాలని ఎన్నికల సంఘం ఆదేశించింది. సర్‌పై రాష్ట్ర ప్రభుత్వం, ఎన్నికల సంఘం తరచూ పరస్పర వాదనలతో వార్తల్లోకెక్కిన సంగతి తెలిసిందే.ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఎన్నికలసంఘం ఓటర్లను వేధిస్తోందని, ప్రజాస్వామ్య హక్కులకు ప్రమాదం ఏర్పడిందని, సర్‌పేరిట రివిజన్‌తో ఓటర్లను భయభ్రాంతులకు గురిచేస్తుందని ఆరోపించారు.

## సిఎం రేవంత్‌ను కలిసిన యాదగిరిగుట్ట ఆలయ ఇఒ భవానీశంకర్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఫిబ్రవరి16:** ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డిని యాదగిరిగుట్ట ఆలయ ఈవో భవాని శంకర్ సోమవారం సాయంత్రం మర్యాద పూర్వకంగా కలిశారు.

### జెఇఇ మెయిన్-2025 (సెషన్-1)లో

## నారాయణ రికార్డ్

### దేశవ్యాప్తంగా ముగ్గురు ఆ విద్యా సంస్థ విద్యార్థులకు 100 పర్సంటైల్




**హైదరాబాద్, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త:** సోమవారం విడుదలైన జెఈఈ మెయిన్-2026 తొలి విడత ఫలితాలను నేషనల్ టెస్టింగ్ ఏజెనీ (ఎన్‌టిఏ) వెల్లడించింది. యావత్ భారతదేశం నుండి మరి ఏ ఇతర విద్యా సంస్థ సాధించ నటువంటి అరుదైన ఘనతను నారాయణ తన పేరున లిఖించు కుంది. ముగ్గురు నారాయణ విద్యార్థులు 100 పర్సంటైల్ సాధించటంతో పాటు 5 రాష్ట్రాల్లో(తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర, గోవా) స్టేట్ టాపర్స్ నిలిచారు. వివన్ శరత్ మహేశ్వరి, మాధవ్ విరాడియా. నరేంద్రబాబు గారి మహిత్ ముగ్గురు 100 పర్సంటైల్ సాధించి దేశంలోనే టాపర్లుగా నిలిచారు. వారితో పాటు కర్ణాటకకు చెందిన విష్ణు సాయి తేజ 99.999 పర్సంటైల్తో, గోవాకు చెందిన తనయ్ అజిత్ ప్రభు 99.825 పర్సంటైల్తో ఆయా రాష్ట్రాల్లో అగ్రస్థానంలో నిలిచారని నారాయణ విద్యాసంస్థల డైరెక్టర్లు డాక్టర్ పి. సింధూర నారాయణ, పి. శరణ్ నారాయణ తెలిపారు. ఈ సందర్భంగా డైరెక్టర్ డాక్టర్ పి. సింధూర నారాయణ మాట్లాడుతూ.. జెఈఈ మెయిన్ పరీక్ష కొరకు నారాయణ అందిస్తున్న అనితరసాధ్యమైన శిక్షణ, రీసెర్చ్ ఓరియంటెడ్ ప్రోగ్రామ్లు, పటిష్ట ప్రణాళిక, స్టడీమెటీరియల్ మరియు నిబద్ధతతో కూడిన వారాంతపు పరీక్షల వల్లనే ఈ ఘనత సాధ్యమైం దన్నారు. నారాయణ అనుసరిస్తున్న పటిష్టమైన విద్యా విధానం, కాన్సెప్ట్ డెఫిని షన్ ఫార్ములా, టెక్నాలజీ ఆధారిత శిక్షణ విద్యార్థులను విజేతలుగా నిలుపు తున్నాయి. దిశ ప్రోగ్రామ్ ద్వారా విద్యార్థులకు మానసిక స్థైర్యాన్ని కల్పిస్తూ, ఒత్తిడి లేని చదువును అందిస్తున్నాం. ప్రతి విద్యార్థి లోపాలను విశ్లేషించి, వారికి వ్యక్తిగత మార్గదర్శకత్వం అందించడం వల్లే ఈ ఫలితాలు సాధ్యమయ్యాయని పేర్కొన్నారు.డైరెక్టర్ పి. శరణి నారాయణ మాట్లా డుతూ.. నారాయణ ఇన్‌హౌస్ లెర్నింగ్ యాప్ ఎన్‌లెర్న్ ద్వారా విద్యా ర్థులు తమ ప్రగతిని ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ మెరుగైన ఫలితాలు సాధిస్తున్నారు. నారాయణలో విద్యార్థుల కలలే మా కలలు. వారి లక్ష్య సాధనలో మేము నిరంతరం తోడుంటాం. టెక్నాలజీ, అనుభవజ్ఞులైన అధ్యా పకుల కలయికే నారాయణ విజయ రహస్యమన్నారు.ఈ అద్భుత విజయంపై నారాయణ విద్యాసంస్థల కోర్ మేనేజ్ మెంట్ కమిటీ మెంబర్ పి.రమాదేవి హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థుల కృషిని, తల్లిదండ్రుల సహకా రాన్ని, నారాయణ అధ్యాపక బృందం అంకితభావాన్ని కొనియాడారు.

## డబ్బు కోసం బిటెక్ విద్యార్థుల చోరీబాట

### హెచ్‌సియులో ల్యాప్‌టాప్‌లు చోరీ

### ఇద్దరు విద్యార్థులు, మరో వ్యక్తి అరెస్టు

**హైదరాబాద్ (గచ్చిబౌలి), ఫిబ్రవరి 16, ప్రభాతవార్త:** హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో సంచలనం స ృష్టించిన ల్యాప్‌టాప్‌ల చోరీ కేసులో నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. ఓ బయటి వ్యక్తితో కలిసి యూనివర్సిటీకి చెందిన ఇద్దరు విద్యార్థులు ఈ ల్యాప్‌టాప్‌లను చోరీ చేయగా, ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. దాదాపు 30 లక్షల విలువైన 60 ల్యాప్‌టాప్‌లను నిందితుల వద్ద నుంచి స్వాధీనం చేసుకున్నారు. గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు పోలీసుల కథనం ప్రకారం... గచ్చిబౌలిలోని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో బిటెక్ రెండవ సంవత్సరం చదువుతున్న సాయిచరణ్(19), అశ్విన్ రావు(19)లు టిఎన్‌జిఒ కాలనీలోని నెక్స్ట్‌జెన్ హాస్టల్‌లో ఉంటున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ప్రకాశం జిల్లా నుంచి వచ్చి గతంలో ఇదే హాస్టల్‌లో ఉండివెళ్లిన రేగుల చంద్రశేఖర్(30) వీరికి స్నేహితుడయ్యాడు. కాగా జల్సాలకు అలవాటు పడిన వీరికి అప్పులు కాగా, అప్పులు తీర్చేందుకు దొంగతనం చేయాలని పథకం వేశారు. హెచ్‌సియులోని సిఆర్ రావు ఇనిస్టిట్యూట్ ప్రాంగణంలో గల ఓ తరగతి గదిలో ఫిబ్రవరి 6వ తేదీన 60 కొత్త ల్యాప్‌టాప్‌లను తెచ్చి విద్యార్థులకు అందుబాటులో ఉంచారు. ఈ విషయం తెలుసుకున్న సాయిచరణ్, అశ్విన్‌రావులు చంద్రశేఖర్‌కు చెప్పారు. ముగ్గురు కలిసి సదరు ల్యాప్‌టాప్‌లను చోరీ చేసి బెంగళూరు తరలించి, అక్కడ విక్రయించి డబ్బు చేసుకోవాలని పథకం వేశారు. ఇందులో భాగంగా ఓ ట్రావెల్స్ నుంచి (టిఎస్15 ఎఫ్‌పి7697) టోయోటా గ్లాంజా ఎర్రరంగు కారును అద్దెకు తీసుకున్నారు. ఫిబ్రవరి 8వ తేదీన సదరు కారును వర్సిటీ లోపలికి తీసుకువచ్చి అర్ధరాత్రి సమయంలో సిఆర్ రావు ఇనిస్టిట్యూట్ కిటికీ గ్రిల్స్ తొలగించి తరగతి గదిలోకి ప్రవేశించారు. అనంతరం 60 ల్యాప్‌టాప్‌లను కారులోకి ఎక్కించి యూనివర్సిటీ ప్రధాన గేటు ద్వారా బయటకు వచ్చారు. అక్కడి నుంచి నేరుగా చంద్రశేఖర్ ప్రస్తుతం ఉంటున్న కూకట్‌పల్లిలోని సెవెన్‌హిల్స్ అపార్టుమెంటుకు వెళ్లి ల్యాప్‌టాప్‌లను ఓ బెలానో కారు (టిజి11 సి3963)లోకి మార్చి పార్కింగ్‌లోనే ఉంచారు. చోరీ కోసం ట్రావెల్స్ నుంచి తెచ్చిన గ్లాంజా కారును తిరిగి ఇచ్చేశారు. ల్యాప్‌టాప్‌లను బెంగళూరుకు తరలించి అక్కడ విక్రయించాలని ఆలోచించగా, అప్పటికే వర్సిటీ అధికారుల పిర్యాదుతో గచ్చిబౌలి పోలీసులు కేసు నమోదు చేసుకోవడం సంచలనంగా మారింది. దీంతో సదరు కారును పార్కింగ్‌లోనే ఉంచారు.

# సాధారణ కార్యకర్త మేయర్ కావడం కాంగ్రెస్ పార్టీలోనే సాధ్యం

### పిసిసి అధ్యక్షుడు ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్



**హైదరాబాద్, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త:** సాధారణ కార్యకర్త మేయర్ కావడం కాంగ్రెస్ పార్టీలోనే సాధ్యమని టిపిసిసి అధ్యక్షులు ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. సోమవారం నిజామాబాద్‌లో మీడియా సమావేశంలో మాట్లాడారు. ఉమ్మడి నిజామాబాద్ ఓటర్ మహాశయులు ఆదరించి గెలిపించారన్నారు. నిజామాబాద్ పట్టణ ప్రజలకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సారథ్యంలో నిజామాబాద్‌లో మెజార్టీ మున్సిపాలిటీలను కైవసం చేసుకున్నామని, 20 యేళ్ల తర్వాత నిజామాబాద్ మేయర్ సీటు గెలుచుకున్నామన్నారు. పండ్లు అమ్ముకునే స్థాయి నుంచి మేయర్‌గా ఎదిగిన ఉమారాణికి హృదయ పూర్వక అభినందనలు తెలిపారు. సాధారణ కార్యకర్త మేయర్ కావడం కాంగ్రెస్ పార్టీలోనే సాధ్యమని, రెండేళ్ల పాలనలో అభివృద్ధి, సంక్షేమ విషయంలో వచ్చిన ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నామన్నారు. కులం మతం పేరుతో రెచ్చగొట్టిన ప్రజలు అభివృద్ధికి పట్టం కట్టారని, ఇంజనీరింగ్ కళాశాల,వ్యవసాయ కళాశాల, 680 కోట్లతో రోడ్ల అభివృద్ధి చేశామన్నారు. కాంగ్రెస్ పార్టీ నుంచి మేయర్ అయితే జిల్లా మేటి నగరంగా మారుతుందని ప్రజలు ఆశీర్వదించారని, సెంటిమెంట్ రాజేసి ఉసిగొల్పడం వల్ల 7 సీట్ల వరకు స్వల్ప మెజార్టీతో కోల్పోవాల్సి వచ్చిందని, కార్పొరేషన్ ఎన్నికల్లో ఎంఐఎం మీద పోటీచేసి 5 సీట్లు గెలుచుకున్నామని, జిల్లా అభివృద్ధి కోసం ఎంఐఎం ఎంతో కలయిక అవసరమన్నారు. బిఆర్ఎస్ నుంచి గెలిచిన ఏకైక అభ్యర్థి కాంగ్రెస్‌కు మద్దతిచ్చారని తెలిపారు.

# కేంద్రం నుంచి వచ్చే నిధులపై కార్యాచరణ తయారుచేయండి

### రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు




**హైదరాబాద్, ఫిబ్రవరి 16 ప్రభాతవార్త:** కేంద్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన నిధులను రాబట్టుకు నేందుకు తగిన కార్యాచరణను రూపొందించు కోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామ కృష్ణారావు ఉన్నతాధికారులను ఆదేశించారు. సోమవారం సచివాలయంలో వివిధ విభాగాల కార్యదర్శులు, ముఖ్య కార్యదర్శులతో ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ప్రభుత్వ ప్రధాన మాట్లాడుతూ కేంద్ర ప్రాయోజిత పథకాల నుండి రాష్ట్రానికి రావాల్సిన బకాయిలు, నిధులు మార్చి నెలాఖరులోగా సమీకరించుకునేందుకు ప్రణాళిక బద్ధంగా పనిచేయాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వ ఎస్ఎన్ఎ నిధులు, 15వ ఆర్థిక సంఘం గ్రాంట్స్, ఇతర పథకాల క్రింద రాష్ట్రానికి రావాల్సిన నిధులపై ప్రత్యేక దృష్టి సారించి, దీనిపై ఢిల్లీలో ఒక ప్రత్యేక అధికారిని నియమించుకొని సమన్వయం చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మున్సిపల్, విద్య, వైద్యారోగ్య,గిరిజన సంక్షేమ శాఖల వారీగా కేంద్రం నుంచి సుమారు 15 వేల కోట్ల రూపాయిలు రావాల్సి ఉందని, వీటిని సమీకరించుకొని రాష్ట్రంలోని పెండింగ్ పనులకు ఖర్చు చేయాలని సూచించారు.

**100 రోజుల కార్యాచరణ ప్రణాళిక**

ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా మార్చి 2, 3 తేదీల నుండి జూన్ 2వ తేదీ వరకు వివిధ అభివృద్ధి పనులపై వివిధ డిపార్టుమెంట్ల వారీగా 100 రోజుల కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాలని సిఎస్ అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా గ్రామీణాభివృద్ధి, మున్సిపల్, హెల్త్, ఎడ్యుకేషన్ విభాగాలలో ఈ ప్రణాకను సమర్థవంతంగా అమలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. రాష్ట్రంలో ఇటీవల గ్రామపంచాయతీ, మున్సిపల్ ఎన్నికలు ముగిసినందున ఎన్నికైన వార్డుమెంబర్లు, సర్పంచులు, మున్సిపల్ కౌన్సలర్స్, కార్పొరేటర్స్ తదితర ప్రజాప్రతినిధులకు అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుపై అవగాహన కల్పించేందుకు బాధ్యతతో కూడిన విధులు నిర్వర్తించేందుకు ఈ వందరోజుల కార్యాచరణ ప్రణాళిక(100 డేస్ యాక్షన్ ప్లాన్) ఉపకరిస్తుందని సిఎస్ తెలిపారు. గ్రామాల్లో, పట్టణాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలు, రోడ్ల మరమ్మతులు, రానున్న వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని తాగునీటి ఎద్దడి లేకుండాకు తగు చర్యలు, ఇతర మౌలిక సదుపాయాల కల్పనకు ఈ యాక్షన్ ప్లాన్ రూపొందించాలని సూచించారు.

రానున్న కేబినెట్ సమావేశానికి సంబంధించిన ప్రతిపాదనలను మంగళవారంలోగా సమర్పించాలని సిఎస్ సూచించారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు వికాస్ రాజ్, సి.వి.ఆనంద్, ముఖ్యమంత్రి ముఖ్య కార్యదర్శి శేషాద్రి, ముఖ్య కార్యదర్శులు సందీప్ సుల్తానియా, అహ్మద్ నదీమ్, ఎన్. శ్రీధర్, యోగితారాణ, కార్యదర్శులు క్రిస్టినా చొంగ్తు, టికె శ్రీదేవి, స్టీఫెన్ రవీంద్ర, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# హంగ్ మున్సిపాలిటీలపై కెటిఆర్ ప్రత్యేక నజర్

### 8 మున్సిపాలిటీలకు ఇన్‌చార్జీలుగా వెళ్లిన సీనియర్ నేతలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఫిబ్రవరి 16:** మున్సిపల్ ఛైర్మన్, వైస్ ఛైర్మన్ ఎన్నికల ప్రక్రియలో అధికార కాంగ్రెస్ పార్టీ అరాచకాలు, కుట్రలు చేస్తుందని భావిస్తున్న బీఆర్ఎస్ అప్రమత్తమైంది. మంగళవారం మున్సిపల్ చైర్మన్ ఎన్నికలు జరగనున్న కీలకమైన హంగ్ మున్సిపాలిటీల కోసం వర్కింగ్ ప్రెసిడెంట్ కే.టి. రామారావు ప్రత్యేకంగా ఎన్నికల ఇన్‌ఛార్జిలను నియమించారు. ఈ మేరకు ఆయన ఆయా మున్సిపాలిటీల స్థానిక నాయకత్వం, నియోజకవర్గ ఎమ్మెల్యేలు, ఇన్‌ఛార్జిలతో స్వయంగా మాట్లాడి క్షేత్రస్థాయి పరిస్థితులను సమీక్షి ంచారు. స్థానికంగా కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అక్రమ కిడ్నాప్‌లు, బెదిరింపులు, పోలీసుల దుర్వినియోగం వంటి అంశాలను అడిగి తెలుసుకున్న కేటీఆర్, పార్టీ స్థానిక నాయకత్వానికి అండగా ఉంటుందన్నారు. కాంగ్రెస్ అరాచకాల నేపథ్యంలో స్థానిక నాయకత్వానికి అన్ని విధాలా అండగా నిలబడేందుకు, ఎన్నికల ప్రక్రియను సమర్థవంతంగా పర్యవేక్షి ంచేందుకు పార్టీ తరఫున సీనియర్ నాయకులను ప్రత్యేక ఇన్ ఛార్జిలుగా పంపుతున్నట్లు ప్రకటించారు. ఆయన ఆదేశాల మేరకు పార్టీ సీనియర్ నేతలు వెంటనే తమకు కేటాయించిన మున్సిపాలిటీలకు బయలుదేరి వెళ్లారు. మంగళవారం ఎన్నికలు జరగనున్న 8 మున్సిపాలిటీల్లో బీఆర్ఎస్ స్పష్టంగా ఛైర్మన్ పీఠాలను గెలుచుకునే అవకాశం ఉన్నందున, ఈ ఎన్నికలను పార్టీ అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్నది. ఆయా మున్సిపాలిటీలకు నియమించబడిన ఇన్‌ఛార్జిల వివరాలు: తొర్రూర్-ఎమ్మెల్సీ మధుసూదనాచారి, మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి, జనగామ-శాసన మండలి డిప్యూటీ ఛైర్మన్ బండ ప్రకాష్, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, క్యాతనపల్లి: ఎమ్మెల్యే కోవ లక్ష్మి, ఖానాపూర్: ఎమ్మెల్యే అనిల్ జాదవ్, ఇంద్రేశం: ఎమ్మెల్యే ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్సీ యాదవ రెడ్డి, కాగజ్‌నగర్: మాజీ మంత్రి జోగు రామన్న,జహీరాబాద్: ఎమ్మెల్యేలు చింతా ప్రభాకర్, సునితా లక్ష్మారెడ్డి ఇబ్రహీంపట్నం: ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు పర్యవేక్షించనున్నారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు జరిగితే ఈ ఎనిమిది మున్సిపాలిటీల్లో బీఆర్ఎస్ జెండా ఎగరడం ఖాయమని, కాంగ్రెస్ ఎన్ని కుతంత్రాలు చేసినా తమ అభ్యర్థుల విజయాన్ని అడ్డుకోలేరని బిఆర్ఎస్ పార్టీ ధీమా వ్యక్తం చేసింది.

## హైదరాబాద్‌లో నేడు, రేపు బయో ఏషియా అంతర్జాతీయ సదస్సు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఫిబ్రవరి16:** తెలంగాణ ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రతిష్ఠాత్మకమైన 23వ బయో ఏషియా 2026 అంతర్జాతీయ సదస్సును ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ప్రారంభించ నున్నారు. హైదరాబాద్ హైటెక్స్‌లో జరగబోయే బయోఏషియా2026 సదస్సు నేడు,రేపు రెండు రోజుల పాటు జరగనుంది.ఈ ప్రపంచ స్థాయి సదస్సు ప్రధానంగా 'టెక్‌బయో అన్‌లీష్డ్ ఏఐ, ఆటోమేషన్, జీవశాస్త్ర రంగంలో వస్తున్న విప్లవాత్మక పరిణామాల్లు ఇతివృత్తంగా నిర్వహిస్తున్నారు. టెక్‌బయో ఇన్నోవేషన్స్‌లో దేశం గ్లోబల్ హబ్‌గా మారుతున్న తరుణంలో, అధునాతన సాంకేతిక పరిజ్ఞాన వినియోగంతో లైఫ్ సైన్సెస్ రంగంలో భవిష్యత్తు ఆరోగ్య సంరక్షణ సంబంధించిన అంశాలపై ఈ సదస్సు చర్చించనుంది.లైఫ్ సైన్సెస్ రంగంలో ప్రపంచ ప్రఖ్యాత సంస్థలు ఏర్పాటు చేసే అంతర్జాతీయ ఎగ్జిబిషన్‌ను ముఖ్యమంత్రి ప్రారంభిస్తారు. అనంతరం బయోఏషియా సదస్సును ప్రారంభించి ప్రసంగిస్తారు. 2 రోజుల పాటు నిర్వహించే ఈ సదస్సులో జాతీయ, అంతర్జాతీయ నిపుణులు, శాస్త్రవేత్తలు, బయో సైన్సెస్ రంగంలో నిష్ణాతులు ఆయా అంశాలపై ప్రసంగించనున్నారు.




## జూపల్లి ఎన్నిక ఏకగ్రీవం

### ప్రశాంతంగా ప్రమాణస్వీకారం

### మిన్నంటిన అభిమానుల హర్షధ్వానాలు

**అశ్వారావుపేట/ప్రభాతవార్త:** జూపల్లి దంపతుల పదవీప్రమాణ స్వీకారం సోమవారం ఇక్కడి మున్సిపల్ కార్యాలయంలో అత్యంత ఆడంబరంగా పూర్తయింది. ఛైర్‌పర్సన్‌గా జూపల్లి శశికళ, వైస్ ఛైర్మెన్‌గా జూపల్లి రమేష్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ రెండు పదవులకూ పోటీ నామినేషన్ లేకపోవడంతో అబ్జర్వర్ వీరిద్దరి ఎంపికనీ వెంటనే ప్రకటించేశారు. వీరితోపాటే తత్తిమా 15మంది కాంగ్రెస్ కౌన్సిలర్లు, అలానే బిఆర్ఎస్ నుంచి ఎన్నికైన కొల్లి రవికిరణ్, భూక్యా ఉదయజ్యోతిలు, మరో ఇద్దరు ఇండిపెండెంట్లు కూడా ప్రమాణస్వీకారం చేశారు. ఈ వేడుకని చూసేందుకు నియోజకవర్గం నలుమూలలనుంచీ పెద్దఎత్తున అభిమానులు హాజరవ్వడంతో అశ్వారావుపేట కోలాహలంగా మారింది. శాసనసభ్యులు జారె ఆదినారాయణ విప్‌గా వ్యవహరించారు.

# జైపూర్ కెమికల్ ఫ్యాక్టరీలో అగ్నిప్రమాదం

### ఏడుగురు కార్మికులు మృతి

### మంటల్లో పది మంది చిక్కుకున్నట్లు అంచనా



**జైపూర్, ఫిబ్రవరి 16:** కెమికల్ ఫ్యాక్టరీలో భారీ అగ్నిప్రమాదం జరిగింది. ఈ సంఘటనలో ఏడుగురు కార్మికులు మరణించారు. సుమారు పది మంది కార్మికులు చిక్కకున్నట్లు అనుమా నిసు న్నారు. ఫైర్ సిబ్బంది, పోలీసులు అక్కడకు చేరు కుని సహాయక చర్యలు చేపట్టారు. రాజస్థాన్‌లోని భివాండిలో ఈ సంఘటన జరిగింది. సోమవారం ఉదయం 9.30 గంటల సమయంలో పారిశ్రామిక ప్రాంతంలోని ప్రైవేట్ రసాయన కర్మాగారంలో మంటలు చెలరేగి నిమిషాల్లోనే ఆ ఫ్యాక్టరీ మొత్తం మంటలు వ్యాపించాయి. ఆ సమయంలో సుమారు 25 మంది కార్మికులు ఫ్యాక్టరీ లో పని చేస్తున్నారు. మంటలను గమనించిన పలువురు కార్మికులు కెమికల్ ఫ్యాక్టరీ నుంచి బయటకు పరుగులు తీశారు. ఈ సమాచారం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు అక్కడకు చేరుకున్నారు. గంటన్నరపాటు శ్రమించి మంటలను ఆర్పివేశారు. ఈ అగ్నిప్రమాదంలో ఏడుగురు కార్మికులు మరణించినట్లు గుర్తించారు. మరో పదిమంది ఆచూకీ తెలియడం లేదు. ఆ ఫ్యాక్టరీలో లోపల వారు చిక్కుకున్నట్లు అనుమా నిస్తున్నారు. కెమికల్ ఫ్యాక్టరీలో అగ్నిప్రమాదంపై దర్యాప్తు జరుపుతున్నట్లు డీఎస్పీ, జిల్లా అధికారులు తెలిపారు. మంటలకు కారణాన్ని గుర్తించడానికి, భద్రతా ప్రోటోకాల్స్‌లో లోపాలపై దర్యాప్తు కోసం మెజిస్ట్రీరియల్ విచారణకు జిల్లా యంత్రాంగం ఆదేశించింది.

# క్రిప్టోకరెన్సీ పేరిట వ్యాపారికి రూ.21.04 లక్షల టోకరా

### ముగ్గురు నేరగాళ్ల అరెస్టు

**హైదరాబాద్, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త:** సైబర్ నేరగాళ్ల మోసాలు ఆగడం లేదు. పోలీసులు ఎన్ని చర్యలు తీసుకుంటున్నా, ఎన్ని ప్రజా చైతన్య కార్యక్రమాలు చేబట్టినా నేరగాళ్ల కార్యకలాపాలు సాగుతూనే వున్నాయి, హైదరాబాద్‌కు చెందిన ఓ వ్యాపారికి క్రిప్టో కరెన్సీ పేరిట ముగ్గురు సైబర్ నేర గాళ్లు 21 లక్షల రూపాయలకు పైగా కాజేశారు. ఈ ఘటనలో ఫిర్యాదు అందగానే రంగంలో దిగిన పోలీసులు కేసు నమోదు చేసి దీనికి కారణమైన ముగ్గురు నేరగాళ్లను అరెస్టు చేశారు. సైబర్ క్రైం డిసిపి అరవింద్ బాబు దీనికి సంబంధించిన వివరాలను సోమవారం మీడియాకు వెల్లడించారు.

నగరంలోని కల్యాణ్‌నగర్‌కు చెందిన ఓ వ్యాపారి (44)ను ఐదుగురు సైబర్ నేరగాళ్లు తెలివిగా క్రిప్టో కరెన్సీ పేరిట 21 లక్షల నాలుగు వేల 89 రూపాయలను రెండు నెలల క్రితం కాజేశారు. తమ వద్ద క్రిప్టో కరెన్సీ వుందని నమ్మించిన ముగ్గురు సదరు వ్యాపారి నుంచి పలు దఫాలుగా ఈ నగదు ను కాజేశారు. ఇందుకోసం ఓ వెబ్‌సైట్‌ను నేరగాళ్లు వాడారు. దీనిపై రంగంలో దిగిన సైబర్ క్రైం పోలీసులు విచారణ చేబట్టగా ఈ గోల్‌మాల్‌కు పాల్పడింది పూణెకి చెందిన సుశిం శ్రీపతి గైక్వాడ్, హైదరాబాద్‌కు చెందిన శ్రీకాంత్, జైపూర్‌కు చెందిన లక్కీ చౌదరితో పాటు మరో ఇద్దరు వున్నట్లు తేలింది. ఈ ముఠా దేశ వ్యాప్తంగా అనేక మంది వ్యాపారులను ఇదే విధంగా మోసం చేసినట్లు తేలింది. ఈ కేసులో సుశి శ్రీపతి గైక్వాడ్, శ్రీకాం త్, లక్కీ చౌదరిలను అరెస్టు చేయగా వారి వద్ద నుంచి నాలుగు సెల్‌పోన్లు, రెండు లాప్‌టాప్‌లను జప్తు చేశారు. నిందితులను రిమాండుకు తరలిం చారు. కాగా ఈ తరహా మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా వుండాలని డిసిపి కోరారు.

## జెఇఇ మెయిన్-2026 సెషన్-1 ఫలితాల్లో శ్రీచైతన్య ప్రభంజనం

### 100 పర్సంటైల్ సాధించి దేశంలో ఒక్కడిగా నిలిచిన పసల మోహిత్ శ్రీచైతన్య విద్యార్థి

**హైదరాబాద్, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త:** ఎన్‌టిఏ విడుదల చేసిన జెఈఈ మెయిన్- 2026 సెషన్ 1 ఫలితాల్లో శ్రీచైతన్య విద్యాసంస్థలు అద్భుత విజయాలను నమోదు చేశాయి. ప్రాథమిక సమాచారం ప్రకారం ఈ ఏడాది జెఈఈ మెయిన్ సెషన్1 ఫలితాల్లో శ్రీచైతన్య విద్యార్థులు మునుపెన్నడూ లేని విధంగా సంచలన రికార్డులు సృష్టించారు. శ్రీచైతన్య విద్యాసంస్థ విద్యార్థి పసల మోహిత్ జాతీయ స్థాయిలో అద్భుత ప్రతిభ కనబరిచాడు. 300/300 మార్కులతో 100 పర్సంటైల్ సాధించి ఇండియాలోనే ఒకే ఒక్కడిగా నిలిచాడు.

అలానే 290, 285, 280 మార్కులతో అత్యధిక సంఖ్యలో విద్యార్థులతో పాటు, సబ్జెక్టుల వారీగా అత్యుత్తమ పర్సంటైల్స్ సాధించి అత్యధిక 100 పర్సంటైల్ స్కోర్లు సాధించి, ఈ సంవత్సరం గణనీయంగా పెరిగి శ్రీచైతన్య తన ఆధిపత్యాన్ని మరోసారి నిరూపించు కుంది.

ఈ అద్భుత విజయంపై శ్రీచైతన్య విద్యాసంస్థల అకడమిక్ డైరెక్టర్ సుష్మ హర్షం వ్యక్తం చేస్తూ... ప్రస్తుత పర్సంటైల్‌లోనే కాకుండా, రాబోయే ర్యాంకుల్లో కూడా శ్రీచైతన్య విద్యార్థులు తమ ఆధిపత్యాన్ని కొనసాగిస్తారని నమ్మకం ఉందన్నారు.

విద్యార్థుల కఠోర శ్రమ, సంస్థ రూపొందించిన సాటిలేని అకడమిక్ ప్రోగ్రామ్స్, పక్కాగా రూపొందించిన షెడ్యూల్స్, అంతర్గత పరీక్షలు, ప్రత్యేక ర్యాంకింగ్ వ్యవస్థే వరుసగా నాలుగేళ్లుగా జెఈఈ మెయిన్‌లో 300 కి 300 మార్కులతో హండ్రెడ్ పర్సంటైల్స్ సాధించడానికి ప్రధాన కారణమన్నారు. మారు తున్న జనరేషన్‌ను, టెక్నాలజీని అనుసరిస్తూ శిక్షణలో తెచ్చిన విప్లవాత్మక మార్పులకు ఈ అద్భుత ఫలితాలే సాక్ష్యమన్నారు. అలాగే ఇన్ఫినిటీ లెర్న్ ఆన్‌లైన్ యాప్ దేశంలోని అత్యుత్తమ అధ్యాపక బృందం అందించిన శిక్షణతో విద్యార్థులను విజేతలుగా నిలబెట్టాయన్నారు.

## డబ్బుల కోసం వ్యాపారి కిడ్నాప్ కేసులో ఏడుగురు అరెస్టు

**హైదరాబాద్ (సరూర్‌నగర్), ఫిబ్రవరి 16, ప్రభాతవార్త:** డబ్బుల కోసం ఓ వ్యాపారిని కిడ్నాప్ చేసి హత్య చేయడానికి ప్రయత్నించిన 9 మంది నిందితుల్లో ఏడుగురిని బాలాపూర్ పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసుతో సంబంధం ఉన్న ఇద్దరు పరారీలో ఉన్నారు. నిందితుల నుండి కత్తులు, గొడ్డలితో పాటు ఆరు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. సోమవారం బాలాపూర్ పిఎస్‌లో ఇన్స్‌పెక్టర్ సుధాకర్‌తో కలిసి ఆదిభట్ల ఎసిపి ప్రదీప్‌కుమార్‌రెడ్డి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈ కేసుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. కాలాపత్తర్ ప్రాంతానికి చెందిన అమెజాన్, ప్లిఫ్ కార్ట్ సెకండ్ సేల్స్ వ్యాపారం చేసే సయ్యద్ మోహినుద్దీన్ వ్యాపారనిమిత్తం గోడౌన్ పరిశీలనకు ఈ నెల 10న తన వద్ద పని చేసే ముస్తఫాతో కలిసి అలీషాన్ హోటల్ సమీపానికి వచ్చారు. అదే సమయంలో కాలాపత్తర్ ప్రాంతానికే చెందిన అసద్, జహంగీర్‌లు మరో ముగ్గురు వ్యక్తులతో కలిసి బలవంతంగా మోహినుద్దీన్‌ను షాహిన్‌నగర్ సగాఫ్ కాలనీకి తీసుకెళ్ళారు. అక్కడ ఖుద్దూస్, ఇక్బాల్ అనే ఇద్దరు వచ్చి వారితో కలిసారు. ఈ మేరకు లక్ష రూపాయలు ఇవ్వాలని వారు వ్యాపారిని డిమాండ్ చేశారు. తన వద్ద డబ్బులు లేవని వ్యాపారి అనడంతో అసద్ కత్తితో దాడి చేశాడు. అతనితో పాటు మరికొందరు సైతం దాడి చేయగా మోయినుద్దీన్ గాయాలపాలయ్యాడు. దీంతో గాయాల బాధకు బిగ్గరగా కేకలు వేయడంతో నిందితులు పారిపోయారు. తర్వాత అక్కడి నుండి బాధితుడు ఓ ప్రైవేటు ఆసుపత్రికి చికిత్స కోసం వెళ్ళాడు. అనంతరం బాధితుడు బాలాపూర్ పిఎస్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ నేపథ్యంలో రంగంలో దిగిన పోలీసులు విచారణ జరిపి కిడ్నాప్, దోపిడీ యత్నం, హత్యాయత్నానికి పాల్పడిన మహ్మద్ అసద్ (32), మహ్మద్ జహంగీర్ (23), మహ్మద్ నవాజ్ (26), మహ్మద్ సయీద్ (19), మహ్మద్ అల్తాఫ్ (27), మహ్మద్ ఇక్బాల్ మోహినుద్దీన్ (42), ఖుద్దూస్ బిన్‌రవీ (30) లను అదుపులోకి తీసుకొని మారణాయుధాలు, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసుతో సంబంధం ఉన్న మహ్మద్ ఇమ్రాన్, సైఫ్ ఫైజల్ పరారీలో ఉన్నారు.

# నేడు భారత్‌కు ఫ్రాన్స్ అధ్యక్షుడు రాక




**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 16:** ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయెల్ మెక్రాన్ మంగళవారం భారత్ పర్యటనకొస్తున్నారు. 19 వరకు అంటే మూడు రోజులు మెక్రాన్ భారత్‌లో పర్యటించనున్నారు. మంగళవారం మధ్యాహ్నం 3.15గంటలకు ముంబైలోని లోక్ భవన్‌లో ప్రధానమంత్రి నరేంద్రమోడీతో సమావేశం కానున్నారు. ఈ సందర్భంగా మెక్రాన్-మోడీ ద్వైపాక్షిక చర్చలు జరుపనున్నారు. చర్చలలో భారత్- ఫ్రాన్స్ వ్యూహాత్మక భాగస్వామ్యంపైనే ప్రధానంగా దృష్టి సారించనున్నారు. వ్యూహాత్మక సంబంధాన్ని మరింత బలోపేతం చేయడం, అభివృద్ధి చెందుతున్న, భవిష్యత్తు ఆధారిత రంగాలలో పరస్పర సహకారాన్ని విస్తరించడంపై దృష్టి సారిస్తాయని భావిస్తున్నారు. ఇరు దేశాల నాయకులు ముఖ్యమైన ప్రాంతీయ, ప్రపంచ సమస్యలపై దృక్పథాలను కూడా మార్పిడి చేసుకుంటారని భారత విదేశాంగ శాఖ అధికారిక ప్రకటనలో తెలిపింది. సాయంత్రం 5.15 గంటలకు ప్రధానమంత్రి నరేంద్రమోడీ, ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయెల్ మెక్రాన్ సంయుక్త ప్రకటన చేయనున్నారు.

అనంతరం ఇరు దేశాల నుండి వ్యాపార, పారిశ్రామిక వేత్తలు, స్టార్టప్ వ్యవస్థాపకులు, ఆవిష్కర్తలతో సమావేశం కానున్నారు. ఆ తర్వాత ఢిల్లీలో జరుగుతున్న ఎఐ సమ్మిట్‌కు మోడీతో కలిసి మెక్రాన్ హాజరవుతారు.

ఈ సమ్మిట్‌కు బ్రెజిల్ అధ్యక్షుడు లూయిజ్ ఇనాసియో లులా డా సిల్వా, గ్రీకు ప్రధానమంత్రి కిరియాకోస్ మిత్సోటాకిస్ ఉన్నారు.

- ముంబైలో ప్రధాని మోడీతో ద్వైపాక్షిక చర్చలు
- రఫేల్ డీల్‌తోపాటు పలు కీలక ఒప్పందాలు
- ఎఐ సమ్మిట్‌కు మెక్రాన్ హాజరు

**ఎఐ సమ్మిట్‌కు 45 దేశాల ప్రతినిధులు**

భారత్ ఆతిథ్యమిస్తున్న ఎఐ ఇంపాక్ట్ సమ్మిట్‌లో పాల్గొనడానికి ప్రధాని మోడీ ఆహ్వానం మేరకు పలు దేశాల అధినేతలు, ప్రతినిధులు వస్తున్నారు. కృత్రిమ మేధస్సు రంగంలో అంతర్జాతీయ సహకారం కోసం భారత్ రోడ్ మ్యాప్ (మూడు 'సూత్రాలు: ప్రజలు, గ్రహం, పురోగతి')ను ఆవిష్కరించనుందని విదేశాంగ మంత్రిత్వ శాఖ పేర్కొంది. ఈ కార్యక్రమం ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రపంచ నాయకులు, విధాన నిర్ణేతలు, ఆవిష్కర్తలు, నిపుణులను ఒకచోట చేర్చి కృత్రిమ మేధస్సు భవిష్యత్తు దిశపై చర్చించడం లక్ష్యంగా పెట్టుకుంది. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ఆహ్వానం మేరకు, ఎఐ ఇంపాక్ట్ సమ్మిట్‌లో పాల్గొనే ఇతర ప్రముఖ నాయకులలో నెదర్లాండ్స్ ప్రధాన మంత్రి డిక్ స్కూఫ్, శ్రీలంక అధ్యక్షుడు అనుర కుమార దిస్సానాయక, భూటాన్ ప్రధాన మంత్రి షెరింగ్ టోబ్గే, మారిషస్ ప్రధాన మంత్రి నవీన్‌చంద్ర రామ్‌గూడం ఉన్నారు. ప్రముఖుల జాబితాలో స్పానిష్ అధ్యక్షుడు పెడ్రో సాంచెజ్ పెరెజ్‌కాస్టెజోన్, అబుదాబి క్రౌన్ ప్రిన్స్ షేక్ ఖలీద్ బిన్ మొహమ్మద్ బిన్ జాయెద్ అల్ నహ్యాన్, క్రొయేషియా ప్రధాన మంత్రి ఆండ్రేజ్ ప్లెన్కోవిక్, ఎస్టోనియన్ అధ్యక్షుడు అలార్ కరిస్, ఫిన్నిష్ ప్రధాన మంత్రి పెట్టేరి ఓర్పో, కజకిస్తాన్ ప్రధాన మంత్రి ఓల్జాస్ బెక్టెనోవ్, లీచ్టెన్‌స్టెయిన్ వంశపారంపర్య యువరాజు అలోయిస్, స్లోవేకియా అధ్యక్షుడు పీటర్ పెల్లెగ్రిని, స్విట్జర్లాండ్ అధ్యక్షుడు గై పర్మెలిన్ కూడా ఉన్నారు. బొలీవియా ఉపాధ్యక్షుడు ఎడ్మండ్ లారా మోంటానో, గయానా ఉపాధ్యక్షుడు భరత్ జగ్దియో, సెర్బియా ఉపాధ్యక్షుడు అలెగ్జాండర్ వుసిక్, సీషెల్స్ ఉపాధ్యక్షుడు సెబాస్టియన్ పిల్లే కూడా న్యూఢిల్లీ ఎఐ సమ్మిట్‌కు హాజరవుతారని విదేశాంగ శాఖ పేర్కొంది. ఎంఇఎ ప్రకారం, 45 కంటే ఎక్కువ దేశాల నుండి మంత్రివర్గ ప్రతినిధులు కూడా ఈ సమ్మిట్‌లో పాల్గొంటారు. ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి, అనేక అంతర్జాతీయ సంస్థల నుండి సీనియర్ ప్రతినిధులు చర్చలలో పాల్గొననున్నారు.

బీహార్ మహిళలకు

# మరో10 వేలు సాయం

## శివరాత్రి కానుక అందించిన సిఎం నితీష్‌కుమార్



**పాట్నా, ఫిబ్రవరి 16:** బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ మహిళలకు శివరాత్రి కానుకను అందించారు. రాష్ట్రంలోని అర్హత కలిగిన మహిళల ఖాతాల్లో రూ.10 వేల చొప్పున నేరుగా జమ చేశారు. తమ ఖాతాల్లో డబ్బు జమ కావడంతో మహిళలు ఖుషీగా ఉన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల ముందు కూడా ఇలాగే మహిళల ఖాతాల్లో రూ.10 వేలు జమ చేశారు. ఆ డబ్బు ప్రభావంతో మహిళలు పెద్ద ఎత్తున ఓటు వేసి బీజేపీజేడీయూ కూటమికి భారీ మద్దతు తెలిపారు. ఫలితంగా ఎన్డీయే కూటమి 202 స్థానాలు కైవసం చేసుంది. నితీశ్ మరోసారి సీఎం అయ్యారు. ఇప్పుడు శివరాత్రి పండుగ సమయంలో మళ్లీ ఖాతాల్లో రూ.10 వేలు జమ కావడంతో మహిళలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మహిళల సంక్షేమం విషయంలో నితీశ్ ఎప్పుడూ ముందుంటారని పార్టీ నాయకులు పేర్కొంటున్నారు. ముఖ్యమంత్రి మహిళా రోజ్‌గార్ యోజనా కింద మొత్తం 2500 కోట్ల రూపాయలను నేరుగా మహిళల ఖాతాల్లోకి జమచేసారు. అంతేకాకుండా లబ్దిదారులతో నితీష్ నేరుగా ముఖాముఖి జరిపారు. విడియోకాన్ఫరెన్సింగ్ ద్వారా జరిగిన ఈకార్యక్రమంలో స్వయం ఉపాధజపై ఆసక్తి ఉన్న మహిళలు చిన్న చిన్న వ్యాపారాలుచేసుకోవచ్చని తెలిపారు. సుమారు కోటి మంది లబ్దిదారులు పదివేల రూపాయలు అందుకున్నారని, వారంతా చిన్నవ్యాపారాలుచేసుకోవచ్చన్నారు. విజయవంతం అయిన మహిళలు మళ్లీ అదనపు సాయం అందుకోవచ్చని అలాంటివారికి రూ.2 లక్షలరూపాయలవరకూ అందుతుందన్నారు. బీహార్‌లోని అతిపెద్ద ఎస్‌హెచ్‌జి కార్యాచరణ జీవిక ఇపుడు 40 లక్షలమంది సభ్యులతో గ్రామీణప్రాంతాల్లో వర్ధిల్లుతోందన్నారు. అదే విజయం పట్టణప్రాంతాల్లోకూడా సాధించిందని 3.85 వేల జీవికా దీదీలు ఎస్‌హెచ్‌జి సభ్యులున్నారని నితీష్ అన్నారు. ఎన్డీయే ప్రభుత్వం జీవిక స్కీంను మరింత పటిష్టంచేసి మరింత విస్తృతంచేస్తుందన్నారు. గతనెల 26వ తేదీప్రధానిమోడీ ఈస్కీంను ప్రారంభించారు. ఆరోజునే పదివేల రూపాయలు ప్రతి ఒక్కరికి 75 లక్షలమంది మహిళలకు బదలీచేసారు. రాష్ట్రంలోని పదిలక్షలమందికిపైగా లబ్దిదారులు ఈ ముఖ్యమంత్రి మహిళా రోజ్‌గార్‌యోజనకు దరఖాస్తుచేసారు.



## అజిత్‌పవార్ విమాన ప్రమాదం కేసు బ్లాక్‌బాక్స్ డీకోడింగ్ షురూ!

**బారామతి, ఫిబ్రవరి 16:** దివంగత డిప్యూటిసీఎం అజిత్‌పవార్‌ప్రయాణించిన విమానం బ్లాక్‌బాక్స్‌ను దర్యాప్తు సంస్థ ఎఎఐబి అధికారులు స్వాధీనంచేసుకున్నారు. బ్లాక్ బాక్స్ ఇప్పటికే ఢిల్లీచేసింది. ఎఎఐబి ప్రయోగశాలలో డీకోడ్‌చేసినట్లు దర్యాప్తు అధికారులు తెలిపారు. బ్లాక్‌బాక్స్‌లో విమానం కీలక సంకేతాలు, కాక్‌పిట్ చర్చలు అన్నీ కొనసాగుతాయని దర్యాప్తులో తేల్చారు. విమానప్రమాదాల్లో కూడా దర్యాప్తు కొలిక్కిరావాలంటే బ్లాక్‌బాక్స్ కీలకంగా మారుతుంది. మహారాష్ట్ర డిప్యూటి సీఎంగా ఉన్న అజిత్‌పవార్‌సహా ఐదుగురు ఈప్రమాదంలో చనిపోయిన సంగతి తెలిసిందే. ఇద్దరు కాక్‌పిట్‌క్రూసభ్యులు కూడా ఉన్నారు. పైలట్ ఇన్ కమాండ్ సుమిత్‌కపూర్, ఫస్ట్ ఆఫీసర్ శాంభవి పాథక్‌లు క్యాబిన్‌క్రూ పింకీ మాలిలు కూడా ఈ ప్రమాదంలో చనిపోయారు. ఈప్రమాదంపై ఎఎఐబి దర్యాప్తు అధికారులు, ఢిల్లీనుంచి డిజిసిఎనుంచి మరో ముగ్గురు అధికారులు ప్రమాదస్థలానికి వెళ్లి ప్రాథమిక వివరాలుసేకరించారు. ఈ విమానం విటిఎస్‌ఎస్‌కె పేరిట రిజిస్టరు కావడం ఢిల్లీ కేంద్రంగా ఉన్న ఆపరేటర్ విఎస్‌ఆర్ వెంచర్స్ కంపెనీ నిర్వహిస్తున్న సంగతితెలిసిందే.

ఈప్రమాదంతోనే పౌరవిమానయానశాఖ అప్రమత్తం అయి నియంత్రణకు వీలుకాని విమానాశ్రయాలు, ఎయిర్‌స్ట్రిప్‌లను తనిఖీలుచేపట్టాలనినిర్ణయించింది. అయితే ఈ ప్లాన్ మొత్తం ఇపుడు ప్రాథమిక దశలోనే ఉంది. విమానశిక్షణ సంస్థలు మాత్రమే ఈ ఎయిర్‌ఫీల్డ్‌లను ఉపయోగిస్తున్నాయి. విఐపిలకు వినియోగించే విమానాలకు కూడా వాడుకుంటుంటారు.

## బంగ్లా కొత్త ప్రభుత్వంలో యూనస్ కీలక బాధ్యతలు?



**ఢాకా, ఫిబ్రవరి 16:** బంగ్లాదేశ్ సార్వత్రిక ఎన్నికల్లో విజయం సాధించిన బిఎన్‌పి ఛైర్మన్ తారిఖ్ రెహమాన్.. ప్రభుత్వ ఏర్పాటుకు సిద్ధమవుతున్నారు. తన కేబినెట్ కూర్పుపై ముమ్మర కసరత్తు చేస్తున్నట్లు సమాచారం. ఇదే సమయంలో ఇప్పటివరకు బంగ్లా ప్రభుత్వ తాత్కాలిక సారథిగా వ్యవహరించిన మహ్మద్ యూనస్ తదుపరి పయనం ఎటువైపు అనే విషయం ఆసక్తిగా మారింది. క్లిష్ట సమయంలో దేశాన్ని ముందుండి నడిపించిన ఆయన, నూతన ప్రభుత్వంలో భాగస్వామి అవుతారా? ప్రత్యేక బాధ్యతలు అందుకుంటారా? అన్న విషయంపైనా చర్చ జరుగుతోంది,

ఉద్రిక్తతల వేళ మాజీ ప్రధాని షేక్ హసీనా బంగ్లాదేశ్ వీడిన తర్వాత.. 2024 ఆగస్టులో తాత్కాలిక ప్రభుత్వానికి సారథిగా (ముఖ్య సలహాదారు) మహ్మద్ యూనస్ బాధ్యతలు చేపట్టారు. దేశం అత్యంత అస్థిర పరిస్థితులను ఎదుర్కొన్న సమయంలో ఓ ప్రభుత్వ సంరక్షకుడిగా కొనసాగిర ఆయన.. 18 నెలలపాటు తన విధులను నిర్వర్తించారు. ఎన్నికల నిర్వహణలోనూ కీలకంగా వ్యవహరించారు. ఇవే కాకుండా రాజకీయ వ్యవస్థలో సంస్కరణకు శ్రీకారం చుట్టారు. ఒకే వ్యక్తికి ప్రధాని పదవిని రెండుసార్లకు పరిమితం చేయడం, స్వతంత్ర న్యాయవ్యవస్థ, మహిళల ప్రాతినిధ్యం పెరుగుదుల, ఎన్నికల సమయాల్లో తటస్థంగా వ్యవహరించే తాత్కాలిక ప్రభుత్వాల ఏర్పాటు సిఫార్సులను పొందుపరిచారు. ఈ రెఫరెండానికి సంబంధించి తాజా ఎన్నికల్లో మెజారిటీ ప్రజలు మద్దతు పలికారు. బంగ్లాదేశ్‌లో బిఎన్‌పి చీఫ్ రెహమాన్ నేతృత్వంలో ఏర్పడే కొత్త ప్రభుత్వంలో యూనస్‌కు కీలక బాధ్యతలు అప్పగించే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. అంతర్జాతీయంగా యూనస్‌కు ఉన్న బలమైన సంబంధాల కారణంగా అధ్యక్షుడిగా ఎంచుకునే అవకాశం ఉందని స్థానిక రాజకీయాలను విశ్లేషించే డేవిడ్ బెర్గ్‌మన్ అనే కాలమిస్ట్ అంచనా వేశారు. ప్రపంచ స్థాయిలో ఆయనకున్న గుర్తింపు మరో బంగ్లాదేశీ నేతకు లేదన్నారు. ఈ విషయంపై ఇప్పటికే బిఎన్‌పి, మహ్మద్ యూనస్ మధ్య చర్చలు జరిగినట్లు వార్తలు వచ్చినప్పటికీ.. యూనస్ ప్రనితిధి మాత్రం వాటిని తోసిపుచ్చారు. ఆయనకు రాజకీయాలపై అంతగా ఆసక్తి లేదన్నారు.

సంక్షోభ పరిస్థితుల్లో తాత్కాలిక ప్రభుత్వ ప్రధాన సలహాదారుడిగా కొనసాగిన యూనస్ సేవలను తారిక్ రెహమాన్ ఉపయోగించుకునే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ముఖ్యంగా నూతన ప్రభుత్వానికి రాజకీయ లేదా ఆర్థిక సలహాదారుగా నియమించుకునే అవకాశం ఉందని చెబుతున్నారు. భవిష్యత్తుపై ప్రస్తుతానికి యూనస్ అధికారికంగా ఎటువంటి ప్రకటన చేయనప్పటికీ.. బిఎన్‌పి చేసే ప్రతిపాదనను అంగీకరించే అవకాశాలే ఎక్కువని తెలుస్తోంది.


## డార్ఫర్‌లో సాయుధ మిలిటెంట్ల మారణకాండ

**ఖర్టూమ్, ఫిబ్రవరి 16:** సూడాన్‌లో పారామిలిటరీ దళాలు సృష్టించిన మారణకాండపై ఐక్యరాజ్యసమితి సంచలన నివేదికను విడుదల చేసింది. గతేడాది అక్టోబర్ చివరిలో దార్ఫుర్ ప్రాంతంలో కేవలం మూడు రోజుల్లోనే రాపిడ్ సపోర్ట్ ఫోర్సెస్ (ఆర్‌ఎస్‌ఎఫ్) దళాలు 6 వేల మందికి పైగా పౌరులను అత్యంత క్రూరంగా హతమార్చినట్లు తెలిపింది. ఈ హింస దిగ్భ్రాంతికరంగా ఉందని, ఇవి యుద్ధ నేరాలు, మానవత్వంపై ఘోరాలతో సమానమని సమితి మానవ హక్కుల కార్యాలయం తన నివేదికలో స్పష్టం చేసింది. నార్త్ దార్ఫుర్‌లోని ఎల్‌ఫాషెర్ నగరాన్ని స్వాధీనం చేసుకునే క్రమంలో ఆర్‌ఎస్‌ఎఫ్, దాని

మిత్రపక్ష అరబ్ మిలీషియాలు ఈ ఘాతుకాలకు పాల్పడ్డాయని శుక్రవారం విడుదల చేసిన 29 పేజీల నివేదికలో వివరించింది. సామూహిక హత్యలు, లైంగిక దాడులు, చిత్రహింసలు వంటి అనేక అకృత్యాలకు పాల్పడ్డారని పేర్కొంది.

## శుభలగ్నం సీన్ రిపీట్!

### ప్రియురాలికి రూ.1.5 కోట్లకు భర్తను అమ్మేసిన భార్య



**భోపాల్, ఫిబ్రవరి 16:** ప్రముఖ టాలివుడ్ దర్శకుడు ఎస్‌వీ కృష్ణారెడ్డి దర్శకత్వంలో వచ్చిన శుభలగ్నం చిత్రంలో భార్య తన భర్తను కోటి రూపాయలకు ప్రియురాలికి అమ్మేస్తుంది. అచ్చం అలాంటి ఘటనే ఇప్పుడు భోపాల్‌లో చోటుచేసుకుంది. ఇందులో కూడా ఇద్దరు పిల్లల తల్లి తన భర్తను రూ.1.5 కోట్లకు మరో మహిళకు అప్పగించేసి పిల్లలతో హాయిగా వేరే చోటకు వెళ్లిపోయింది. ఈ ఒప్పందం న్యాయస్థానం సాక్షిగా జరగడం విశేషం. వివరాల్లోకి వెళితే భోపాల్‌లో 42 ఏండ్ల వ్యక్తికి 23 ఏండ్ల క్రితం పెండ్లయింది. వారికి ఇద్దరు ఆడపిల్లలు. అయితే తన తండ్రి తన కార్యాలయంలో 54 ఏండ్ల మహిళతో సంబంధం పెట్టుకుని తమను నిర్లక్ష్యం చేస్తున్నాడంటూ 16 ఏండ్ల వారి పెద్ద కుమార్తె ఫ్యామిలీ కోర్టులో పిటిషన్ వేసింది. కోర్టు భార్యాభర్తలు, అతని ప్రియురాలిని కౌన్సెలింగ్‌కు పిలిచింది. అయితే తాను ప్రియురాలితోనే ఉంటానని భర్త స్పష్టం చేశాడు. దీంతో తన భర్తను ప్రియురాలికి వదిలిపెట్టడానికి రూ.1.5 కోట్లు ఇవ్వాలని భార్య డిమాండ్ చేసింది. దీనికి ప్రియురాలు సై అనడంతో 23 ఏండ్ల వారి వివాహ బంధానికి తెరపడింది. ఆ భార్యకు ఒక డూప్లెక్స్ ఇంటితో పాటు 27 లక్షల నగదును ప్రియురాలు చెల్లించడంతో ఆమె తన ఇద్దరు పిల్లలతో అందులోకి మారిపోయేందుకు సిద్ధపడుతున్నది.

## సంక్షిప్తంగా..

### కర్ణాటకలో రూ.400 కోట్ల దారి దోపిడీ!



**బెంగళూరు, ఫిబ్రవరి 16:** ట్రక్కు నుంచి రూ.400 కోట్లమేర నగదు దారి దోపిడీ జరిగిందంటూ ఓ వాహన డ్రైవర్ మహారాష్ట్రలో చేసిన ఫిర్యాదు ఇటీవల కలకలం రేపింది. పొరుగునే ఉన్న కర్ణాటకలో ఇది రాజకీయ దుమారానికి కారణమైంది. నగదు తరలిస్తున్న ట్రక్కులో దోపిడీ జరిగిందంటూ డ్రైవర్ సందీప్ పాటిల్ గతేడాది డిసెంబర్ 17న నాసిక్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. గతేడాది అక్టోబర్ 22న కర్ణాటక బెల్గాం జిల్లాలోని చోర్లా ఘాట్ ప్రాంతంలో ఈ ఘటన జరిగిందని చెప్పాడు. ఏడుగురు వ్యక్తులు అడ్డగించి, కిడ్నాప్‌చేసి, దాడి చేశారని ఆరోపించాడు. ఆపై రూ.400 కోట్ల విలువైన రెండువేల నోట్లతో పరారైనట్లు తెలిపాడు. పోలీసులు ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. ఘటనాస్థలం కర్ణాటకలో ఉండటంతో అక్కడి పోలీసులు అప్రమత్తమయ్యారు.

### శబరిమలలో మహిళల ఆలయ ప్రవేశంపై సమీక్షకు సుప్రీం ఓకే



**తిరువనంతపురం, ఫిబ్రవరి 16:** కేరళలోని శబరిమల అయ్యప్ప ఆలయంలోకి అన్ని వయసుల మహిళలకు ప్రవేశం కల్పిస్తూ 2018లో సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన విషయం తెలిసిందే. ఈ తీర్పును సమీక్షించాలని కోరుతూ దాఖలైన 67 పిటిషన్లపై త్వరలో విచారణ చేపట్టనున్నట్లు సుప్రీంకోర్టు వెల్లడించింది. పలు మత పరమైన ప్రదేశాలలో మహిళల ప్రవేశంపై నిషేధానికి సంబంధించి మార్చి 14 లోపు లిఖితపూర్వక నివేదికలు సమర్పించాలని ఆయా రాష్ట్రాల ప్రభుత్వాలు, ఆలయ నిర్వాహకులకు సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఈ అంశంపై విచారణ చేపట్టేందుకు 9 మంది న్యాయమూర్తులతో కూడిన ధర్మాసనాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించింది. ఈ పిటిషన్లపై విచారణ చేపట్టడానికి ఏప్రిల్ 7నుంచి 22 వరకు రెండువారాల సమయం కేటాయిస్తున్నట్లు తెలిపింది.

### ఇంటిపై బాంబుల తయారీ: పేలుడులో ఇద్దరు మృతి



**భువనేశ్వర్, ఫిబ్రవరి 16:** సొంతిల్లే కదా అని తమ ఇంటిపైన వాటర్ ట్యాంకుల పక్కన బాంబులు తయారు చేస్తుంగా ఒక్కసారిగా పేలుడు సంభవించింది. ఈ సంఘటనలో ఇద్దరు వ్యక్తులు మరణించారు. మరో ఇద్దరు గాయపడ్డారు. ఒడిషా రాజధాని భువనేశ్వర్‌లో జరిగిన ఈ సంఘటన సీసీటీవీలో రికార్డైన ఈ పేలుడు వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. జనవరి 27న మధ్యాహ్నం 2.45 గంటల సమయంలో సుందర్‌పాడా ప్రాంతంలోని ఒక ఇంటిపై అక్రమంగా బాంబులు తయారు చేసేందుకు నలుగురు వ్యక్తులు ప్రయత్నించారు. ఈ సందర్భంగా భారీ పేలుడు సంభవించింది. మంటలు అంటుకోవడంతో ఒక మహిళ, మరికొందరు పరుగులు తీశారు. ఆ నలుగురు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు.

### ఏప్రిల్ 22న తెరుచుకోనున్న కేదార్‌నాథ్ ఆలయం

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 16:** శీతాకాలంలో దాదాపు ఆరు నెలలుగా మూసివేసిన ప్రఖ్యాత కేదార్‌నాథ్ ఆలయం ద్వారాలు ఏప్రిల్ 22న తెరుచుకోనున్నాయి. మహాశివరాత్రి పురస్కరించుకొని మందిరాన్ని తిరిగి తెరిచేందుకు శుభ తేదీ, సమయాన్ని నిర్ణయించినట్టు ఆలయ ప్రజా సంబంధాల అధికారి హరీశ్ గౌర్ ఆదివారం వెల్లడించారు. దీంతో ఈ ఏడాది చార్‌ధామ్ యాత్ర షెడ్యూల్ ఖరారైంది. బద్రీనాథ్ ధామ్ ద్వారాలు ఏప్రిల్ 23న, గంగోత్రి, యమునోత్రి ధామ్ ఏప్రిల్ 19న తెరుచుకుంటున్నాయి. ఉత్తరాఖండ్‌లోని గర్వాలీ హిమాలయ పర్వతాల్లో కొలువైన ఓంకారేశ్వర్ ఆలయం తలుపులు ఏప్రిల్ 22న తెరుచుకుంటాయని, ముందు పండితులు, పూజారులు ప్రత్యేక పూజలు చేస్తారని తెలిపారు.

### 24న జయలలిత నెచ్చెలి శశికళ కొత్తపార్టీ



**చెన్నై, ఫిబ్రవరి 16:** తమిళనాడు దివంగత ముఖ్యమంత్రి జయలలిత సన్నిహితురాలు, అన్నాడీఎంకే బహిష్కృత నేత వీకే శశికళ కొత్త రాజకీయ పార్టీని ఏర్పాటు చేసేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. తన ఆప్త మిత్రురాలి జయంతి రోజైన ఈనెల 24న పార్టీ పేరు, జెండా, విధివిధానాలను ప్రకటించే అవకాశం ఉంది. ఆమె తన రాజకీయ భవిష్యత్ కార్యాచరణపై దృష్టి సారించారు. 2026 అసెంబ్లీ ఎన్నికలే లక్ష్యంగా శశికళ తన వ్యూహాలకు పదును పెడుతున్నారు. చెన్నైలోని తన నివాసంలో జిల్లా స్థాయి నేతలు, అనుచరులతో వరుసగా సమావేశమవుతున్నారు. 18వ తేదీ వరకు ఈ చర్చలు కొనసాగనున్నాయి.

## 85శాతం పడిపోయిన ఇమ్రాన్‌ఖాన్ కంటిచూపు!

### జైలు అధికారులే బాధ్యులంటున్న కుటుంబసభ్యులు

**రావల్పిండి, ఫిబ్రవరి 16:** దేశ మాజీమంత్రి ఇమ్రాన్‌ఖాన్ ఆరోగ్యపరిస్థితి మరింత విషమించిందని ఆయన కుటుంబసభ్యులు ఆందోళన వ్యక్తంచేసారు. 73 ఏళ్ల ఇమ్రాన్ గడచిన రెండేళ్లుగా జైలులోనే ఉంటున్నారు. ఆయన కంటిచూపును 85శాతం కోల్పోయినట్లు వారు చెపుతున్నారు. ఆయన కుటికన్ను పూర్తిగా పనిచేయడంలేదని, గత జనవరిలోనే కుడ ి కంటిలో ఉన్న రక్తపుచారను తొలగించేం దుకు శస్త్రచికిత్స జరిగిందని ఇమ్రాన్ తరపు న్యాయ వాది వెల్లడించారు. దీనితో పాక్ సుప్రీంకోర్టు ఖాన్‌కు వైద్యం సమీక్షించి నివేదిక అందచే యాలని, ఒక డాక్టర్ల ప్యానెల్‌తో ఆయన వైద్య అధ్యయనంజరగాలని, అంతేకాకుండా ఆయన కుమారులతో టెలిఫోన్ కాల్స్‌కు అనుమ తించాలని ఆదేశించింది. ఒక ప్రత్యేక కంటి ఆసుపత్రి ఖాన్‌ను రావల్పిండిలో కలిసి పరీక్షలుచేయాలనినిర్ణయించింది. అయితే జైలు ఆవరణలోనే ఆయన వ్యక్తిగత వైద్యులు కుటుంబసభ్యుల సమక్షంలోనే పరీక్షలుచేయాలని జైలు అధికారులు నిర్ణయించారు. ఇమ్రాన్‌ఖాన్ పార్టీ పిటిఐ ఈ అంతర్‌పరీక్షల విధానాన్ని తీవ్రంగా వ్యతిరేకించింది. ఖాన్ సోదరీమణులు నోరీన్ ఖానుమ్, ఆలీమా ఖానుమ్‌లు సోమవారం మాట్లాడుతూ ప్రభుత్వం నియమించిన వైద్యుల అసెస్‌మెంట్ వద్దని ఈ విధానం ఎంతమాత్రం తమకు ఆమోదయోగ్యం కాదన్నారు. ఇమ్రాన్ కుటుంబసభ్యులు లేకుండా ఆయనకు ఎలాంటి వైద్యపరీక్షలు నిర్వహించకూడదని నోరీన్ ఖానుమ్‌వెల్లడించారు. ప్రభుత్వం ఎందుకుస్పెషలిస్టులను ఎంపిక చేసేందుకు నిరాకరిస్తున్నదో తెలియడంలేదని, ఇమ్రాన్‌ఖాన్ వ్యక్తిగత వైద్యులు సూచించిన స్పెషలిస్టులను నియమించడంలో వారికున్న అభ్యంతరాలేమిటని ప్రశ్నించారు. ఇమ్రాన్ సోదరీమణులుమాత్రం ఖాన్‌కు వైద్యచికిత్స సకాలంలో అందించేందుకు జైలు అధికారులే పట్టించుకోవడంలేదని, వారంతా వ్యతిరేకిస్తున్నారని అన్నారు. 2022లో జరిగిన కాల్పుల్లో ప్రాణాపాయంనుంచి తప్పించుకున్నారు.




## రోహిత్‌శెట్టి ఇంటిముందు కాల్పులు జరిపిన షూటర్ అరెస్టు

### మొత్తం ఏడుగురిని అరెస్టుచేసిన ముంబయి క్రైమ్‌బ్రాంచ్‌పోలీసులు

**ముంబయి, ఫిబ్రవరి 16:** ముంబయి క్రైమ్‌బ్రాంచ్ పోలీసులు రోహిత్‌శెట్టిపై కాల్పులుజరిపిన నిందితుడిని అరెస్టుచేసారు. రోహిత్ ఇంటిబయట నిందితుడు కాల్పులు జరపడంతోముంబయి పోలీసులకు అందిన ఫిర్యాదుమేరకు కేసునమోదుచేసి దర్యాప్తు ప్రారంభించారు. ప్రత్యేక బృందాలను కూడా ఏఅర్పాటుచేసారు. కాగా కాల్పులు జరిపిన షార్ప్‌షూటర్‌ను రాజస్థాన్‌నుంచి అరెస్టుచేసినట్లు పోలీసులు తెలిపారు. మొత్తం ఆరుగురిని ఈ కేసులో అరెస్టుచేసినట్లు ముంబయి క్రైమ్ బ్రాంచ్‌పోలీసులు తెలిపారు. మరికొందరిని ఉత్తర ప్రదేశ్‌నుంచి కూడా అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. వారిపై ఎంకోకా 1999 చట్టంప్రకారం కేసులునమోదుచేసి ప్రత్యేక కోర్టులో హాజరుపరిచినట్లు తెలిపారు. ఐదుగురు నిందితుల పోలీసు కస్టడీ ముగిసిందని, వీరిపై ఎంకోకా చట్టాన్ని ప్రయోగించినట్లు తెలిపారు. మంగళశారం వరకూ వీరుకట్టడీలోనే ఉంటారు. తిరిగి ముంబయి క్రైమ్‌బ్రాంచ్ 15 రోజుల కస్టడీని కోరారు. అయితే కోర్టు 17వ తేదీవరకూ మాత్రమే అనుమతినిచ్చింది. వ్యవస్థీకృత నేరాలు, ఉగ్రవాదాన్ని అరికట్టేందుకు మహారాష్ట్ర ప్రభుత్వం ఈ చట్టాన్ని తెచ్చింది. నిర్మాత రోహిత్‌శెట్టి జుహు నివాసంలో ఈనెలలో ఐదురౌండ్ల కాల్పులు దుండగులు జరిపారు.

## శిక్ష పూర్తయిదంటూ పిటిషన్.. అబూసలేంకు సుప్రీంకోర్టులో చుక్కెదురు



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 16:** ముంబైలో 1993 నాటి పేలుళ్ల కేసులో దోషిగా తేలిన గ్యాంగ్‌స్టర్ అబూ సలేంకు సుప్రీంకోర్టులో చుక్కెదురైంది. ఈ కేసులో తనకు విధించిన 25 యేళ్ల శిక్షాకాలం ఇప్పటికే పూర్తయిందని, 10 నెలలుగా అక్రమంగా కస్టడీలో ఉంచారని ఆరోపిస్తూ దాఖలు చేసిన పిటిషన్‌ను సర్వోన్నత న్యాయస్థానం తిరస్కరించింది. కేసు పూర్వాపరాలు,సత్‌ప్రవర్తనకు సంబంధించిన రెమిషన్‌ను కలుపుకొని తాను ఇప్పటికే 25 యేళ్ల జైలు శిక్ష అనుభవించానని, విడుదల చేయాలని కోరుతూ అబూ సలేం గతంలో బాంబే హైకోర్టును ఆశ్రయించాడు. అయితే, అతడికి మధ్యంతర ఉపశమనం ఇచ్చేందుకు హైకోర్టు గతేడాది జూలైలో నిరాకరించింది. 25 యేళ్ల ఇంకా పూర్తి కాలేదని ప్రాథమికంగా తేలినట్లు పేర్కొంది. దీన్ని సవాల్ చేస్తూ అతడు 'సుప్రీం' తలుపు తట్టాడు. జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన ధర్మాసనం అతడి పిటిషన్‌ను విచారించింది. ఈ వ్యవహారంపై హైకోర్టుకే వెళ్లాలని సూచించింది. సమాజానికి హాని చేసినందుకే 25 యేళ్లు శిక్ష పడిందని, తాడా (ఉగ్రవాద నిరోధక చట్టం) కింద దోషిగా తేలినట్లు గుర్తు చేసింది. 1993 ముంబయి పేలుళ్ల తర్వాత అబూ సలేం పోర్చుగల్‌క పారిపోయాడు. సుదీర్ఘ న్యాయపోరాటం తర్వాత 2005 నవంబరులో కేంద్రం అతడిని భారత్‌కు రప్పించింది. అప్పగింత వ్యవహారంలో పోర్చుగల్‌తో కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం.. భారత్ అతడికి మరణశిక్ష విధించకూడదు. జైలుశిక్ష కూడా 25 యేళ్లు మించకూడదు. పోర్చుగల్‌కు ఇచ్చిన హామీని నిలబెట్టుకునేందుకు కేంద్రం కట్టుబడి ఉందని.. 2022లో అబూసలేం దాఖలు చేసిన వేరే పిటిషన్‌పై తీర్పు సందర్భంగా సుప్రీంకోర్టు తెలిపింది.



ప్రపంచంలో వేగంగా విస్తరిస్తున్న వ్యాధుల్లో.. మధు మేహం ముందు వరుసలో ఉన్నది. వయసు, లింగభేదం లేకుండా ఈ వ్యాధి అందర్నీ ఇబ్బంది పెడుతున్నది. అయితే.. గర్భిణుల్లో షుగర్ వ్యాధి చాపకింద నీరులా వ్యాపిస్తున్నదని ఆరోగ్య నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## మధు మేహంతో జాగ్రత్త..

జెస్టేషనల్ డయాబెటిస్.. తల్లితోపాటు బిడ్డకూ హాని కలిగిస్తుందని హెచ్చరి స్తున్నారు. తగు జాగ్రత్తలు తీసు కుంటే.. ఆరోగ్యవంతమైన, పండంటి బిడ్డలకు జన్మనివ్వొచ్చని చెబుతున్నారు. సాధారణ మహిళలతో పోలిస్తే.. గర్భిణుల్లో ఇన్సులిన్‌కు ప్రతికూల హార్మోన్లు (కార్టిసోల్), మాయకు సంబంధించిన హార్మోన్లు ఎక్కువగా విడుదల అవుతా యట. ఫలితంగా ఇన్సులిన్ సామర్థ్యం తగ్గి.. రక్తంలో గ్లూకోజ్ స్థాయులు పెరుగుతాయట. దీనిని నిరక్ష్యం చేస్తే.. తల్లికి ఇబ్బంది కలగడంతోపాటు పిండం ఎదుగుదల మీదా ప్రభా వం చూపుతుందని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. డయాబెటిస్ ముదిరితే.. పిండం అవయవాల తయారీ మందగిస్తుందనీ, పుట్టిన తర్వాత గుండె, ఊపిరి తిత్తుల జబ్బులు వచ్చే ప్రమాదం ఉంటుందనీ చెబుతున్నారు. దీనినుంచి బయట పడాలంటే.. జీవనశైలిలో మార్పులు చేసుకోవాలని, ఆహారం విషయంలో నియ మాలు పాటించాలని సూచిస్తున్నారు. ఎప్పటికప్పుడు రక్తంలో గ్లూకోజ్ మోతాదును పరీక్షించుకుంటూ.. వైద్యుల సలహామేరకు మందులు వాడాలని అంటున్నారు. □

## అక్షరం దూరాన్ని తగ్గిస్తుంది



మైళ్ల దూరంలోని మనసు లను కలిపే శక్తి గతంలో అక్షరానికి ఉండేది. ఇప్పుడేమో హాలో అంటూ... అవతలివ్యక్తి చిరునవ్వు ఫోన్ స్క్రీన్పై కనిపిస్తోంది. అలాగని ఇది దూరాన్ని దగ్గర నేనే కాలం అనుకుంటే పొరపాటే ఎందుకంటే ఒకే ఇంట్లో దంపతులు ఉంటూ కూడా, సమయా భావంతో మైళ్లదూరంలో ఉన్న వ్యక్తుల్లా మెలగుతున్నారు. ఈ దూరాన్ని తగ్గించుకోవడానికి తిరిగి అక్షరాన్ని ఆశ్రయిస్తే ఎలా ఉంటుందో ప్రయత్నిద్దామా!

**ప్రమాదమే..** ఉదయం నిద్ర లేవడం నుంచి భార్యాభర్తలు ఎవరి పనులు వాళ్ల చేసి పరుగులు పెట్టడంతో రోజు మొదలై, ఏ అర్ధరాత్రికో ఇంటికి చేరుకోవడంతో పూర్తవుతోంది. లేదా దంపతుల్లో ఒకరు వర్క్ ఫ్రమ్ హోమ్ చేస్తే, మరొకరు ఆఫీసుకు బయలుదేరుతున్నారు. ఒకే ఇంట్లోనే ఉంటూ పరిచయస్థుల్లా మారుతున్నారు. హాలో, గుడ్మార్నింగ్ అనే పలకరింపులు, ఫోన్లో పొడిపొడి మెసేజ్ పరిస్థితి వచ్చింది. జీవనశైలి ఇలాగే కొనసాగితే మాత్రం తీవ్ర ఒత్తిడి, ఆందోళన, ఒంటరితనం వంటివి దరిచేరే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అలాకాకుండా ఉండాలంటే భాగస్వామికి రోజూ ఓ ప్రేమలేఖలాంటి పలకరింపు అందించాలని సూచిస్తున్నారు.

**సేదదీరాలి...** ప్రేమించుకున్నప్పుడు లేదా పెళ్లైన కొత్తలో తమ మనసులోని ప్రేమకు అక్షరరూపాన్ని ఎలా ఇచ్చారో. ఆ తర్వాత కూడా ఆ ప్రేమలేఖ సంప్రదాయాన్ని కొనసాగించాలి. దీనికోసం వారానికోరోజు ఉత్తరాలకే అనుకోవాలి. ఇరువురికీ మనసులో దాగున్న తీయని జ్ఞాపకాలకు అందంగా అక్షరరూపమివ్వాలి. అప్పట్లో చేసుకున్న వాగ్దానాలు, జీవితంలో సాధించాలనుకున్న లక్ష్యాలు, కలిసి తిరిగిన ప్రాంతాలు... వంటివన్నీ తిరిగి జ్ఞాపకం తెచ్చుకోవాలి. ఎదుటివారికి ఇష్టమైనవన్నీ గుర్తుకొచ్చేలా ఆ లేఖ ఉండాలి. ఒకరికొకరు చదివి వినిపించుకునే ఈ ఉత్తరాలు ఇద్దరినీ గతంలోకి తీసుకెళతాయి. ఆ ప్రేమను గుర్తుచేస్తాయి. జీవితమనే ప్రవాహంలో కొట్టుకుపోతున్న భాగస్వామికి మీ లేఖ కాసేపు సేదతీరడానికి సాయపడేలా పని చేస్తుంది. దైనందిన జీవితంలో తిరిగి నూతనోత్సాహాన్ని నింపుతుంది. □



## ధైర్య సాహసాలకు గ్యాలెంటరీ అవార్డు ..

ఆమె కలలు వేరు. ఎంపిక కెరియరూ వేరే! అలాంటామెకు ప్రజలకు సేవ చేయాలనే కోరిక కలిగింది. అందుకు తనకు కనిపించిన మార్గం సివిల్స్. అలా కాకుండా దారి మార్చుకుని... పోలీసులు అనుకోకుండా తనుశ్రీ తన ధైర్య సాహసాలతో తాజాగా గ్యాలెంటరీ అవార్డును అందుకున్నారు.

తనుశ్రీ పుట్టి పెరిగిందంతా బిహార్, ఢిల్లీ యూనివర్సిటీ నుంచి బీఏ ఆనర్స్ పూర్తిచేశారు. చిన్నప్పట్నుంచీ మంచి విద్యార్థినే. అయితే ఎప్పుడూ పుస్తకం పట్టుకునే ఉండటం ఆమె నైజం కాదు. సృజనాత్మకతకీ చోటిచ్చి ఎన్నో ప్రయోగాలు చేసేవారు. అలా తన అభిరుచికి ప్రాణం పోసేలా డిజైనింగ్ రంగం కనిపించింది. దీనితో నిఫ్ట్ గాంధీనగర్ నుంచి టెక్స్‌టైల్ డిజైనింగ్‌లో కోర్సుని పూర్తిచేశారు. తన పని ఇతరులకూ సాయ పడాలనేది తనుశ్రీ తత్వం. అందుకే నేత కార్మికులతో కలిసి పనిచేశారామె. ఝార్ఖండ్లోని క్లస్టర్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టులోనూ భాగమయ్యారు. అలా నాలుగైదేళ్లు పనిచేశారు. అప్పుడే పేదల కష్టాలు అర్థమయ్యామెకు సమాజానికి సేవ చేస్తే ఏదైనా చేయాలనే ఆలోచన కలిగింది. ఏం చేద్దామా అని ఆలోచిస్తున్న తనకు తండ్రి కనిపించారు. ఆయన పోలీస్ ఆఫీసర్. అలా సివిల్స్ వైపు వెళ్లారు. యూపీఎస్సీ ప్రయాణం అంత సులువు కాదని అర్థమవ్వడానికి తనుశ్రీకి ఎంతోకాలం పట్టలేదు. వరుస వైఫల్యాలు. ఎంత కష్టపడినా అదే ఫలితం. ఈక్రమంలో రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ నీ సాధించారు. అక్కడ శిక్షణ తీసుకుంటూనే సివిల్స్‌కి సిద్ధమయ్యారు... చివరకు 2017లో ఐపీఎస్ సాధించారు. శిక్షణ అనంతరం కశ్మీర్‌లో పోస్టింగ్ అందుకున్నారు. స్టేట్ ఇన్వెస్టిగేషన్ పరిధి పనిచేసిన ఈమె తరవాత పుల్వామాకి సీనియర్ సూపరింటెండెంట్గా బదిలీ అయ్యారు. పుల్వామా... మిలిటెంట్ల హాట్‌స్పాట్‌గా చెబుతారు. అలాంటి చోట తన ప్రణాళికలు, వ్యూహాలతో ఉగ్రవాద దాడులను అడ్డుకున్నారు. ఇద్దరు ప్రమాదకర ఉగ్రవాదులను మట్టుపెట్టారు. ఈక్రమంలో ఎదురైన బెదిరింపులూ చాలానే. అయినా విధుల విషయంలో వెనుదిరగలేదు. ఇల్లాలిగా, తల్లిగానే కాదు... విధి నిర్వహణ బాధ్యతల్ని సమర్థంగా నిర్వర్తిస్తున్నారీమె. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా యువతలో అవగాహన కల్పిస్తున్నారు. ఆ ధైర్యానికీ, ఆమె నాయకత్వానికీ, వృత్తిపట్ల నిబద్ధతకీ గుర్తింపుగా ప్రతిష్ఠాత్మక గ్యాలెంటరీ అవార్డుకి ఎంపికయ్యారు ఎస్ఎస్పీ తనుశ్రీ మహిళలు చేయలేరు అంటే అతి ప్రమాదకరమైన చోట సమర్థంగా విధులు నిర్వర్తిస్తూ మరెందరికో స్ఫూర్తిగా నిలుస్తున్న ఈ పోలీస్‌కి సెల్యూట్ చెప్పాల్సిందే . □

## ధ్యాన మార్గమే ఉత్తమం !

మనిషి దైనందిక జీవితంలో అనేక సమస్యలకు, ఒడిదుడుకులకు, గురౌతుంటారు. అటువంటి వారికి ధ్యానం పరమ ఔషదం లాంటిది.మనిషి మనిషికీ అనేక బాధలు ఉంటాయి.అటువంటి వాటికి ఆధ్యాత్మిక పరంగా పరిష్కారం వుంది. వాటిని ధ్యాన మార్గం ద్వారా దూరం చేయవచ్చును. ధ్యానం ఒక సందేశం కావాలి ధ్యానం మానసిక ఒత్తిడిని దూరం చేస్తుంది. మనసుకు ఆహ్లాదం చేకూరుస్తుంది.వివిధ రోగాల నుండి విముక్తి కల్పిస్తుంది.పూర్వం ధ్యానం ద్వారా మునులు దివ్య లోకాలను సందర్శన చేసేవారు. యోగము సిద్ధించే గొప్ప శక్తి వంతమైనది ధ్యానం.శ్వాస పై ధ్యాస పెట్టడమే ధ్యానం యొక్క ముఖ్య విధి.అందుకే ధ్యానం ఒక పరమార్థం.దివ్య మైన యోగ మార్గం ఈ ధ్యానం.అదే దివ్య జ్ఞానం కాగలదు.పూర్వం మునులు, యోగులు, ధ్యానం ద్వారా మోక్ష ప్రాప్తి పొందడం జరిగింది.ధ్యానం ఒక పరమార్థం. ధ్యానం పవిత్రం, ధ్యానం మహాయోగం, భోది వృక్షం దగ్గర బుద్ధుడు ధ్యానం ద్వారా మహాయోగి కాగలిగాడు. శ్రీ రామకృష్ణ పరమ హంస, శారదాదేవి ధ్యానం ద్వారా యోగుల కాగలిగారు.స్వామి వివేకానంద ధ్యానం ఒక సందేశం అంటారు. తదేకలగ్నంతో ఏకాగ్రత తో చేసే ఈ ధ్యానం గొప్ప ఫలితాన్ని ఇస్తుందంటారు.అందుకే ధ్యానం చేయడం ధ్యానులకు ఉత్తమం.భగవద్గీత లో ధ్యాన యోగం గురించి వివరించడం జరి గింది. శరీరంలో సరికొత్త ఉత్తేజం ఈ ధ్యానం ద్వారా లభిస్తుంది.ఆరోగ్యం వికసిస్తుంది. అనారోగ్యం దరిచేరదు.ఆయురారోగ్యం అభివృద్ధి చెందగలదు.అందుకే ధ్యానం చేయడం మానవ కర్తవ్యంగా, ధ్యానం ఒక పరమార్థంగా భావించాలి. విశ్వశాంతికి మూలం ధ్యానం. సకల మానవాళికి ధ్యానం ఒక సందేశం కావాలి! అరుణాచలంలో రమణ మహర్షి మౌనంగా ధ్యానం చేసి కైలాస వాసి అయిన పరమ శివుణ్ణి ప్రసన్నం చేసుకోగలిగారు..ప్రపంచస్థాయి లో ధ్యానంనకు గొప్ప ప్రాముఖ్యత వుంది. జీవాత్మ, పరమాత్మ,ఆత్మ జ్ఞానం నుండే మనకు సాక్షాత్కారం కలుగుతుంది.అది జ్ఞానులకు బోధ పడుతుంది.మనసులో మౌనంగా ధ్యానం చేసుకున్న వారికి మోక్షం కలుగుతుంది.ఈ పరమ సత్యం ప్రతి ఒక్కరూ గ్రహించాలి.



**- ఎల్. ప్రఫుల్ల చంద్ర**

## ఆ సమయంలో నొప్పి



పీరియడ్స్ సమయంలో భరించలేని నొప్పికి డిప్రెసనే కారణం అంటోంది ఓ రాజు అధ్యయనం. రుతుక్రమ సమయంలో నొప్పి, కుంగుబాటు... ప్రపంచవ్యాప్తంగా మహిళలపైన తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. కానీ వాటి మధ్య సంబంధం ఏంటో అర్థం కాకుండా ఉండేది. ఆ విషయాన్ని తెలుసుకునేందుకు యూకే, చైనాకు చెందిన శాస్త్రవేత్తల బృందం ప్రయత్నించింది. డిప్రెషన్కు కారణమయ్యే కొన్ని రకాల జన్యువులే రుతుక్రమంలో నొప్పికి కారణమవుతున్నాయా అనే కోణంలో పరిశోధన చేపట్టింది. అందుకోసం ఐరోపా, తూర్పు ఆసియాకు చెందిన ఆరు లక్షల మంది నుంచి జన్యు డేటా సేకరించారు. తర్వాత బయోఇన్ఫర్మేటిక్స్ సాయంతో డిప్రెషన్, రుతుక్రమ నొప్పికి దారితీసే నాడీకణ వ్యవస్థల్ని అన్వేషిం చారు. ఈ అధ్యయనంలో డిప్రెషన్కి కారణ మవు తున్న జన్యువుల్లో కొన్ని పీరియడ్స్ సమయంలో నొప్పినీ కలిగి స్తున్నట్లు గుర్తించారు. భావోద్వేగాల్లో మార్పు వచ్చినప్పుడు పొత్తుకడుపులో నొప్పి 50 శాతం పెరుగుతున్నట్లు చెబుతున్నారు. నిద్రలేమితో బాధపడే వారిలో వీటిమధ్య సంబంధం ఇంకాస్త ఎక్కువనీ తెలిపారు. తద్వారా మానసిక ఆరోగ్యం, రుతుక్రమ సమయంలో నొప్పి మధ్య సంబం ధం ఉన్నట్టు తేల్చారు. □

## కాలీ రోల్ ..



**కావలసినవి:** గోధుమపిండి కప్పు, పనీర్ 200 గ్రాములు, యోగర్ట్, ఉల్లి, క్యాబేజీ, క్యాప్సికమ్, క్యారెట్ తరుగు ముప్పావు కప్పు చొప్పున, అల్లం వెల్లుల్లి పేస్టు అర టేబుల్ స్పూన్, ధనియాల పొడి, గరం మసాలా, జీలకర్ర పొడి, ఆమ్‌చూర్ పొడర్, వాము, పసుపు అర చెంచా చొప్పున, ఛాట్ మసాలా , కాశ్మీరీ కారం, నిమ్మరసం ఒకటిన్నర చెంచా చొప్పున, ఉప్పు రుచికి సరిపడా, నూనె తగినంత, పుదీనా అర కప్పు, అల్లం అంగుళం ముక్క, కొత్తిమీర తరుగు పావు కప్పు, పచ్చిమిర్చి 2, వెల్లుల్లి రెబ్బలు 3

**తయారీ:** పుదీనా, కొత్తిమీర, అల్లం, పచ్చిమిర్చి, వెల్లుల్లి రెబ్బల్లో కొన్ని నీళ్లు, కొద్దిగా ఉప్పు కలిపి మెత్తగా నూరి గ్రీన్ చెట్నీ చేయాలి. ఒక పాత్రలో యోగర్ట్, అల్లం, వెల్లుల్లి పేస్టు, వాము, పసుపు, ధనియాల పొడి, గరం మసాలా, జీలకర్ర పొడి, ఆమ్‌చూర్ పొడర్, ఛాట్ మసాలా, కశ్మీరీ కారం, నిమ్మరసం వేసి కలపాలి. అన్నీ బాగా కలిశాక పన్నీర్ ముక్కలు జోడించి కొంతసేపు నాననివ్వాలి. మరో బౌల్లో ఉల్లి, క్యాబేజీ, క్యాప్సికమ్, క్యారెట్ తరుగు, చెంచా ఛాట్ మసాలా, చెంచా నిమ్మరసం, కొద్దిగా ఉప్పు వేసి వెజ్ సలాడ్ చేయాలి. పిండిలో కాస్త ఉప్పు, అర టేబుల్ స్పూన్ నూనె, కొన్ని నీళ్లతో పిండి కలపాలి. అర గంట తర్వాత పల్చగా రోటీలు చేసి పెనం మీద కాల్చుకోవాలి. ప్యాన్‌లో రెండు టేబుల్‌స్పూన్ల నూనె కాగనిచ్చి.. మ్యారినేట్ చేసిన పన్నీర్ ముక్కలను నాలుగు నిమిషాలు ఉడికించి దించాలి. ఒక్కో రోటీ మీద గ్రీన్ చెట్నీ పరిచినట్లు రాసి.. మధ్యలో పనీర్ టిక్కా క్యూబ్స్, వాటి మీద వెజ్ సలాడ్ వేసి చుట్టి, అంచులను కలిపేసి.. బటర్ పేపర్‌తో సగం వరకూ చుట్టాలి. అంతే... తిని ఆనందించడమే తరువాయి. □

# తెర

## మహేష్ బాబు లాంచ్ చేసిన 'నాగబంధం' ఎపిక్ టీజర్



విరాట్ కర్ణ హీరోగా దర్శకుడు అభిషేక్ నామా రూపొందిస్తున్న మోస్ట్ ఎవైటెడ్ మైథో యాక్షన్ స్పెక్టకిల్"నా గబంధం టీజర్ పవిత్ర మహా శివ రాత్రి సందర్భంగా విడుదలైంది. ఈ చిత్రాన్ని నిర్మాతలు కిషోర్ అన్నపురెడ్డి, నిషితా నాగిరెడ్డి భారీ స్థాయిలో నిర్మిస్తు న్నారు. వరల్డ్ క్లాస్ విజువల్స్, రిచ్ ప్రొడక్షన్ విల్యూస్‌తో రూపొందిన ఈ చిత్రం ప్రతి ఫ్రేమ్‌లోనూ వారి గ్రాండ్ విజన్‌ను ప్రజెంట్ చేస్తోంది. ఆధ్యాత్మికతను అద్భుతమైన విజువల్ అంబిషన్ తో కలిపి ఒక గొప్ప సినీ అనుభూతిని అందించేలా టీజర్ మెస్మరైజ్ చేస్తోంది.సూపర్ స్టార్ మహేష్ బాబు టీజర్‌ను లాంచ్ చేయడంతో దేశవ్యాప్తంగా అంచనాలు మరింత పెరిగాయి. హిమాలయాల మిస్టిక్ నేపథ్యంతో ప్రారంభమయ్యే ఈ టీజర్, కాలానికంటే పురాతనమైన ఒక రహస్య ప్రపంచానికి ప్రేక్షకులను తీసుకెళ్తుందిఅహ్మద్ షా అబ్దాలి నేతృత్వంలో జరిగిన ఆఫ్ఘాన్ దాడి నుండి కొంత ప్రేరణ పొందిన ఈ కథలో మైథాలజీ, చరిత్ర, ఆధ్యాత్మిక యుద్ధం మేళవింపుగా కనిపిస్తుంది. పవిత్ర 'నాగబంధం దేవాలయం' ఈ ఎపిక్ కథలో కీలక పాత్ర పోషిస్తుంది. హిమాలయాల రహస్య మార్గాల్లో దాగి ఉన్న ఈ దేవాలయం ఒక విశ్వశక్తిని కాపాడుతుందని నమ్మకం 'బ్రహ్మ సృష్టి నుంచి పుట్టింది..విష్ణు ధర్మం కాపాడుతోంది.. మహా దేవుడి ఆగ్రహం శక్తినిస్తుంది.." అనే లైన్ ఈ చిత్ర సోల్‌ని అద్భుతంగా ప్రజెంట్ చేస్తోంది. దర్శకుడు అభిషేక్ నామా గ్రాండ్ విజన్‌తో మైథాలజీ, యాక్షన్, ఆధ్యాత్మికతను అద్భుతంగా మేళవించారు.

## 'నాట్ ఎ డాక్టర్' ఇంట్రెస్టింగ్ టైటిల్ పోస్టర్ రిలీజ్



'నాట్ ఎ డాక్టర్' ఇంట్రెస్టింగ్ టైటిల్ పోస్టర్ రిలీజ్ స్వధర్మ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్ పై మళ్ళీ రావా, ఏజెంట్ సాయి శ్రీనివాస ఆత్రేయ, మసూద వంటి బలమైన, కంటెంట్‌బేస్డ్ చిత్రాలకు నిర్మించిన రాహుల్ యాదవ్ నక్కా మరో ఆసక్తికరమైన ప్రాజెక్ట్‌ను అనౌన్స్ చేశారు. నవీన్ చంద్ర హీరోగా నటిస్తున్న ఈ చిత్రానికి ట్యాలెంటెడ్ శ్రీకాంత్ నాగోతి దర్శకత్వం వహిస్తున్నారు.'భానుమతి రామకృష్ణ', 'మంత్ ఆఫ్ మధు' చిత్రాలలో విమర్శకుల ప్రశంసలు పొందిన ఈ కాంబినేషన్ మరోసారి జతకట్టడం ఆసక్తిని పెంచింది.నాట్ ఎ డాక్టర్ అనే టైటిల్‌తో వస్తున్న ఈ చిత్రం, టైటిల్ పోస్టర్‌తోనే ఆసక్తిని రేకెత్తిస్తోంది. అడవి నేలలో నుంచి బయటికి వస్తున్న భారీ, మట్టి తడిసిన చేయి పోస్టర్‌లో కనిపిస్తూ, ప్రకృతితో ఉన్న అనుబంధాన్ని సూచిస్తోంది. చుట్టూ పెరిగిన మాస్ రూట్స్, ఆకులు, ఎత్తైన చెట్ల నేపథ్యం కలిపి మిస్టరీతో నిండిన వాతావరణాన్ని సృష్టిస్తు న్నాయి. »Based on a novel that was never written## అనే ట్యాగ్‌లైన్ కథలో అద్భుతమైన భావోద్వేగాలు ఉంటాయని సూచిస్తోంది.పాత్‌బ్రేకింగ్ సినిమాలను ప్రోత్సహించే స్వధర్మ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై, శ్రీకాంత్ నాగోతి తన ప్రత్యేకమైన కథన శైలితో ఈ ప్రాజెక్ట్‌ను తెరకెక్కిస్తున్నారు. సహజమైన నటనతో గుర్తింపు పొందిన నవీన్ చంద్ర ఈ చిత్రంలో ఒక విభిన్నమైన పాత్రతో ప్రేక్షకులను ఆకట్టుకోనున్నారు.ఈ చిత్రానికి సంబంధించిన మరిన్ని అప్డేట్స్ త్వరలోనే వెలువడనున్నాయి.

## 'బ్యాండ్ మేళం' బ్లాక్ బస్టర్ హిట్

### డైరెక్టర్ బాబీ

.మ్యాంగో మాస్ మీడియా సమర్పణలో కోన ఫిల్మ్ కార్పొరేషన్ బ్యానర్ మీద కోన వెంకట్ నిర్మించిన చిత్రం 'బ్యాండ్ మేళం' బ్లాక్ బస్టర్ హిట్: డైరెక్టర్ బాబీ.సతీష్ జవ్వాజీ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమాలో హర్ష్ రోషన్, శ్రీదేవీ జంటగా నటించారు. ఈ మూవీని మార్చి 13న రిలీజ్ చేయబోతోన్నారు. ఈ మేరకు ఈ సినిమాకి సంబంధించిన గ్లింప్స్‌ని వాలెంటైన్స్ డే సందర్భంగా రిలీజ్ చేశారు. మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ ఈ గ్లింప్స్‌ని సోషల్ మీడియా వేదికగా విడుదల చేశారు. ఈ క్రమంలో నిర్వహించిన ప్రెస్ మీట్‌కి దర్శకుడు బాబీ, రచయిత బీవీఎస్ రవి ముఖ్య అతిథులుగా విచ్చేశారు. ఈ మేరకు నిర్వహించిన ఈవెంట్‌లో.. సక్సెస్ ఫుల్ డైరెక్టర్ బాబీ మాట్లాడుతూ.. .. 'బ్యాండ్ మేళం' గ్లింప్స్‌ని వాలెంటైన్స్ డేకి రిలీజ్ చేయండి అని నేను ఒత్తిడి చేశాను. గ్లింప్స్ చూసిన వెంటనే రోషన్ నంబర్ కనుక్కుని ఫోన్ చేసి మాట్లాడాను. ఫ్యూచర్‌లో రోషన్ పెద్ద స్టార్ అవుతాడు. ఎంతో కూల్‌గా నటించేశాడు. నిర్మాత కోన వెంకట్ మాట్లాడుతూ.. శివ నిర్వాణ 2017లో నా ఆఫీస్‌కు వచ్చాడు. శివ తుర్లపాటి శివ నిర్వాణని పరిచయం చేశాడు. శివ నిర్వాణ చెప్పిన కథ చాలా నచ్చింది. . చిన్నప్పటి నుంచి నాతోనే ఉన్న వీడికి కట్టాలిర్రా అనే డైలాగ్‌తో ఈ 'బ్యాండ్ మేళం' గ్లింప్స్ రిలీజ్ చేశాం. బీవీఎస్ రవి మాట్లాడుతూ.. .. 'బ్యాండ్ మేళం' సినిమాని ఆల్రెడీ నేను చూశాను. కథని నేను ముందే విన్నాను. విన్నప్పటి కంటే మూవీని చూసిన తరువాత ఆశ్చర్యపోయాను. చిత్రాన్ని చాలా గొప్పగా తీశాడు. హీరో హర్ష్ రోషన్ మాట్లాడుతూ.. .. 'కోర్ట్'తో నన్ను నిలబెట్టిన వాల్ పోస్టర్ టీంకి, నాని అన్నకి, ఆడియెన్స్‌కి అందరికీ థాంక్స్. 'బ్యాండ్ మేళం' అనే పేరుని అందరూ వినే ఉంటారు. మా సినిమాతో ఆ పేరు అందరి గుండెల్లో చిరస్థాయిగా నిలబడిపోతుంది.



## ' తు యా మైన్' చిత్రంపై మణిరత్నం ప్రశంసల జల్లు



ప్రముఖ దర్శకుడు బిజోయ్ నంబియార్ తెరకెక్కించిన సర్వైవల్ థ్రిల్లర్ చిత్రం ' తు యా మైన్' ఇటీవల విడుదలై ప్రేక్షకుల నుండి, విమర్శకుల నుండి విశేష స్పందనను రాబడుతోంది. శనయ కపూర్, ఆదర్శ్ గౌరవ్ ప్రధాన పాత్రల్లో నటించిన ఈ చిత్రం, తనదైన ఉత్కంఠభరితమైన కథనంతో ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. తాజాగా దక్షిణాదిలో నిర్వహించిన ఓ ప్రత్యేక స్క్రీనింగ్‌లో భారతీయ చలనచిత్ర దిగ్గజం మణిరత్నం ఈ చిత్రాన్ని వీక్షించి, చిత్రబృందాన్ని అభినందించారు. ఈ సందర్భంగా సినిమా గురించి ఆయన మాట్లాడుతూ.. "బిజోయ్ నంబియార్ ఈ చిత్రంలో ఒక కైనెటిక్ ఎనర్జీని తీసుకు వచ్చారు. ఇది థియేటర్లలో, ప్రేక్షకుల మధ్య కూర్చొని పెద్ద తెరపై చూసినప్పుడే ఆ అనుభూతిని పూర్తిగా ఆస్వాదించగలం," అని ప్రశంసించారు. ప్రత్యేక ప్రదర్శన అనంతరం ప్రేక్ష కులు కూడా సినిమాపై తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. కొందరు దీన్ని "అద్భుతమైన సినిమా"గా అభివర్ణించగా, మరికొందరు ఇందులోని ఉత్కంఠభరితమైన సన్నివేశాలు, గ్రిప్పింగ్ స్టోరీటెల్లింగ్ కొత్త అనుభూతిని ఇచ్చాయని పేర్కొన్నారు. మణిరత్నం వంటి లెజెండరీ డైరెక్టర్ నుంచి ప్రశంసలు లభించడం సినిమా విజయాన్ని మరింత బలపరిచింది..

## 'హే బలవంత్' ఆడియన్స్‌కు ఫుల్ ఎంటర్‌టైన్ : శివానీ నగరం



ఇటీవల లిటిల్‌హార్ట్స్, రాజు వెడ్స్ రాంబాయి, ఈషా వంటి బ్లాక్‌బస్టర్స్ చిత్రాలను అందించిన బన్నీవాస్, వంశీ నందిపాటిల సక్సెస్‌ఫుల్ ద్వయం తాజాగా నందిపాటి ఎంటర్ టైన్ మెంట్స్, బన్నీ వాస్ వర్క్స్ బ్యానర్స్ పై 'హే బలవంత్' ( హే భగవాన్ చిత్రం టైటిల్ మార్పు) అనే ఫుల్‌లెంగ్త్ అవుట్ అండ్ అవుట్ ఎంటర్‌టైనర్‌ను ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు.

**'హే బలవంత్' ఎలాంటి సినిమా?**

నాది సుహాస్‌తో రెండో సినిమా.. నా కెరీర్‌లో మూడో సినిమా.. సుహాస్‌తో ఇంతకు ముందు చేసిన సినిమాలో చాలా ఇంటెన్స్ క్యారెక్టర్.

**ఈ సినిమాతో హ్యాట్రిక్ హిట్‌ను పూర్తిచేస్తారా?**

. సినిమా చాలా బాగుంటుంది. తప్పకుండా హిట్ అవుతుందనే నమ్మకం ఉంది. సుదర్శన్, సుహాస్, నాపాత్రలు మిమ్ములను బాగా నవ్విస్తుంది.

**ఈ సినిమా ఒప్పుకుంటానికి రీజన్ ఏమిటి?**

నాకు వచ్చిన కథలో దిబెస్ట్ పిక్ చేసుకుంటున్నాను. ఫస్ట్ సినిమాలో కామెడీలో లేదు. సెకండ్ సినిమాలో ఫుల్ కామెడీ, ఈ సినిమాలో కూడా కామెడీ ఉంది.

**ఈ సినిమాలో బిజినెస్ ఏమిటి? ఆ బిజినెస్‌తో మీకు ఏమైనా సంబంధం ఉంటుందా?**

లేదండి.,. అది సినిమాలో నరేష్ గారి ఫ్యామిలి బిజినెస్ అది నాకు సంబంధం లేదు. అది థియేటర్‌లో చూసి మీరు ఎంజాయ్ చేస్తారు. కడుపుబ్బా నవ్వుకుంటారు

**ఈ సినిమా ఎలా ఉండబోతుంది?**

.ఈ ఫుల్ ఎంటర్‌టైన్‌మెంట్ సినిమాలో కలర్‌ఫుల్ విజువల్స్, మ్యూజిక్ బాగుంటుంది. వెన్నెల కిషోర్. నరేష్ కామెడీ అలరిస్తుంది. ప్రతి పాత్ర మిమ్ములను నవ్విస్తుంది.

**మీరు సింగర్ అని విన్నాం?**

కూచిపూడి, సంగీతం నేర్చుకున్నాడు. సింగర్ టర్నింగ్ యాక్టర్‌ని. లిటిల్ హార్ట్స్‌లో చిన్న హమ్మింగ్ ఉంటుంది. ఆరంభం సినిమాలో ఓ పాట పాడాను. సింగింగ్ కూడా ఓపెన్‌గా ఉన్నాను. అవకాశాలు వస్తే పాడతాను.


**సుహాస్‌తో రెండో సినిమాలో చేయడం ఎలా అనిపించింది?**

నాకు చాలా ఫ్రెండ్లీ.. నాకు సపోర్ట్, చాలా మంచి నటుడు.

**సినిమాల్లోకి వెళుతున్నా అన్నప్పుడు మీ ఇంట్లో ఒప్పుకున్నారా?**

మా ఇంట్లో వెరీ సపోర్టింగ్.. వాళ్ల ఇచ్చిన అవకాశాన్ని మంచి సినిమాలతో ప్రూవ్ చేసుకున్నాను.

## 'శివ్ కైలాషోం కే వాసి' పాట పాడిన రాశీ ఖన్నా



మహా శివరాత్రి పర్వదినాన దేశవ్యాప్తంగా శివ కీర్తనలు ప్రతిధ్వని స్తున్నాయి. ఇక మహా దేవుడిపై తాజాగా రాశీ ఖన్నా పాడిన పాట ఇప్పుడు అందరి దృష్టిని ఆకట్టుకుంటోంది. తాను పాడిన పాటకు వస్తున్న ప్రశంసలపై రాశీ ఖన్నా సోషల్ మీడియా వేదికగా స్పందిస్తున్నారు. 'శివ్ కైలాషోం కే వాసి' అనేది అహంకారాన్ని నాశనం చేయడం, అంతరంగాన్ని మేల్కొల్పడం, అతీంద్రియత శక్తి అయిన అయిన మహా దేవుడి మీద భక్తిని చాటే ప్రార్థనగా నిలుస్తుంది. 'మహా శివరాత్రి' అత్యంత పవిత్రమైన పర్వదినం కావడం, ఇలాంటి ఓ విశిష్టమైన రోజున పాట పాడటం ఎంతో ఆనందంగా ఉంది అని రాశీ తెలిపారు.ఈ పాటలో రాశీ కనిపించిన తీరు, ఆమె వినయం, పలికించిన భావోద్వేగాలు అందరినీ ఎంతో ఆకట్టుకుంటున్నాయి. ఆమె స్వరం సైతం ఎంతో వినసొంపుగా, వినడానికి మనసుకు ఎంతో హాయిగా అనిపించేలా ఉంది. ఆమె పాడుతున్న విధానంలో ఒక నిశ్శబ్ద ప్రకాశం, ప్రశాంతత ఉంది. ఇదొక భక్తిపూర్వకమైన నిజాయితీ ప్రదర్శనలా కాకుండా ప్రార్థనలా అనిపిస్తుంది.అక్షయ్ కుమార్‌తో ప్రస్తుతం రాశీ ఖన్నా ఓ ప్రాజెక్ట్ చేస్తున్నారు. పవన్ కళ్యాణ్‌తో కలిసి ఉస్తాద్ భగత్ సింగ్ చిత్రంలో నటించిన సంగతి తెలిసిందే






# ఇషాన్ మ్యాచ్ ఫిక్సింగ్

**ఢిల్లీ:** టీమిండియా డైనమైట్ ఇషాన్ కిషన్ త్వరలో ఓ ఇంటివాడుకానున్నాడు. టీ20 ప్రపంచ కప్‌లో దుమ్మురేపుతున్న కిషన్... టోర్నీ ముగిశాక ప్రేయసి అదితి హుండియాతో కలిసి పెళ్లి పీట లెక్కబోతున్నాడుడు. ఇషాన్ తాత అనురాగ్ పాండే ఈ విషయాన్ని స్వయంగా వెల్లడించారు. ఇషాన్ ఎవరిని చేసుకున్నా అంగీకరించేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు. ఇప్పటికే ఇషాన్ సోదరుడు కూడా ప్రేమించిన అమ్మాయినే పెళ్లి చేసుకున్నారు. పిల్లల సంతోషం కంటే తమకు కావాల్సిందేమి టనీ అనురాగ్ పాండే అన్నారు. దీంతో అదితి హుండియాతో ఇషాన్ పెళ్లి దాదాపు ఖాయమని అభిమానులు భావిస్తున్నారు.

ఇషాన్ ప్రేయసి అదితి జైపూర్‌కు చెందిన ప్రముఖ మోడల్. ఆమె 2017లో మిస్ ఇండియా ఫైన లిస్టుగా నిలిచారు. 2018లో మిస్ దివా సూపర్ నేషనల్ టైటిల్ గెలుచుకుని గ్లామర్ ప్రపంచంలో తనదైన ముద్రవేశారు. అదితి తరచుగా ఇషాన్ మ్యాచ్‌లను చూసేందుకు స్టేడియానికి వచ్చే అదితి కెమరాల ఫోకస్‌లో పడ్డారు. ముఖ్యంగా 2022 ఐపీఎల్ సమయంలో ఆమె ఫోటోలు వైరల్ అవడం తో వీరిద్దరి ప్రేమ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. సోషల్ మీడియాలో కూడా చాలా యాక్టివ్‌గా ఉంటూ ఇషాన్ సక్సెస్‌ను ఎపుడూ అభినందిస్తుంటారు. త్వరలోనే ఈ జంట తమ వివాహ తేదీని అధికారికంగా ప్రకటించే అవకాశం ఉందని నెటిజన్లు అంచనా వేస్తున్నారు.

# ఒమర్ జాయ్ ఆల్‌రౌండ్ షో



**ఢిల్లీ:** టీ20 ప్రపంచకప్‌లో అఫ్ఘనిస్తాన్ బోణీ చేసింది. గ్రూప్-డి లీగ్ మ్యాచ్‌లో యూఏఈపై ఐదు వికెట్ల తేడాతో గెలుపొందింది. మొదట బ్యాటింగ్ చేసిన యూఏఈ 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 160 పరుగులు చేసింది. ఆరంభంలోనే వికెట్ కోల్పోయినా అలీషాన్(31 బంతుల్లో 40 రన్స్), షోయబ్ ఖాన్(48 బంతుల్లో 69 రన్స్) మూడో వికెట్‌కు 84 పరుగులు జోడించడంతో యూఏఈ 150 మార్క్ దాటింది. అఫ్ఘనిస్తాన్ బౌలర్లలో అజ్మతుల్లా ఒమర్‌జాయ్ నాలుగు వికెట్లు పడగొట్టాడు.

161 పరగుల లక్ష్యాన్ని ఆఫ్ఘనిస్తాన్ మరో నాలుగు బంతులు మిగిలివుండగానే 5 వికెట్లు కోల్పోయి అందుకుంది. ఇబ్రహీం జద్రాన్ 53 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలిచాడు. మిగతా వారిలో రసూలీ 33 రన్స్, అజ్మతుల్లా ఒమర్ జాయ్ 40 రన్స్‌తో రాణించారు. మూడు మ్యాచ్‌ల్లో ఆఫ్ఘనిస్తాన్‌కు ఇది తొలి విక్టరీ.

# హాకీ ప్రొలీగ్ : భారత్ హాకీ వీరుల పూర్ షో



**రూర్కెలా :** హాకీ ప్రొ లీగ్‌లో భారత జట్టు పేలవ ప్రదర్శన కొనసాగుతోంది. సొంత గడ్డపై జరిగిన ఎఫ్ఐహెచ్ ప్రొలీగ్ అంచె పోటీల్లో ఆడిన నాలుగు మ్యాచ్‌ల్లోనూ పరాజయాలే ఎదురయ్యాయి. చివరి లీగ్ మ్యాచ్‌లోనూ అర్జెంటీనా చేతిలో 2-4తో భారత హాకీ జట్టు ఓటమి చూసింది. ప్రొ లీగ్‌లో తొమ్మిది జట్లు పోటీపడుతున్నాయి. భారత్ అంచె పోటీల్లో నాలుగు మ్యాచ్‌ల్లోనూ ఓడి భారత్ 8వ స్థానంలో నిలిచింది. తదుపరి ప్రొలీగ్ ఆస్ట్రేలియాలో జరగనుంది. హోబర్ట్ వేదికగా ఈనెల 21న స్పెయిన్‌తో, 22న అతిథ్య ఆస్ట్రేలియాతో, 24న మరోసారి స్పెయిన్, 25న ఆస్ట్రేలియాతో భారత్ మొత్తం నాలుగు మ్యాచ్‌లు ఆడనుంది.

# పాక్‌ది చెత్త టీమ్

## ఆ నలుగురు వేస్ట్ - మాజీ క్రికెటర్లు గరంగరం



**లాహోర్ :** కొలంబో వేదికగా జరిగిన హై వోల్టేజ్ మ్యాచ్‌లో పాకిస్థాన్ పోరాడకుండానే భారత్ చేతిలో ఘోరంగా ఓటమి పొందడంతో ఆ జట్టుపై ఇంటా, బయటా ఆగ్రహం వ్యక్తం అవుతోంది. ముఖ్యంగా పాక్ మాజీలు తమ జట్టుపై దుమ్మెత్తి పోస్తున్నారు. చిరకాల ప్రత్యర్థి పై మ్యాచ్‌లో పాక్ ఆటతీరును తప్పు పడుతున్నారు. సరైన వ్యూహం లేకుండానే బరిలోకి దిగారని మండిపడుతున్నారు.

బాబర్, షాబాద్, షాహీన్‌లకు ఇప్పటికే చాలా అవకాశాలు వచ్చాయని, అయినా విఫలమవుతున్నారని షాహిద్ అఫ్రిది ఫైర్ అయ్యాడు. తన చేతుల్లో అధికారం ఉంటే వీరిని జట్టులోకి తీసుకోనని కుండబద్దలు కొట్టారు. అలాగే ఆరుగురు స్పిన్నర్లతో బరిలోకి దిగడం సరైన నిర్ణయం కాదని మాజీ కెప్టెన్ జావెద్ మియాందాద్ అన్నాడు. పాతవాళ్లను తప్పించి పాక్ టీ20 జట్టును కొత్త ఆటగాళ్లతో నింపాల్సిన సమయం వచ్చిందని మహ్మద్ యూసుఫ్ పేర్కొన్నాడు. మరోవైపు బాబర్ ఆజమ్ బ్యాటింగ్ వైఫల్యం పాక్‌ను వెంటాడుతోందని షోయబ్ అక్తర్ అన్నాడు.

# ఆస్ట్రేలియా జట్టులోకి స్టీవ్ స్మిత్



**కొలంబో:** టీట్వంటీ ప్రపంచకప్‌లో ఆడుతున్న ఆస్ట్రేలియా జట్టులోకి స్టీవ్ స్మిత్‌ను తీసుకున్నారు. గాయపడ్డ పేసర్ జోష్ హేజిల్‌వుడ్ స్థానంలో స్మిత్‌ను తీసుకున్నట్లు ఐసీసీ టెక్నికల్ కమిటీ ధృవీకరించింది. కెప్టెన్ మిచెల్ మార్ష్, ఆల్‌రౌండర్ మార్కస్ స్టోయినీస్ గాయాలతో ఇబ్బంది పడుతుండడంతో బ్యాటింగ్ విభాగాన్ని పటిష్టం చేసేలా స్మిత్‌ను ఎంపికచేశారు. జింబాబ్వే చేతిలో అనూహ్య పరాజయం కూడా మరో కారణం. శ్రీలంకలోని పిచ్‌లు స్పిన్‌కు అనుకూలిస్తుండడం, స్పిన్నర్లను ఎదుర్కోవడంలో చక్కగా ఎదుర్కోగల స్మిత్ జట్టులోకి రావడం ఆస్ట్రేలియాకు బూస్టింగ్ ఇవ్వనుంది.



## బెన్, స్టీవర్ట్ మెరుపులు - పోరాడి ఓడిన ఇటలీ

# సూపర్-8లో ఇంగ్లాండ్

**కోల్‌కతా:** ఇటలీ క్రికెట్ కూనే అయినా మేటి టీమ్ ఇంగ్లాండ్‌ను వణికించింది. గెలుపు ముంగిట బోల్తా పడింది. బెన్, స్టీవర్ట్ మెరుపులతో అలరించారు. ఈడెన్‌గార్డెన్స్ వేదికగా జరిగిన గ్రూప్-సి టీ20 ప్రపంచ కప్ మ్యాచ్‌లో ఇంగ్లాండ్ 24 రన్స్‌తో నెగ్గి ఊపిరిపీల్చుకుంది. 3 విజయాలతో సూపర్ 8కు చేరింది.

మొదట బ్యాటింగ్ చేసిన ఇంగ్లాండ్ ఆరంభంలోనే జాస్ బట్లర్ వికెట్ కోల్పోయింది. మరో ఓపెనర్ ఫిల్ సాల్ట్(15 బంతుల్లో 28 రన్స్), జాకబ్ బెతెల్(20 బంతుల్లో 23 రన్స్) ధాటిగా ఆడుతూ స్కోరు వేగం పెంచారు. టామ్ బాటన్ కూడా వస్తూనే పరుగులు సాధించాడు. స్టీవర్ట్ రెండు వికెట్లతో మధ్య ఓవర్లలో ఇంగ్లాండ్ మరోసారి తడబడింది. స్లాగ్ ఓవర్లలో విల్ జాక్స్ మెరుపు ఇన్నింగ్స్ ఆడాడు. కేవలం 22 బంతుల్లోనే మూడు ఫోర్లు, నాలుగు సిక్స్‌లతో అర్ధసెంచరీ సాధించడంతో ఇంగ్లాండ్ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్లకు 202 పరుగులు చేసింది.

203 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఇటలీని తొలి ఓవర్లోనే రెండు వికెట్లఉ తీసి జోఫ్రా అర్చర్ దెబ్బతీశాడు. ఓవర్టన్ కూడా మరో వికెట్ తీయడంతో ఇటలీ 22 పరుగులకే మూడు వికెట్లు కోల్పోయింది. ఈ దశలో జస్టిన్ (34 బంతుల్లో 43) అండగా బెన్ మనెంటి.. ఇంగ్లాండ్ బౌలర్లపై సిక్సర్లతో విరుచుకుపడ్డాడు. ఏకంగా ఆరు సిక్స్‌లు, మరో నాలుగు బౌండరీలతో 25 బంతుల్లోనే 60 పరుగులు సాధించాడు. క్రీజ్‌లోకి వచ్చిన గ్రాంట్ స్టీవర్ట్(23 బంతుల్లో 45రన్స్) బ్యాట్‌కు పనిచెప్పి ఇంగ్లాండ్‌ను బెంబేలెత్తించాడు. ఓ దశలో ఇటలీ గెలిచే ఊపులో కనిపించింది. అయితే సామ్ కుర్రాన్.. మొదట స్టీవర్‌తో పాటు వెంటవెంటనే మరో రెండు వికెట్లు తీసి ఇటలీని 178 పరుగులకు పరిమితం చేశాడు. ఇంగ్లాండ్‌కు గెలుపందించాడు.

**సంక్షిప్త స్కోర్లు: ఇంగ్లాండ్-202/7**(20 ఓవర్లలో) (విల్ జాక్స్ 53 నాటౌట్, టామ్ బాంటన్ 30, ఫిల్ సాల్ట్ 28, స్టీవర్ట్ 2/51, కలుగమగే 2/41); **ఇటలీ-178 ఆలౌట్**(20 ఓవర్లలో) (బెన్ మనెంటి 60, గ్రాంట్ స్టీవర్ట్ 45, జస్టిన్ 43, సామ్ కుర్రాన్ 3/22, జేమీ ఓవర్టన్ 3/18)

# వింటర్ ఒలింపిక్స్‌లో క్లేబో రికార్డు



**ఇటలీ:** నార్వే క్రాస్ కంట్రీ స్కీయర్ జోహానెస్ క్లేబో చరిత్ర సృష్టించాడు. తాజాగా 4 ఇంటూ 7.4 కిలోమీటర్ల రిలే టీమ్‌లో నార్వేకు స్వర్ణం అందించాడు. ఇటలీలో జరుగుతున్న వింటర్ ఒలింపిక్స్‌లో ఆరో స్వర్ణాన్ని, ఓవరాల్ గా తొమ్మిదో గోల్డ్ మెడల్‌ను తన ఖాతాలో వేసుకున్నాడు. వింటర్ ఒలింపిక్స్‌లో అత్యధిక స్వర్ణాలు గెలుపొందిన ఒకే ఒక్కడుగా క్లేబో నిలిచాడు. 2018 ప్యాంగ్‌చాంగ్ వింటర్ ఒలింపిక్స్‌లో మొదటిసారి బరిలోకి దిగిన క్లేబో మూడు స్వర్ణాలు, ఆ తర్వాత బీజింగ్ వింటర్ ఒలింపిక్స్‌లో ఒక సిల్వర్, ఒక బ్రాంజ్ మెడల్ గెలుపొందాడు. ఈ వింటర్ ఒలింపిక్స్‌లో క్లేబో అద్భుత ప్రదర్శన ఇస్తున్నాడు. మొత్తంగా ఆరు స్వర్ణాలు అందుకున్నాడు. రిలే టీమ్‌తో కలిసి ఈ ఫీట్ అందుకోవడం గర్వంగా ఉందని క్లేబో పేర్కొన్నాడు.

# టోకుధరల సూచీ ద్రవ్యోల్బణం1.81%




**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 16:** భారత్ టోకుధరల సూచీ ద్రవ్యోల్బణం జనవరిలో 1.81శాతంగా స్థిరపడింది. పదినెలల గరిష్టానికి చేరింది. గత ఏడాది డిసెంబరునెలలో 0.83శాతం మాత్రమే ఉన్న ఈ ద్రవ్యోల్బణం ఒక్కసారిగా 1.81శాతానికి పెరిగింది. ద్రవ్యోల్బణ గణాంకాలను వాణిజ్యమంత్రిత్వశాఖ సోమవారం విడుదలచేసింది. ఉత్పత్తిరంగ ప్రాథమిక ఖనిజాలు, ఇతర ఉత్పత్తిరంగా వస్తువులు, ఆహారేతర ఉత్పత్తులు, ఆహార ఉత్పత్తులు, వస్త్ర పరిశ్రమ ఉత్పత్తులధరలు పెరగడమే ఇందుకు కీలకం. జనవరిలో ఆహార ఉత్పత్తులధరలుపెరిగాయి. దీనితో ద్రవ్యోల్బణం 1.41శాతానికి పెరిగాయి. ప్రైమరీ ఆర్టికల్స్ వ్యవసాయ ఉత్పత్తులు, ఖనిజాలు, ముడిచమురు వంటివి జనవరిలో 0.15శాతం తగ్గాయి. ఆహార ఉత్పత్తులధరలు కూడా 1.79శాతం తగ్గాయి. ఖనిజవనరుల ధరలు 0.47శాతంతగ్గాయి. ఇక ఆహారేత్తర ఉతప్పత్తులధరలు మాత్రం ప్రియంగా మారాయి. 5.32శాతానికి పెరిగినట్లు తేలింది. ముడిపెట్రోలియం, సహజవాయుధరలు 4.27శాతం పెరిగాయి. చమురు, ఇంధన ధరలు 1.62శాతం జనవరిలో తగ్గినట్లు తేలింది. విద్యుత్‌ధరలు 2.91శాతం, మినరల్ ఆయిల్ 1.68శాతంతగ్గితే బొగ్గుధరలు మాత్రం 0.73శాతంపెరిగాయి. తయారీ రంగ ఉత్పత్తులు 1.30శాంపెరిగాయి. మొత్తం 22 ఉత్పత్తిరంగ గ్రూపుల్లో 19 విభాగాల్లో ధరలు పెరిగాయి. మూడు ధరలు తగ్గాయి. బేసిక్ మెటల్స్, ఆహార ఉత్పత్తులు, వస్త్రపరిశ్రమ, విద్యుత్ సామగ్రి, ఇతర ఉత్పత్తిరంగ వస్తువులు వీటిలో ఉన్నాయి. ఫార్మా రంగ ఉత్పత్తులు, యంత్రసామగ్రి, ఫర్నిచర్ వంటివి మాత్రం డిసెంబరుతో పోలిస్తే తగ్గాయి.



# లక్ష దిగువకు రానున్న పసిడి!

## ఆర్థిక వేత్తల విభిన్న అంచనాలు

**ముంబై, ఫిబ్రవరి 16:** బంగారం ధరలు సమీప భవిష్యత్తులో భారీగా పడిపోయే అవకాశం ఉందని, 2027 చివరి నాటికి 10 గ్రాముల బంగారం ధర రూ.లక్ష లోపునకు దిగిరావొచ్చని ఆర్థిక వేత్తలు విశ్లేషిస్తున్నారు. రికార్డు గరిష్ఠాలకు చేరిన పసిడి ధరలు ఇప్పటికే కొంతమేర తగ్గుముఖం పట్టిన నేపథ్యంలో, ఈ కరెక్షన్ మరింత లోతుగా ఉండబోతోందన్న అంచనాలున్నాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో స్పాట్ గోల్డ్ ధర ఔన్సుకు సుమారు 5వేల డాలర్ల వద్ద ట్రేడ్ అవుతోంది. ఇది జనవరిలో నమోదైన గరిష్ఠ స్థాయి 5,626 డాలర్లతో పోలిస్తే తక్కువే. ఇక భారత మార్కెట్లో 10 గ్రాముల బంగారం ధర సుమారు రూ.1,56,200 వద్ద ఉంది. జనవరిలో నమోదైన ఆల్‌టైమ్ హై రూ.1,80,779తో పోలిస్తే 13.5 తగ్గింది. 2027 చివరి నాటికి కామెక్స్ గోల్డ్ ధర ఔన్సుకు మూడువేలు డాలర్ల స్థాయికి, భారత మార్కెట్లో తులం బంగారం ధర రూ.90 వేల నుంచి రూ.లక్ష మధ్యకు స్థిరపడవచ్చని అంచనా. ప్రపంచ రాజకీయ పరిణామాలు, రష్యా తిరిగి అమెరికా డాలర్లతో వాణిజ్య లావాదేవీలు ప్రారంభించవచ్చనే వార్తలు ఇందుకు కారణంగా భావిస్తున్నారు. డాలర్‌పై ఆధారపడటాన్ని తగ్గించుకునే (డీడాలరైజేషన్) ఒత్తిడి తగ్గి, సెంట్రల్ బ్యాంకులు బంగారం కొనుగోళ్లను తగ్గించే అవకాశం లేకపోలేదు. 2025 ఆగస్టులో ఔన్సు బంగారం ధర 3,335 డాలర్లుగా ఉన్నప్పుడు, అది 2,800 డాలర్లకు పడిపోతుందని ప్రముఖ ఆర్థికవేత్త అమిత్‌గోయల్ అంచనా వేశారు. అయితే అందుకు విరుద్ధంగా రికార్డుస్థాయికి చేరింది. ఈ పెరుగుదలను "క్లాసిక్ కమొడిటీ బబుల్"గా గోయల్ పేర్కొన్నారు. జేపీ మోర్గాన్, ఏఎన్‌జెడ్ వంటి ఇతర సంస్థల విశ్లేషకులు మాత్రం భిన్నమైన అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. సెంట్రల్ బ్యాంకులు, ఇన్వెస్టర్ల నుంచి డిమాండ్ కొనసాగుతుందని, 2026 చివరి నాటికి బంగారం ధర ఔన్సుకు 5వేలనుంచి 5,800 డాలర్ల స్థాయికి చేరవచ్చని వారి అంచనాలున్నాయి. మార్కెట్ ప్రస్తుతం అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్ల నిర్ణయాలు, భౌగోళిక రాజకీయ పరిణామాలపై ఆధారపడి తీవ్ర ఒడుదొడుకులకు లోనవుతోంది. ఈ నేపథ్యంలో ఇన్వెస్టర్లు అప్రమత్తంగా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు.

# భారత్ వాణిజ్యలోటు 34.68 బిలియన్ డాలర్లు

## ఈవారంలోనే 18శాతానికి సుంకాల తగ్గింపు అమలు



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 16:** భారత వాణిజ్య ఎగుమతులు 0.6శాతంపెరిగి జనవరినెలలో 36.56 బిలియన్ డాలర్లకు చేరినట్లు తేలింది. భౌగోళిక ఉద్రిక్తతలు పెరుగుతున్నప్పటికీ భారత్ ఎగుమతులు మాత్రం వృద్ధిపథంలో ఉన్నాయని వాణిజ్యశాఖ ప్రకటించింది. అలాగే దిగుమతులు కూడా 19శాతంపెరిగి 71.24 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. ప్రత్యేకించి బంగారం, వెండి దిగుమతులు పెరిగాయి. వాణిజ్యలోటు గత ఏడాది ఇదే కాలంలో ఉన్న 23.43 బిలియన్ డాలర్లతోపోలిస్తే 34.68 బిలియన్ డాలర్లకు పెరిగింది. గత ఏడాది డిసెంబరులో కూడా వాణిజ్యలోటు 25 బిలియన్ డాలర్లుగా ఉంది. వాణిజ్యకార్యదర్శి రాజేష్ అగర్వాల్‌మాట్లాడుతూ వాణిజ్య ఎగుమతి, దిగుమతులు, సేవలరంగ ఎగుమతులు మాత్రం సానుకూలంగానే ఉన్నాయని అన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 860 బిలియన్ డాలర్లవరకూ ఉంటాయని అన్నారు. సమిష్టిగా చూస్తే వాణిజ్యం, సేవలపరంగా చూస్తే 6.15శాతం పెరిగి 720.76బిలియన్ డాలర్లుగా ఉన్నాయని రాజేశ్ వెల్లడించారు. ఇదిలా ఉండగా అమెరికా ప్రస్తుతం ఉన్న 25శాతం ట్యారిఫ్‌లను 18శాతానికి తగ్గిస్తుందనిఈవారంలోనే ఈ తగ్గింపు ఉంటుందని తెలిపారు. జాప్యం జరిగినపక్షంలో భారత ప్రతినిధిబృందం చర్చఇస్తుందని అన్నారు. వచ్చేవారంలోనే ప్రతినిధిబృందం అమెరికాకువెళుతుందన్నారు. 18శాతం తగ్గింపు అనేది ముందు అమలుకు తీసుకురావాలని ప్రత్యేకించి అమెరికాకు అల్టిమేటమ్ ఇచ్చినట్లు ఆయన అన్నారు.

# జనవరినెలలో చెలామణీలో ఉన్న నగదు రూ.40లక్షల కోట్లు!

**ముంబయి, ఫిబ్రవరి 16:** యూపిఐ లావాదేవీలు రికార్డుస్థాయిలో కొనసాగుతుండటం, క్యాష్ విత్‌డ్రాలు కూడా ఎటిఎంలనుంచి పెరుగుతున్నా చెలామణీలో ఉన్న నగదు మాత్రం పెరిగింది. కరెన్సీటు జిడిపి నిష్పత్తి ప్రస్తుతం రికార్డుస్థాయికి వెళ్లింది. జనవరిలో 40 లక్షలకోట్లు నగదు చెలామణీలో ఉన్నట్లు తేల్చింది. వార్షిక వృద్ధి 11.1శాతంగా ఉంది. గత ఏడాది ఇదే 5.3శాతం మాత్రమే ఉంది. అదే చెలామణీలో ఉన్న నగదు అంటే సిఐసి 88,517 కోట్లనుంచి రూ.2.76 లక్షలకోట్లకు పెరిగింది. అలాగేప్రజలవద్ద ఉన్న కరెన్సీ సిడబ్ల్యుపి ప్రకారం చూస్తే చెలామణీలో ఉన్న కరెన్సీలో 97.6శాతంగా ఉందని అంచనా. అంటే ఆల్‌టైమ్ రికార్డుస్థాయి 39 లక్షలకోట్లుగా ఉన్నట్లు జనవరిలో ఆర్థికవేత్తలు అంచనావేసారు. ఎస్‌బిఐ ముఖ్య ఆర్థికవేత్త సౌమ్యకాంతిఘోష్ మాట్లాడుతూ ప్రజలవద్ద ఉన్న కరెన్సీ కరోనా మహమ్మారి తర్వాత గణనీయంగా పెరిగిందని రూ.4.6 లక్షలకోట్లుకుపైగా పెరిగినట్లు వెల్లడించారు. అయితే నగదు జిడిపిల నిష్పత్తిమాత్రం ఇటీవలి కాలంలో 14.4శాతంనుంచి 11శాతానికి తగ్గింది. కర్ణాటక, తమిళనాడు, కేరళ, బెంగాల్ వంటి రాష్ట్రాల్లో ఎటిఎంలనుంచి క్యాష్ విత్రాలు పెరిగినట్లు ఎస్‌బిఐ ఆర్థికవేత్త తెలిపారు. చిరువ్యాపారాలకు జిఎస్టీ నోటీసులు వెళ్లడం, చిన్నవ్యాపారులు, వెండాలర్లకు కర్ణాటకలో ఈ నోటీసులు అందయి. 40 లక్షలు దాటిన యుపిఐ లావాదేవీలు జరిపిన వారికి ఈ నోటీసులు ఇచ్చారు. ఈ విధానంతమిళనాడు, కేరళ, బెంగాల్, ఛత్తీస్‌ఘర్ రాష్ట్రాలను కూడా ప్రభావితంచేసింది. ఎటిఎంలద్వారా విత్‌డ్రాలు రూ.37 కోట్లు.

వాణిజ్యం

KWALITY WALL'S™

## యూనిలీవర్‌తో వేరుపడిన తర్వాత స్వతంత్ర సంస్థగా క్వాలిటీవాల్స్ లిస్టింగ్

# రూ.31వద్ద ట్రేడ్ అయిన షేర్లు

**ముంబయి, ఫిబ్రవరి 16:** హిందూస్తాన్ యూనిలీవర్‌తో డీలిస్టింగ్ అయిన తర్వాత ఐస్‌క్రీమ్‌బ్రాండ్ క్వాలిటీ వాల్స్ రెండంకెల వృద్ధిని సాధించే లక్ష్యంతో దూసుకుపోతోంది. కంపెనీ రూ.7300 కోట్ల విలువైనదిగా నిర్ధారించారు. సోమవారం షేర్లు 31చొప్పున ట్రేడ్ అయ్యాయి. ఐస్‌క్రీమ్ మార్కెట్లలో తలసరి వినియోగం 400 నుంచి 500 మిలీలీటర్లుగా ఉందని ఇప్పటికే సర్వే సంస్థలు అంచనాలు వేసాయి. క్వాలిటీ వాల్స్ సిఎఫ్ఓ ప్రశాంత్‌ప్రేమ్‌రాజ్‌కా మాట్లాడుతూ తలసరి వినియోగం పెరగాల్సి ఉందని మార్కెట్‌లో సగం వాటా అసంఘటి తరంగంలోనే ఉందని, ప్రీమియం కేటగిరీలో మార్కెట్ పెరగాల్సి ఉందని సిఎఫ్ఓ అన్నారు. క్వాలిటీ వాల్స్ ఇండియాకు మార్కెట్‌లో రెండు లక్షలకుపైగా కూలర్లు ఉన్నాయని, వీటిని పదిలక్షలకు పెంచే లక్ష్యంతో ఉన్నట్లు తెలిపారు. ప్రతి ఏటా 50 నుంచి 60 వేల ఔట్‌లెట్లు తెరవాలన్న లక్ష్యంతోపనిచేస్తున్నట్లు తెలిపారు.

ది మాగ్నమ్ ఐస్‌క్రీమ్ కంపెనీ క్వాలిటీ వాల్స్ ఇండియాలో 26శాతం వాటాను 21.33 షేరుధరకు మొత్తం 1303 కోట్లు ఆఫర్ ఇచ్చింది. అయితే ఇప్పటికిప్పుడు క్వాలిటీ వాల్స్ స్వతంత్ర సంస్థగా మార్కెట్‌లో రన్ అవుతోంది.

# లాభాల్లో ముగిసిన సెన్సెక్స్ నిఫ్టీ!

## బ్యాంకులు, ఫైనాన్స్ కౌంటర్ల మద్దతు

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి16:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఇవాళ భారీ లాభాలతో ముగిశాయి. బ్యాంకింగ్ స్టాక్స్‌లో జోరుగా కొనుగోళ్లు జరగడం సూచీలకు కలిసొచ్చింది. దాంతో గత రెండు రోజుల వరుస నష్టాలకు బ్రేక్ పడింది. ఉదయం 82,480.40 పాయింట్ల వద్ద నష్టాల్లో ప్రారంభమైన బాంబే స్టాక్ ఎక్స్చేంజ్ సూచీ సెన్సెక్స్.. క్రమంగా కోలుకుని లాభాలబాట పట్టింది. చివరికి సెన్సెక్స్ 650 పాయింట్ల లాభంతో 83,277.15 వద్ద ముగియగా నిఫ్టీ 211.65 పాయింట్ల లాభంతో 25,682.75 వద్ద స్థిరపడింది. డాలర్‌తో రూపాయి మారకం విలువ 90.66గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్, ఎన్టీపీసీ, ఐటీసీ షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. టెక్ మహీంద్రా, మారుతీ సుజుకీ, బజాజ్ ఫైనాన్స్, ట్రెంట్, మహీంద్రా అండ్ మహీంద్రా షేర్లు నష్టపోయాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ 67.44 డాలర్ల వద్ద కొనసాగుతుండగా బంగారం ఔన్సు 5,033 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. బిఎస్ఇలో




మిడ్‌క్యాప్‌సూచీ 0.64శాతంపెరిగితే స్మాల్‌క్యాప్‌సూచీ మాత్రం 0.16శాతం క్షీణించింది. మార్కెట్లపరంగా బిఎస్ఇలో 1747 షేర్లుపెరిగితే 2565 షేర్లు దిగజారాయి. 201 కంపెనీల షేర్లు స్థిరంగా కొనసాగాయి. మార్కెట్ల దోరణి ప్రతికూలంగానే ఉన్నా చివరినిమిషంలో ఎంపికచేసిన రంగాల్లో కొనుగోళ్లుపెరిగాయి. ఎంసిఎక్స్‌లో పసిడి ఫ్యూచర్లు ఏప్రిల్ 2 నాటి సెటిల్మెంట్లు రూ.1,55,333గా కొనసాగాయి. విక్రమ్ ఇంజినీరింగ్ 10.21శాతం,

ఓలా ఎలక్ట్రిక్ మొబిలిటీ 6,70శాతం, శక్తిపంప్స్ ఇండియా 11.83శాతంచొప్పున క్షీణిస్తే జికె ఎనర్జీ ఐదుశాతం ఎగువన ఉగిసింది. క్రిసిల్ కూడా 3.38శాతం పైకి ఎగబాకింది. క్వాలిటీ వ్స్ షేర్లు 38.15బిఎస్ఇలోను, 40.20 చొప్పున ఎన్ఎస్ఇలోను ట్రేడ్ అయ్యాయి. ప్రెసిసన్ వైర్స్ ఒడియా 15.14శాతం పెరిగాయి. కార్‌ట్రేడ్ టెక్ 5.37శాతంపెరిగితే టెన్నెకో క్లీన్ ఎయిర్ ఇండియా 2.19శాతం, టిటాఘర్ రైల్ సిస్టమ్స్ 1.59శాతం క్షీణించింది.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.